

ఆంధ్ర సచిత్ర వారపత్రిక



1-8-80
90 పైసలు



అమ్మా! నాబూటు ఎంతబాగా మెరుస్తుందో చూడు.
టింకూలాంటి బాబు మీకు ఉన్నప్పుడు తెల్ల బట్టలు అతి త్వరగ మురికైపోతాయి. అయినా పరవాలేదు. రీగల్ ప్రతి ఉతుకుకు అధిక తెల్లదనాన్నిస్తుంది.
Regal
DETERGENT CAKE
రీగల్‌కు గల అధిక తెల్లదనాన్నిచ్చే శక్తి మీ బట్టలను తళతళలాడే తెలుపుతోను, వెలుగుతోను మెరిసేలా చేస్తుంది. రీగల్‌కు గల అధిక నురుగునిచ్చే శక్తి బట్టలలోనికి చొచ్చుకొనిపోయి ఎంతటి మురికినైనా తొలగిస్తుంది. రీగల్‌కు గల పొదుపు శక్తి ఏ యితర డిటెర్జెంట్ సబ్బుకన్న ఎక్కువ ఉతుకులు యిస్తుంది. రీగల్‌ను మీ కుటుంబపు డిటర్జెంట్ సబ్బుగా చేసుకోండి.
రీగల్
ఇండియాలో అత్యధిక శక్తిగల డిటర్జెంట్ బట్టల సబ్బు



ఎక్కువ సొదుపు మరియు తెలుపు కావాలంటే
సబ్బుల మాట మరవండి, తెండి
సూపర్ 777 డిటర్జెంట్ బార్
* సబ్బుకంటే 1½ రెట్లు ఎక్కువ
ప్రపంచపు నం.1
డిటర్జెంట్
ఉతికే బార్
సూపర్ 777
మురికికి ముప్పు,
మెరుపుల
తెలుపు
SWASTIK
SUPER
777
Shilpi/DM 13A/80 Te.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

రచయితలకు గమనికలు

ఆంధ్ర సచిత్ర వారపత్రికకు కథలూ ఇతర రచనలు పంప దలచుకున్నవారు సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ–520 003 అన్న చిరునామాకి వ్రాయాలి.

కవరుమీద శీర్షిక పేరు పేర్కొనడం మంచిది. రచయితలు తమ పూర్తి పేరూ చిరునామా రచన చివరకూడా స్పష్టంగా వ్రాయాలి– కామీ ప్రతం జత చెయ్యాలి.

గేయాలు తిప్పి పంపబడవు. వీటి పరిశీలనకు కూడా సుమారు ఏడు నుంచి తొమ్మిది వారాల గడువు అవసరం.

* కథలుగానీ, ఇతర రచనలుగానీ తిప్పి పంపబడాలని కోరుకునే వారు– వారి స్వంత చిరునామా గల తగినన్ని తపాలాబిళ్ల లంటించిన కవరు పెట్టడం అవసరం;

* రచనల గురించి పంపిన వెంటనే కాక తొమ్మిది వారాల తరువాత మాత్రమే వాటిపై నిర్ణయం కోసం ఎదురుచూడడం మంచిది. రచనల గురించి ఉత్తర ప్రత్యుత్తరాలకి తావులేదు కాని–తప్పనిసరి పరిస్థితులలో వాటిపై వ్రాయవలసివస్తే రచయితలు– రచన పేరు– అది పంపిన తేదీ, వివరంగా వ్రాయండే, వాటి గురించి పరిశీలించడం కష్టం.

మా కార్యాలయానికి రచనలు తెచ్చి ఇచ్చేవారు కూడా పై నిబంధనలన్నీ పాటించాలి. వారికి కూడా స్వంత చిరునామా గల తగినన్ని తపాలా బిళ్ళ లంటించిన కవరు జత చెయ్యాలి అన్న నిబంధన వర్తిస్తుంది.

* కార్టూన్లు పంపేవారు కూడా 8 వారాలలోగా మా మీద ఉత్తరాల దాడి చెయ్యకూడదు... ప్రతి కార్టూన్ వెనుక పూర్తి పేరు, చిరునామా వ్రాయాలి.

* ప్రత్యేక సందర్భాలుగా వేసిన కార్టూన్ల కవర్లపై ఆ విషయం వ్రాస్తే వాటి పరిశీలన త్వరితంగా జరుగుతుంది.

* కార్టూన్ల ఎంపిక తరువాత వాటి ప్రచురణ వీలు వెంబడి జరుగుతుంది.

* రచయితలకు కార్టూనిస్టులకు ఒక్క ఉత్తరాలు, ప్రశ్నావళి, డాక్టర్ సలహాల శీర్షికలో 'వద్దు' వారికి తప్ప తతిమ్మా అందరికీ; అవి వద్దు "ప్రతు"అను– కాలక్రమంలో వాటి పారితోషికాలను పంపుతాము; కాపీలు టపాలో పోయే ప్రమాదం వుంటుందే తప్ప పంపకపోవడం జరుగదు. —సం.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :

దేశోద్ధారక కాశీనాధుని

నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు :

[1938–1972]

శుక్రవారం : 1–8–'80

రవుద్రినామ సం. ఆషాఢ బ. పంచమి

సంపుటము 73 : సంచిక 45

సంపాదకుడు

శివలెంక రాధాకృష్ణ

*

పోస్టులో ఏడాది చందా రు. 49–40

ఆరు మాసాల చందా రు. 24–70

విడి ప్రతి వెల 90 పైసలు

ఆంధ్రపత్రిక కార్యాలయము

గాంధీనగరం, విజయవాడ–520 003

విషయానుక్రమణిక

అట్టమీద బొమ్మ :

'పిల్లి జమీందారోల్లో' అక్కినేని

కథలు :

సీరియల్ కథలు :

వ్యాసాలు, శీర్షికలు :

ఉత్తరాలు

ముఖచిత్రం

పండ్లమధ్య అమాయక పల్లె యువతిలాగా నవ్వులు చిందించుచున్న నటి మాధవి 4.7.80 ముఖ చిత్రం మా హృదయాలను దోచుకున్నది. పాపం! పసివాడు, విషవృక్షము కథలు ఆసక్తి కరంగా ఉన్నాయి.

కె. ఉష, ఎస్. పద్మ, టి. వాణి [కొండ పాటూరు]

యువతార

నటి రూప ముఖ చిత్రంతో వెలువడిన [11.7.80] మా అభిమాన పత్రికలోని ప్రతి శీర్షిక, కథలూ వగైరాలు ఎక్సలెంటుగా ఉన్నాయి.

ఇందులో అదనంగా 'యువతార' శ్రీ సంజయ్ గాంధి గురించి క్లుప్తంగా చక్కగా వివరించారు. మీరు ప్రచురిస్తున్న రెండు సీరియల్స్ హుందాగా సాగుతున్నాయి. ప్రచురించిన మూడు కథలలో చీకటి చిన్నబోయింది, జవాబులేని ప్రశ్న బాగున్నాయి.

అస్గర్ హుస్సేన్ [గిరింపేట]

జోకుల బడ్జెట్

11.7.80 వ తేదితో వెలువడిన మా అభిమాన వార పత్రిక పై ముఖ చిత్రం "రూప" నిండుతనంగా లేకపోయినా, పత్రికకు వన్నె తెచ్చింది.

సామాన్యుని సణుగుడులో వీరాజీగారు "కొత్త బడ్జెట్"ను సరస సల్లాపాలతో వ్రాసి, "రైల్వే లోటు బడ్జెట్"ను అలకతో, ఏకేసారు. తపాలా కవరు గురించి వ్రాసిన హాస్యోక్తి బాగుంది. ఈ సారి కార్టూన్లు నవ్వించలేదన్న కొరతను వీరాజీగారి "జోకుల బడ్జెట్" చక్కగా ముసి ముసి నవ్వులు తెచ్చి పెట్టింది. 'యువతార' గురించి బాగా వ్రాశారు. కథలు మూడూ బాగున్నాయి. సీరియల్స్ రెండూ చక్కగా సాగుతున్నాయి.


పెన్మెత్స సూరిబాబు, శ్రీను, కృష్ణ, వి.ఎస్. మూర్తి, విజయశేఖర్ రెడ్డి, నాగేంద్ర [హైదరాబాద్]

కథలు

జూలై పదకొండవ తేదీ ఆంధ్రసచిత్ర వార పత్రికలో 'చీకటి చిన్నబోయింది' అనే కథ ఒక్కటే నాకు నచ్చింది. 19 వ పేజీలోని చిత్రం కీ. శే. సంజయ్‌గాంధి గారు చిరస్మరణీయులు. కలర్ ఫోటో వేసివుంటే చాలా బాగుండేది.

నందిగామ మణిమోహన్‌కృష్ణ [హైదరాబాద్]

లోకంపోకడ



సీరియల్

జీవితగమ్యం

శ్రీమతి యర్రగుంట్ల వరలక్ష్మీదేవి

17

(గత సంచిక తరువాయి)

విమలమ్మ ఆరోగ్యం క్షీణించసాగింది. గుండెనొప్పి అప్పుడప్పుడు వస్తూంది. ఏలాగైనా కోమలికి వివాహం చేద్దామనే కోరిక ప్రబలిపోయింది. తనకున్న ఒక్క దిక్కు అన్న విశ్వనాధమే, అతడికే ప్రాధేయపూర్వకంగా ఉత్తరం వ్రాసింది. తన ఆరోగ్యం ఏమీ బాగోలేదనీ, తను బ్రతికుండగానే కోమలికి వివాహం జరుగకపోతే తరువాత కోమలికి వివాహమవుతుందో లేదో నన్న భయం తనకుందని, ఏలాగైనా వరుడ్ని చూడమనీ కోరింది.

విశ్వనాధం ఒకసారి వచ్చి చెల్లెల్ని చూసి పోయాడు. నిజమే! విమల చాలా చిక్కిపోయింది. మునపటి విమలమ్మకు ఇప్పటి విమలమ్మకు ఏమీ పోలికల్లేవు. శరీరం కాంతి, రంగు తగ్గిపోయాయి. కండ్లు లోతుకు పోగాయి. జుత్తు సగం నెరసిపోయింది. శరీరం బలహీనంగా ఉంది. ఆ కండ్లలో ఏదో దైన్యం, భీతి. విశ్వనాధం చలించి పోయాడు.

"సరేనమ్మా! నువ్వు బెంగపెట్టుకోకు. ఓ నెల్నాళ్ళలో నాలుగు వూర్లు తిరిగైనా సరే, సరైన సంబంధం కుదురుస్తాను. ఇకనుంచి నేను ఆ పనిమీదే ఉంటాను. నువ్వు నిశ్చింతగా ఉండు."

తను మాటిచ్చినట్లే వెతగ్గా, వెతగ్గా శ్రీకాకుళంలోనే ఎక్సైజు ఇన్‌స్పెక్టరుగా పనిచేస్తున్న కృష్ణమూర్తి అనే యువకుడు తటస్థపడ్డాడు. అతడి తండ్రి సబ్ రిజిస్ట్రారుగా పనిచేసి రిటైరయ్యాడు. అందరిలోకి పెద్దవాడు కృష్ణమూర్తి. బి. ఏ. పాసయ్యాడు. వయసు ఇరవైఏడు సంవత్సరాలు. అతడి తరువాత అమ్మాయికి రెండు సంవత్సరాల క్రితమే వివాహం చేశారు. సంవత్సరమైతగిన సంబంధం దొరికుతే చేద్దామన్న తలంపుతో ఉన్నాడు తండ్రి రామచంద్రయ్య. విశ్వనాధంగారు పనిచేసే ప్లీడరుగారికి దూరపు బంధువు ఈ రామచంద్రయ్య. ఆ ప్లీడరుగారే ఓ సందర్భంలో విశ్వనాధం చెవిలో ఈ భోగట్టా వేసారు.

విశ్వనాధం రామచంద్రయ్య ఇంటికి వెళ్ళాడు.

"నమస్కారమండి. నాపేరు విశ్వనాధం. మనం కొన్నాళ్ళ క్రితం ప్లీడరు బసవరాజుగారింట్లో కలిశాం, మీకు జ్ఞాపకముందో లేదో కాని నేను అతని ఆఫీసులో గుమాస్తాగా చేసి రిటైరయ్యాను. మీకు పెండ్లీడు కొచ్చిన అబ్బాయి ఉన్నాడని, మీ సంబంధం గూర్చి బసవరాజుగారు నాకు చెప్పారు. నాకో చెల్లెలుంది. ఆవిడ భర్త కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో చీఫ్ అకౌంటెంటుగా పనిచేస్తుండేవాడు. అతడు పదేళ్ళ క్రితం ఓ యాక్సిడెంటులో చనిపోయాడు. వాళ్ళది బహు దొడ్డ కుటుంబం. నా చెల్లెలికి ఒక కూతురు, ఒక కొడుకు మాత్రమే. ఆ కొడుకు బి. ఎస్‌సి. పాసై ఇప్పుడు టాటా కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ అమ్మాయికి ఇరవై సంవత్సరాల వయస్సుంది. మీరు ఈ సంబంధం చూస్తే బాగుంటుంది. మీ ఉద్దేశం కనుక్కుందామని వచ్చాను."

"చాలా సంతోషం. మీ గురించి, మీ కుటుంబ గౌరవాన్ని గురించి నా బంధువు బసవరాజు గొప్పగా చెప్పాడు. మీ అమ్మాయి చక్కనిదైతే మాకు చూడటానికెట్టి అభ్యంతరం లేదు. మీరు మరోలా అనుకోకపోతే నాదో చిన్న రిక్వెస్టు. మా ఆవిడ ఆరోగ్యమంతగా బాగలేదు. యిప్పట్లో ప్రయాణాలు చెయ్యలేదు- అందుకే దయచేసి ఆ పెండ్లిచూపులు ఈ ఊరులోనే మీ యింట్లో ఏర్పాటు చేయిస్తే బాగుంటుంది."

"దానికేంలెండి- వచ్చే వారం మంచి రోజు చూసి ఏర్పాటుచేసి మీకు నేను కబురంపుతాను. వెళ్ళొస్తానండీ నమస్కారం"

విశ్వనాధంకు సంతోషం కలిగింది.

జరిగిన కథ 7 విమలమ్మ భర్త గోపాలం బ్యాంకులో చీఫ్ అకౌంటెంటుగా పని చేస్తుంటాడు. వీరి పిల్లలు భాస్కర్, కోమలి, గోపాలం బావ రాఘవరావు విలాసపురుషుడు. ఉద్యోగంలో చేరిన దగ్గర్నుండి గోపాలం కూడబెట్టిన డబ్బును, వ్యాపారంలో నష్టమొచ్చిందనే నెపంతో రాఘవరావు నోటు వ్రాసి తీసుకుంటాడు. గోపాలం అన్న బలరాం కూతురు లక్ష్మి రామునాయుడిని ప్రేమిస్తుంది. అతనితో 'లేచి'పోతూ ఉత్తరం వ్రాసిపెట్టి పోతుంది. ఓ యాక్సిడెంట్‌లో గోపాలం మరణిస్తాడు. అతనికి వెనకతను వ్రాసిచ్చిన నోటును అపహరిస్తాడు రాఘవరావు. విమలమ్మ ఇంట్లో తన కుటుంబంతో అద్దెకుంటున్న ధనంజయరావు ఆమెను బలాత్కారం చేయబోగా, అతనిని ఇంటినుండి గెంటివేస్తుంది. మొదట్నుంచి అనుకుంటున్నట్లుగా, తన కూతురు కోమలిని శేఖర్‌కిచ్చి మేనరికం చేద్దామని అడగడానికి వచ్చిన విమలమ్మను రాఘవరావు అవమానిస్తాడు. తన మేనమామ విశ్వనాధం కూతురు సరోజిని కాదని, తమ ప్రక్క వాటాలో అద్దెకుంటున్న జనార్ధనస్వామి కూతురు శ్రీదేవిని ప్రేమించి పెండ్లి చేసుకొని ఆమె ద్వారా టాటా నగర్‌లో వచ్చిన ఉద్యోగంలో చేరాడు భాస్కర్. బలవంతం చేయబోయిన సత్యానికి తగినబుద్ధి చెబుతుంది కోమలి. తన పెద్దకొడుకు ఇంజనీరు శేఖర్ విషయంలో రాఘవరావు పెంచుకున్న ఆశలు అడుగంటిపోతాయి, అతను పైసాకట్నం తీసుకోకుండా ఇన్‌కంటాక్స్ ఆఫీసర్ ఈశ్వరయ్య కూతురు జానకిని ప్రేమించి పెండ్లి చేసుకొంటాడు, ఆమె తన భర్త తాలూకు వాళ్ళనిగాని, చివరకు అత్తమామలను కూడా ఆదరించి ఇంట్లో ఉండనీయదు.



ఇవ్వాళకు ఓ సంబంధం మాట్లాడటకల్సి వందుకు. వాళ్ళు తన చెల్లెలి ఆర్థికస్తోమత గురించి ప్రశ్నించక అమ్మాయిని చూసొ్త మనడం శుభసూచకమే. విశ్వనాథంకు చాల నమ్మకముంది, కోమలి వాళ్ళకు నచ్చి తీరుతుందని. చెల్లెలు విమలమ్మకు ఆ రోజునే ఉత్తరం వ్రాసాడు, వీలు చూసుకుని కోమలిని తీసుకుని రమ్మని.

నాల్గు రోజుల తరువాత కోమలి, విమలమ్మ విశ్వనాథం యింటికి వచ్చారు. రెండురోజుల అనంతరం _ తిథి, వారం బాగుంటే, ఆనాటికి పెండ్లి చూపులు ఏర్పాటుచేసి, రామచంద్రయ్యకు స్వయంగా వెళ్ళి విశ్వనాథం చెప్పి వచ్చాడు. ఆనాడు రావడానికి ఒప్పుకున్నారు.

వచ్చిన రోజునే మధ్యాహ్నం భోజనానికి వచ్చినప్పుడు బావ సత్యం కోమలిని చూసాడు, గాని పలకరించలేదు. కోపంగ ముఖం తిప్పుకొని పోయాడు. ఆ సాయంత్రం ఇంటికి రాలేదు. రాత్రి తొమ్మిది గంటలకు వచ్చి భోజనం చేసి పడుకుండి పోయాడు. కోమలి బాధపడింది. ఆ మరునాడు. ప్రొద్దున్న సత్యంతో మాట్లాడడానికి వీలు చిక్కింది. అప్పుడా గదిలో ఎవ్వరూ లేరు.

"బావా! నామీద ఇంకా కోపమే?" సత్యం జవాబివ్వలేదు.

"సత్యంబావా! నేనేదో తొందరపడి నిన్ను కొట్టాను. ఆ పరిస్థితిలో ఏ ఆడపిల్లయినా అంతే చేస్తుంది. తరువాత నువ్వు నన్ను శపించి వెళ్ళిపోతే నేనెంతో బాధ పడ్డాను. మనం దగ్గర బంధువులం, శత్రువులంకాదు. నన్ను క్షమించలేవా?"

సత్యం కోమలివైపు తిరిగేడు. అంతరంగం ఏదో ఆశ చిగిర్చింది.

"అయితే నన్ను పెండ్లాడుతావా?" కోమలి చకితురాలైంది.

"బావా! మళ్ళీ అదేపాట? నేనిప్పుడు ఇక్కడకు వచ్చింది పెండ్లిచూపుల కోసం. ఆడపిల్ల ఏవో ఆశలు పెట్టుకోడంలో తప్పేమిటి బావా? నా ఆశలకు, నా కోరికలకు నువ్వు సమాధానం కాలేక పోతున్నావు. నేను నిన్ను ఎంత అభిమానించినా, నా మనస్సు నీతోటి వివాహానికి నొగ్గడంలేదు— నన్నేంచెయ్యమన్నావు చెప్పు?"

"నేను నీ అంత చదువుకోకపోయినా, నాకు పెద్దగ అందం లేకపోయినా నేనేమీ వికారిని కానే. నేను నా కష్టం మీద గౌరవంగ బ్రతుకుతున్నాను. నిన్ను ప్రేమిస్తున్నాను. నువ్వు నా మేనత్తకూతురివి— మరచిపోకు."

"బావా! నీ రూపాన్ని నేనేమి విమర్శించలేదు. నీ స్థితిగతుల గురించి ఆలోచించలేదు. ప్రేమన్నది నీపై నాకు కలుగలేదు —అంతే! పెండ్లిచూపులకై వచ్చాను గనుక నా తప్పిదాన్ని క్షమించి, నన్ను దీవించు బావా." సత్యం కోపంగ యేదో అనబోయి కోమలి కళ్ళలోని ప్రాధేయాన్ని చూసి, విరమించుకుని చర చర గది నుండి బయటకు వెళ్ళిపోయాడు. కోమలి తన ప్రయత్నం విఫలమైనందుకు నిట్టూర్చింది. తరువాత సత్యం కోమలిని తప్పించుకుని తిరిగాడు. ఇంట్లో వాళ్ళెవరకు వీళ్ళమధ్య జరిగిన సంఘర్షణ తెలియదు.

ఆరోజు వచ్చింది. పెండ్లికొడుకు, తల్లి, తండ్రి వచ్చారు. వచ్చిన రిక్షాలకు డబ్బిస్తుంటే రామచంద్రయ్య చికాకు పడ్డాడు. "మేము వచ్చిన రిక్షాలకు మీరు బాడుగ ఇవ్వడమేమిటండీ! ఈ వ్యవహారం మీకెంత అవసరమో మాకు అంతేకదండీ" రామచంద్రయ్య బాడుగ ఇచ్చాడు. ఇంట్లోకి వచ్చాక ఫలహారమేమి పుచ్చుకోలేదు. వట్టి కాఫీ మాత్రమే తీసుకున్నారు.

"ఏమమ్మా! నీ పేరేమిటి?"

"కోమలి."

జీవితగమ్యం

"బాగుంది మళ్ళా తప్పు పట్టకపోతే ఈ తెలుగు పుస్తకంలో ఒక పేజీ చదువమ్మా" అని తన చేతిలోని రామాయణ వచన కావ్యాన్నిచ్చాడు. కోమలి చదివింది.

"శ్రీకృష్ణా— నువ్వు చదువు నాయనా!" అని రామచంద్రయ్య కొడుకుచేత చదివించాడు.

"మరేంలేదు. మనిషి స్వరం యెలాగుంటో తెల్సుకొందుకు ఇదే మార్గం. ప్రశ్నలు వేయడంవల్ల జవాబులు క్లుప్తంగా ఉంటాయి గనుక స్వరాన్ని సరిగ వినలేము. ముఖ్యంగ అబ్బాయి, అమ్మాయి ఒకరి గొంతుక ఒకరు వినడం మంచిది."

"అమ్మా! మీరేమైనా అడగదలుస్తే అడగండి" అని విమలమ్మను ఉద్దేశించి రామచంద్రయ్య అన్నాడు.

"అడగడానికి మరేమి లేదండీ. అబ్బాయి బాగున్నాడు, యోగ్యుడు. మాకు కావల్సింది అదే. మీకు, మీ అబ్బాయికి అమ్మాయి నచ్చితే మిగతా విషయాలు మాట్లాడుకో వచ్చని అనుకుంటున్నా!"

"శ్రీకృష్ణా! అమ్మాయిని చూసేవా శ్రద్ధగ— అమ్మాయి నచ్చిందా? నాకు మట్టుకు అమ్మాయి అందగత్తెనని పిస్తోంది."

కొడుకు నవ్వుతూ తల పంకించాడు.

"ఏం సత్యవతి—నీ ఉద్దేశం? తరువాత చెప్తాం అని వాళ్ళను అనవసరంగ సందిగ్ధంలో పెట్టేయడం నాకిష్టముండదు."

"పిల్లకేమండీ! లక్ష్మిలాగుంది."

"విశ్వనాధంగారూ! మా అందరికీ పిల్ల నచ్చింది. ఇక అమ్మాయికి మా అబ్బాయి నచ్చాడో లేదో చెప్తే మిగతా విషయాలు మాట్లాడుకోవచ్చు."

"ఏమమ్మా కోమలీ! అబ్బాయిని చూసేవా? ఇట్లాంటి ముఖ్యమైన సందర్భంలో సిగ్గుపడకూడదు. అబ్బాయి నచ్చాడా?"

కోమలి నవ్వుతూ తల ఊపింది.

"రామచంద్రయ్యగారూ! అమ్మాయి, అబ్బాయి ఇష్టపడ్డారు. కట్నకానుకల సంగతి సెలవిస్తే బాగుంటుంది."

రామచంద్రయ్య ఆశ్చర్యపోయాడు! "కట్నకానుకలు దేనికి?"

"అదేమిటి! అబ్బాయికి మేము కట్నం ఇవ్వాలిగా."

"దేనికివ్వాలి?"

విశ్వనాథం మరింత ఆశ్చర్యపోయాడు— "అది అందరు కోరుతున్నారని అన్నా!"

"చూడండి! ఈ కట్నాలు, కానుకలు అన్నవి లంచం పుచ్చుకోడంకన్నా హేయమైనవి. అవి ఆప్యాయమైన మనుష్యుల్ని హీన పర్చకండి. కట్నాలను కోరి మనుష్యుల్ని మేము అవమానపర్చలేము. మీ అమ్మాయికి తగిన వరుడు ఎంత ముఖ్యమో మా అబ్బాయికీ తగిన వధువు అంత అవసరముంది. అందుకే అట్లాంటి ప్రసక్తి ఉండకూడదు. మా పెద్దమ్మాయికి మేము పైసా కట్నమివ్వకుండా మా బంధువుల అబ్బాయికిచ్చి వివాహం చేసాము. ఆ అబ్బాయి బొంబాయిలో ఇంజనీరుగా పని చేస్తున్నాడు. మేము యివ్వము, పుచ్చుకోము. అది మా యింటి ఆచారం."

"అన్నయ్యగారూ! మీరు దేముడిలాంటి వారు."

"అమ్మా! అమ్మా! అంత పైకి నన్ను ఎత్తేయకండి— పడితే నా నడుం విరుగుతుంది. ఇది నా ఆత్మాభిమానం మాత్రమే. ఇక మనం ముహూర్తం పెట్టుకునేముందు ఒక చిన్న విషయముంది. నాకు జాతకాల పిచ్చి కాస్త వుంది. అందుకే మీ అమ్మాయి జాతకం నాకిస్తే ఓ వారం పది రోజులలో జాతకాలు చూపించి పొందిక కుదిరితే మీకు ముహూర్తం పెట్టమని కబురంపుతా! ఏమంటారు?"

"సరే! అలాగే కానీండి" అని విశ్వనాథం అమ్మాయి జాతకాన్ని విమలమ్మ ఇంట్లోంచి తెచ్చివ్వగా ఆ వివరాలు వ్రాసి రామచంద్రయ్యకు అందించాడు.

పెండ్లివారు వెళ్ళిపోయారు. విమలమ్మ మొగపెండ్లివారి సంస్కారానికి, మంచి తనానికి యెంతో ఆనందించింది. ఇంత చక్కని సంబంధం తన కూతురికి కుదురుతున్నందుకు సంతోషంతో పొంగిపోయింది. కోమలి పెండ్లి కొడుకును చూసింది. చాలా బాగున్నాడు. మంచి ఉద్యోగంలో ఉన్నాడు. కోమలికి చాలా ఉల్లాసంగా ఉంది.

"విమలమ్మా! మనం ఇంటికి వేరగానే డబ్బుకు ఏర్పాటు చెయ్యాలి. ఈ సంబంధం కుదిరిందనుకో! జాతకాలు అన్నీ కలి-పోతాయి. ఇంత గొప్ప సంబంధం కుదరడం మన అదృష్టమే! అందుచేత నువ్వు ఇప్పటి నుంచీ ఆ డబ్బు యత్నంలో ఉండాలి. వాళ్ళు ముహూర్తం పెట్టమనగానే పై నెలలో పెండ్లి చేసెయ్యాలి— ఏమంటావు?"

"అలాగే అన్నయ్యా! నా మనస్సులో ఒక ఉద్దేశముంది. నేను చెప్తా. నువ్వు సరేనంటే అలాగే చేస్తా. నేను మా యింట్లో అద్దెకున్న జనార్దనస్వామిగారిదగ్గర అయిదు వేలు అప్పు తీసుకున్నా. దానిపైన వడ్డీ కూడా ఇంతవరకు రమారమి వెయ్యి రూపాయలు అయ్యుంటుంది. మళ్ళీ యింటిమీద అప్పు తీసుకుంటే వడ్డీ పెరగడమే కాని వేరే ప్రయోజనముండదు. జనార్దనస్వామి గారు చాలా ఉత్తములు. నెలనెలా సరిగ్గా [illegible] నాకు ఇంటద్దె యిస్తారేకాని వడ్డీసంగతి అడుగరు. మనకిప్పుడు పెండ్లికి డబ్బు అవసరము కనుక జనార్దనస్వామి గారు అద్దెకుంటున్న సగభాగం అతనికి అమ్మివేస్తేనేమి? ఈ విధంగా అతని అప్పు తీర్చేయవచ్చు. మనకి డబ్బూ చేకూరుతుంది. ఏమంటావు అన్నయ్యా?"

"నీ ఉద్దేశం సమంజసమే, గాని అబ్బాయి ఇల్లు అమ్మడానికి ఒప్పుకుంటాడా అని. ఆ ఇల్లు గోపాలం స్వార్జితం. అందుచేత మేజరు గాని కోమలి, భాస్కర్ కూడ సంతకం పెట్టందే అమ్మకం చట్టరీత్యా చెల్లనేరదు. అందుకే ఆలోచించుకొని అబ్బాయి భాస్కర్‌కి వ్రాయి."

"ఎందుకు ఒప్పుకోడన్నయ్యా! కోమలికి పెండ్లంటే తప్పక ఒప్పుకుంటాడు. పైగా ఆ భాగం కొంటున్నది వాడి మామగారేగా. జనార్దనస్వామిగారు రిటైరై మా ఊరు వచ్చినది అగాయితూ మంచి ఇల్లు దొరికితే కొందామన్న ఉద్దేశంతోనే ఉన్నారు. అతడు బహుదొడ్డ మనిషి. ముక్కుమొగం తెలియని పైవారికి అమ్మటముకన్నా జనార్దనస్వామిగార్కి అమ్మడమే మంచిది. ఉత్తరోత్రా నురేగొడవలుండవు."

"అలాగే కానియ్యి చెల్లెమ్మా!"

"అన్నయ్యా! ఆ సగభాగం ఎంతకు అమ్మవచ్చునంటావు?"

"నా ఉద్దేశం ఇల్లంతా అమ్మితే చాలా మంచిబేరం వస్తే ఇరవైవేలు ధర రావచ్చు. అందులో సగభాగమే గనుక పది వేలు రావచ్చు."

"ఆ పదివేలకు అమ్మితే మన అయిదు వేలు పైగ వడ్డీ వెయ్యిరూపాయలు పోను మన చేతికి నాలుగువేలు రావచ్చు. ఎలాగా రామచంద్రయ్యగారు కట్నం కానుకలు వద్దన్నారు గనుక కోమలి పెండ్లికి ఆ డబ్బు సరిపోతుంది."


"మూడువేలు పెట్టుకుంటే ముచ్చటగా పెండ్లి చెయ్యవచ్చు."

"అన్నయ్యగారూ! అన్ని ఒప్పందాలు కుదరగానే అమ్మకంపని నువ్వే చూడాలి."

"తప్పకుండా వస్తానమ్మా! నాకు రెండు రోజులు ముందుగా తెలియజెయ్యి."

విమలమ్మ, కోమలి [illegible] బస్సుకు వెళ్ళిపోయారు. వెళ్ళిపోయే

'వడ్డాణము చేయిస్తేగాని' భోజనము చేయనని నిండు
పట్టుదలము నాకు వచ్చేదు



ముందరి అందరికీ చెప్పినట్లుగ సత్యం బావమ్మాడు- "వెళ్తాస్తాను, బావ" అని కోమలి చెప్పింది. సత్యం ఏదో ఆలోచనతో, ఆపరాజమైన ఓ చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు!

విమలమ్మ ఇంటికి చేరుకున్నాక, ఆ మరునాడు జనార్దనస్వామిని, అన్నపూర్ణమ్మను హాలులోకి పిలిపించింది. ఇద్దరువచ్చి కూర్చున్నాక విమలమ్మ కూతురు పెండ్లి సంగతి చెప్పింది.

"బాబాయిగారు! మా కోమలికి మంచి సంబంధం చూసాం. జాతకాలు చూస్తున్నారు. అవి కుదరగానే ముహూర్తం పెట్టించాలి దగ్గరలో. వీలుంటే వచ్చే నెలలోనే పెండ్లి చేసెయ్యాలని అనుకుంటున్నారు."

"చాల సంతోషకరమైన వార్త చెప్పావమ్మా! అబ్బాయి ఏం చేస్తున్నాడు?"

"అబ్బాయి తండ్రి సబ్ రిజిస్ట్రారుగ పని చేసి రిటైరయ్యారు. అబ్బాయి బి.ఏ. పాసయ్యాడు. ఎక్సైజు ఇన్‌స్పెక్టరుగా పని చేస్తున్నాడు. అన్నిటికన్నా మంచి విషయం, వాళ్ళు మాలాగే కట్నాలు కానుకలు వాళ్ళ ఆడపిల్లలకు ఇవ్వరట, మొగపిల్లలకు పుచ్చుకోరట. భగవంతుడు వీలా సంబంధాలు కుదురుస్తాడో చూడండి."

"అవునమ్మా! మంచివారికి మంచే జరుగుతుంది. ప్రజలే ఎవరి మట్టుకువారు ఇట్లాంటి ఆదర్శాలు పెట్టుకుంటే, ఏ ప్రభుత్వపు చట్టాలు, శాసనాలు అవసరముండవు. మీ ఆదర్శాన్ని, ఆచరణని చూసేక నేను, అన్నపూర్ణ కూడ ఓ నిర్ణయానికి వచ్చాం. పెండ్లికి మిగిలిన మా అబ్బాయికి, మా ప్రసాదుకు పైసా కట్నం పుచ్చుకోదల్చుకోలేదు."

"అవును వదినా! ఒక విధంగ మేము మీ ఆదర్శాన్నే పాటిస్తున్నాం. మా అమ్మాయికి పైసా కట్నమివ్వకుండా మీ అబ్బాయికిచ్చి పెండ్లి చేసేముకనా, అలా మా ప్రసాదుకి పైసా కట్నంగాని కానుకగాని పుచ్చుకోం. మేము మంచివాళ్ళమయిపోతున్నాం."

"మా వదినా గడుసరే!" అంతా నవ్వుకున్నారు హాయిగ.

చాలకాలం తరువాత విమలమ్మ మనసార నవ్వగల్గింది. కూతురు కోమలికి వివాహమవబోతున్నది. విమలమ్మకు ఆనందంగా ఉంది.

జీవితగమ్యం

"ఏమమ్మా! అబ్బాయికి ఇల్లు కంపెనీ ఇచ్చేరుట, శ్రీదేవి నిన్ననే వ్రాసింది."

"అవునుగా! మావాడి ఉత్తరం బహుశ రేపువస్తుంది. కోమలికి వివాహం కుదిరిందని రేపు మా వాడికి వ్రాద్దామనుకొంటున్నాను. బాబుగారు, మీరో సహాయం చెయ్యాలి."

"చెప్పమ్మా! తప్పకుండా చేస్తాను."

"మరేంలేదు. మీరుంటున్న భాగం అమ్మేద్దామనుకుంటున్నాను. పైవాళ్ళకన్నా బంధువులైన మీరే తీసుకుంటే బాగుంటుందనుకొంటున్నా. మీ ఉద్దేశం, వదిన

బ్లూ ఫిల్మ్

దేశం థియేటరు
అరాచకం ప్రొజెక్టరు
రాజకీయాలు బ్లూఫిల్మ్
సంఘం స్క్రీను
న్యాయస్థానాలు సెన్సారు బోర్డు!
'ధర్మం' కత్తెరల్ని
నల్ల డబ్బు కప్పేసి
మెల్లగా కళ్ళు మూసుకొంది!
'ఏ' సర్టిఫికేటూ లేకుండా
వచ్చిన ఆ బూ ఫిల్ముల్ని,
పిచ్చి పిచ్చి విన్యాసాల్ని,
పిచ్చిపిచ్చిగా చూస్తున్నారు ప్రజలు—
అజ్ఞానం కుర్చీల్లో కూర్చొని!!

- "తేజస్విత"

గారి ఉద్దేశం ఎలాగుందో మరి. లోగడ మీరోసారి ఇల్లేదైనా అనుకూలమైనది దొరికుతే కొనాలని ఉంది అన్నారు— జ్ఞాపకముందా?"

"అవునమ్మా! కొనడానికి అభ్యంతరం లేదుగాని అనవసరంగ మీరు ఆస్తిలో కొంత భాగాన్ని అమ్ముకుంటున్నారన్న వ్యధ మాత్రమే నాకుంది."

"బాబుగారు! నా పరిస్థితి ఆలోచించండి. మీ దగ్గర అయిదువేలు తీసుకున్నా! దానిపై వడ్డీ ఇంతవరకు సుమారు వెయ్యిరూపాయలైందా! మరి ఈ అప్పు తీర్చే మార్గం నాకేమి తోచడం లేదు. అబ్బాయి ఉద్యోగం చేస్తూ నాకు, కోమలికి ఇల్లు గడపడంకోసం నెల నెలా మాటకొకటి రూపాయలు పంపుతున్నాడు. ఆ డబ్బు, మీరిచ్చే అంటదె ఎనభై రూపాయలు కలిపి ఇంటిఖర్చుకే వాడుతున్నాం. వింత కష్టంగా, నాడినా ఓ పదిరూపాయలు మిగలుతంలేదు. అట్లాంటప్పుడు అప్పు తీర్చడం యెలా చెప్పండి. కనీసం వడ్డీ కూడ ఇవ్వలేకపోతున్నాను."

"వడ్డీకేమమ్మా! మీరివ్వకపోయినా ఫరవాలేదు. మీ దగ్గర నాకు వడ్డీయేమిటి?"

"అలాగనకండి బాబుగారు! అప్పు తీసుకున్నప్పుడు వడ్డీ ఇవ్వకపోవడం ధర్మమా చెప్పండి? పైగ ఇప్పుడు అమ్మాయికి వివాహం తలపెట్టేం, కట్నం లేకపోయినా పెండ్లి ఖర్చులకు వింత లేదన్నా మూడునాలుగు వేలవుతుంది. అందుచేత మీరుభయులు బాగా ఆలోచించుకోండి మీరున్నభాగం, అదిసరిగ్గ మొత్తం ఇంట్లో సగభాగమవుతుంది. లేదు నేనుంటున్న ఈ భాగం కావాలన్ననే నాకు అభ్యంతరంలేదు. మీరు కొనడానికి ఉద్దేశముంటే నాకు చెప్పండి. ఆ ధర కూడ మీరే నిర్ణయించండి."

"అలాగేనమ్మా! నాల్గురోజులలో అన్ని విషయాలు ఆలోచించి చెప్తా. ఈలోగ అబ్బాయికి మీరిల్లు అమ్మకానికి పెట్టినట్లు తెలియజేయడం మంచిది. సేమ అతనికి మామగార్ని గమకి ఆహోహాలకు తావుండకూడదు."


"అలాగే! రేపే వ్రాస్తాను."

మరునాడు విమలమ్మ ఆశించినట్లుగానే కొడుకు భాస్కర్ వద్ద నుండి ఉత్తరం వచ్చింది. ఇల్లు దొరికిందనీ, ఇద్దరు కులాసాగా ఉన్నారనీ, కోడలుకి మూడవనెలనీ, ఈమధ్యనే హాస్పటల్లోని డాక్టరు నిర్ధారణ చేసి చెప్పిందనీ, ఆ వార్తను కోడలు తల్లికి వ్రాయడానికి సిగ్గుపడ్తోందనీ, అత్తగార్కి తెలియజేయమని వ్రాశాడు.

విమలమ్మకు చాలా సంతోషమైంది. అన్నీ శుభసూచనలే! అమ్మాయికి వివాహ సంబంధం యేర్పడడం, కోడలు గర్భవతి కావడం. ఈ వివాహమైపోయాక తను ఏమైపోయినా ఫరవాలేదనుకుంది.

"వదినగారూ! ఓసారి వసారాలోకి రండి"

అన్నపూర్ణమ్మ రాగానే విమలమ్మ పంచదార ముక్కని ఆమె నోట్లో వేసింది.



జీవితగమ్యం

"ఇదేమిటి!"

"మీరు మరో ఆరుమాసాలకు అమ్మమ్మ కాబోతున్నారు! నేను నాయనమ్మను కాబోతున్నాను. అదీ విశేషం."

"హ్హా, శ్రీదేవి! చాలా సంతోషం. ఏమండీ విన్నారా..." అంటూ ఆనందంతో భర్తను పిలుచుకుంటూ ఇంట్లోకి వెళ్ళింది.

కోమలి, విమలమ్మ ఆమె సంతోషాన్ని చూసి నవ్వుకున్నారు. ఆ మరునాడే అన్ని విషయాలు తెలియజేస్తూ కొడుకుకి విమలమ్మ ఉత్తరం వ్రాసింది. తవిలా ఇంట్లోని సగ భాగాన్ని భాస్కర్ మామగారికి అమ్మబోతుందనీ, తనకేమయినా అభ్యంతరముంటే తెలియజేయమంది.

భాస్కర్ ఉత్తరం చదివి భార్య శ్రీదేవికి చూపించాడు. చెల్లెలుకి వివాహం కాబోతుందన్న సంతోషంతో బాటు, ఇల్లు అమ్ముకుంటున్నామన్న అవమానం, దిగులు కల్గాయి. అందుకే భార్యను సలహా అడిగాడు.

"మీరీ జీతంతో ఆ ఇంటిమీద అప్పుల్ని తీర్చగలరా? మా నాన్నగారు గనుక సరిపోయింది, లేకపోతే మూడేళ్ళు వడ్డీ కట్టకపోతే ఎవరన్నా ఊరుకునేవారా? సంవత్సరం నుండి మీరుద్యోగం చేస్తున్నారు, ఏపాటి మిగల్చగల్గేరు? అలా అప్పులతో ఆ ఇల్లు వదిలేస్తే ఆ వడ్డీలే ఆ ఇంటిని తినేస్తాయి. ఇప్పుడు కొనబోతున్నది మీ మామగారు. మీ సగభాగం మీకుండనే ఉంటుంది. కోమలి భాగాన్ని కోమలి పెండ్లికి అమ్ముతున్నారనుకోండి. ఈ పెండ్లి అయేక మిగతా భాగాన్ని మీ పేర వ్రాయమని మీ అమ్మగార్ని కోరండి. పెండ్లయి కోమలి అత్తవారింటికి వెళ్ళిపోయేక అత్తగార్ని ఇక్కడికే తెచ్చేసుకుని మనదగ్గరే ఉంచేసుకుందాం, మీ భాగాన్ని అద్దెకిచ్చి. అప్పుడు మనకీ మాటిమాటికి మనియార్డరు బాధ తప్పుతుంది. పైగ ఇప్పటి అద్దెల ప్రకారం చూస్తే ఓ నూరు రూపాయలు ఇంటద్దె వస్తుంది. నాకు ఎలాగూ అత్తగారి సహాయం చాలా అవసరముంటుంది. అందుకే ఆ భాగాన్ని అమ్మనీయండి. ఈ విధంగా పరిస్థితులన్నీ ఓ తీరుకి వస్తాయి."

శ్రీదేవి తెలివితేటలు పైన, ప్రాపంచ జ్ఞానం పైన భాస్కర్‌కి చాలగురి. అందుకే భార్య సలహా పైన ఇల్లు అమ్మడానికి తన సమ్మతిని తెలియజేస్తూ తల్లికి ఉత్తరం వ్రాసాడు. శ్రీదేవి ఆ విషయమ్మీద ఆ ఇల్లు కొనమని తండ్రికి లేఖ వ్రాసింది.

అయిదురోజుల అనంతరం భార్యతో అన్ని విషయాలు బాగా చర్చించుకున్న తరువాత ఒక నిర్ణయానికి వచ్చి విమలమ్మతో ఆ ఇంటి గురించి మాట్లాడడానికి జనార్దన స్వామి సంసిద్ధుడయ్యాడు.

"అమ్మా! మేముంటున్న భాగాన్నే మేము తీసుకుంటాము. ఆ భాగమే మాకు బాగా అలవాటయింది. మనమిప్పుడు దగ్గర బంధువులం. మనం ఇరుగుపొరుగున ఉండడం ఎంతో సౌకర్యంగా ఉంటుంది,

ఏ గొడవలుండవు. ఏమమ్మా! ఎంతకి అమ్మదామనుకుంటున్నారు ?''

విమలమ్మకు అన్న విశ్వనాధం చెప్పిన ధర గుర్తొంది. ఇల్లంతటికీ ఇరవైవేలు రావచ్చని, సగానికి పదివేల కన్నా రాదనీ, పదివేలలో ఆరువేలు అప్పల క్రింద, వెయ్యి వడ్డీ క్రింద పోను మరో నాలుగు వేల రూపాయలు తన చేతికి రావచ్చనీ, అలావస్తే చాలని కోరికతో ఉంది విమలమ్మ.

"బాబుగారూ! నాకు ధరల సంగతి తెలియదు. మీరు పెద్దవారు, అన్నీ తెలిసిన వారు. మీరే నిర్ణయించండి, నేను కాదనను."

"చూడమ్మా! మీ కొడుకు నా అల్లుడు. పైగా జీవితానికి సంబంధించిన ఓ శుభ కార్యం కోసం ఇల్లు అమ్ముతున్నారు. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని నా అప్పు వడ్డీతో సహా చెల్లుకొట్టుకుని, మీకు ఆరువేల రూపాయలివ్వదలచాను. రిజిస్ట్రేషను ఖర్చులన్నీ నేను పెట్టుకుంటాను. అమ్మా! మీకు ఈ ధర సమ్మతమేనా? తొందరేం లేదు. మీరు ఆలోచించుకుని చెప్పండి."

విమలమ్మ ఆ ఇంటి భాగానికి పదివేలు అడిగితే, జనార్దనస్వామి పన్నెండు వేలు ఇస్తామంటున్నాడు. అందుకే పొంగిపోయింది. జనార్దనస్వామికి తెల్సు తను ఎక్కువ ఇస్తున్నాడని. కాని ఆ డబ్బును తన అల్లుడి చెల్లెలు పెండ్లికి సహాయం చేద్దామనే ఉద్దేశ్యంతో ఆ ధర ఇస్తున్నాడు. విమలమ్మ ఉచిత సహాయం తీసుకుందుకు నిరాకరిస్తుందని అతనికి తెల్సు. అందుకే ఈ విధంగా చేశాడు.

"బాబుగారూ! నేను అడిగిన దాని కంటే ఎక్కువే ఇస్తామంటున్నారు. సంతోషం. ఆ ధరే నిర్ణయిద్దాం(?)."

"అలాగైతే, అబ్బాయిని సంతకం చెయ్యడానికి ఒకసారి రమ్మనమనండి. అతడు రాగానే రిజిస్ట్రేషన్ చెయిద్దాం. మీ అన్నగారు వస్తే బాగుంటుందని నా ఉద్దేశం. పెద్దవారు కదా, అతను సాక్షిగా ఉండడం యెంతైనా సబబుగా ఉంటుంది."

"అలాగే చేస్తాము."

ఆనాడే అన్న విశ్వనాధంకూ, కొడుకు భాస్కర్‌కు విమలమ్మ ఉత్తరాలు వ్రాసింది. విశ్వనాధంకి వ్రాసిన ఉత్తరంలో ఓ సారి మొగపెళ్ళి వారింటికి వెళ్ళి ఆ జాతకాల సంగతి కనుక్కోమని కూడా వ్రాసింది.

విశ్వనాధం ఉత్తరం అందుకుని రామచంద్రయ్య ఇంటికి వెళ్ళి కనుక్కున్నాడు.

"విశ్వనాధంగారూ! నాకు జాతకాల గురించి ఓ మాదిరిగానే తెల్సు. నేను చూసాను, అమ్మాయి జాతకం బాగానే ఉందనిపించింది. నాకు రాజమండ్రిలో ఓ స్నేహితుడున్నాడు. గొప్ప సిద్ధాంతి. అతని పేరు మీరూ వినే ఉంటారు. అమరేశ్వర సిద్ధాంతిగారు. అతను జాతకాలు చూడడంలో దిట్ట. పెండ్లి ముహూర్తాలు బ్రహ్మాండంగా పెడ్తాడు. అతనికి అబ్బాయి జాతకం, అమ్మాయి జాతకం పంపించాను. అతను జాతకాలు చూసి సరిపోయాయని చెప్పేస్తే నాకు ఎంతో ధైర్యంగా ఉం

జీవితగమ్యం

టుంది. అతను కాస్త అస్వస్థతలో ఉన్నారట. అందుకే ఇంకా ఆ జాతకాలను పరిశీలించలేదనీ, స్వస్థత చేకూరగానే చూస్తానని అతను ఉత్తరం వ్రాసారు. అందుచేత ఈ ఆలస్యానికి మీరు నన్ను మన్నించాలి."

"అయ్యో, ఎంత మాట! అలాగే కానివ్వండి. తొందరేం లేదు. ఆదిరోజు లైంది కదా ఓసారి తమర్ని కలిసి పోదామని వచ్చాను. అంతే! మరేంలేదు."

విశ్వనాథం, భాస్కర్ నిర్ణీత దినంకి విమలమ్మ వ్రాసినట్లు వచ్చారు. ఆ మరునాడు ఆ ఇంటిలోని అర్ధభాగాన్ని జనార్దనస్వామిగారికి పన్నెండువేలకు విక్రయం చేసినట్లు రిజిస్ట్రేషన్ జరిగిపోయింది. ఇంటికి వచ్చింతరువాత, జనార్దనస్వామి రిజిస్ట్రారాఫీసులో తనకిచ్చిన పన్నెండు వేలలో ఆరువేలు అతనికి అప్పు తీర్చేసింది విమలమ్మ. మిగతా ఆరువేలు భద్రంగా స్టీలు బీరువాలో పెట్టింది. ఆ సాయంత్రమే విశ్వనాథం శ్రీకాకుళం ప్రయాణమయ్యాడు. వెళ్ళేటప్పుడు విమలమ్మ అన్నకు నూరురూపాయలిచ్చింది.

"అన్నయ్యా! ఇన్నాళ్ళూ నీకు నేను ఒక పంచలచాపు గానీ, ఒదినకు ఒకచీరైనా ఇవ్వలేకపోయానింతవరకు. అట్లాంటి బ్రతుకైపోయింది నాది. నువ్వు నాకోసమని బస్సులకు, రైలు చార్జీలకు చాలా డబ్బు ఖర్చు చేసావు. ఈ రోజు నాదగ్గర కాస్త డబ్బుంది. నువ్వు మరోలా భావించక ఈ వంద ఉంచన్నయ్యా."

"అదేమిటి చెల్లెమ్మా! నాకు డబ్బెందుకు చెప్పు? కోమలి పెండ్లప్పుడు నాకు జరీపంచలచాపు పెడ్తున్నావుగా నిలే. ఈ డబ్బు మాట ఎత్తకు."

ఏం చెయ్యాలో తోచక విమలమ్మ ఆ వంద పట్టుకుని ఉండిపోయింది. కోమలి వచ్చి—

"మామయ్యా! నువ్వు మాకుటుంబానికి దేముడిలాంటి వాడివి. దేముడికి ఓ పూలదండ సమర్పించడం భక్తుల సంతృప్తి కోసమే. నీవు చెప్పిన శుభసమయ మప్పుడు నీకు, అత్తయ్యకు జరీ బట్టలు ఇవ్వకుంటాంగాని ప్రస్తుతం అమ్మ కోర్కెను కాదనకు." అని తల్లి చేతిలోని డబ్బును తీసుకుని మామయ్య చేతిలో ఉంచింది.

"సరే! మీ ఇష్టమే కానివ్వండి," అని ఆ వంద రూపాయలు జేబులో పెట్టుకుని "శీఘ్రమేవ కళ్యాణ ప్రాప్తిరస్తు" అని కోమలిని దీవించి, "వెళ్ళొస్తానమ్మా చెల్లీ! వాళ్ళను ఓ వారంరోజుల తరువాత మళ్ళీ కలిసి వాళ్ళు సరేననగానే ఈ ఊరు వచ్చి, పిడపర్తి సిద్ధాంతిగారిచే ముహూర్తం పెట్టిస్తాము మరి వెళ్తా," అని చెప్పి పోయాడు.

గోపాలం అన్యాయంగా దూచుకున్న ఇంటిలోని అర్ధభాగాన్ని ఇతరులకు అమ్మేసిందుకు ఆ రాత్రి విమలమ్మ తద్దినం చెయ్యకుండా గోపాలాన్ని తల్చుకుని ఏడ్చింది. గోపాలం ఎప్పుడూ ఆ ఇంటి పెంకుల్ని తీసేసి చక్కని డాబా వేస్తాననేవాడు. ఆ కోరిక నెరవేర లేదు సరికదా, ఇల్లు సగభాగాన్ని పోగొట్టుకుని చిక్కిపోయింది. మానవుడు తలంచినదేమిటి? విధిలాక్కుపోయిన మార్గమేమిటి? అంతా అయోమయం!

19

"పోస్ట్". చిన్నకొడుకు గోపి ఉత్తరం తెచ్చి తండ్రి రామచంద్రయ్యకు అందించాడు. రామచంద్రయ్య కవరు చింపి ఉత్తరం బయటకు తీసాడు. ఆ ఉత్తరం ఒకే పేజీ మాత్రమే ఉంది. ఊరు, పేరు లేదు. తారీఖు మాత్రమే ఉంది. క్రింద సంతకం లేదు. రామచంద్రయ్య ఆశ్చర్యపోయాడు. వ్రాసిన వివరిదో కొత్తవారిది.

"రామచంద్రయ్యగార్కి,

నమస్తే! మీరు ఈ మధ్యన చామర్తి గోపాలంగారి అమ్మాయి కోమలిని మీ అబ్బాయికి చేసుకునే నిమిత్తం చూసారని తెల్సింది. మీ ఆదిశాలగౌరవనీయమైన కుటుంబం అనికూడా తెల్సు. అట్లాంటిది మీరు మోసపోతుంటే ఊరుకోలేక పోతున్నాను. అందుకే మీకా విషాన్ని తెలియజేసి, మిమ్మల్ని హెచ్చరించడం నా విధిగా భావిస్తున్నా! ఆ అమ్మాయి ప్రవర్తనేమంచిది కాదు. ఆ అమ్మాయి అవినీతి గురించి ఆ పేటలోని అందరికీ తెల్సు. కావలిస్తే మీరు స్వయంగా వెళ్ళి వాకబు చేయవచ్చు. అప్పుడు మీకే బోధపడగలదు నా మాటల్లోని నిజానిజాలు.

ఇట్లు మీ శ్రేయోభిలాషి.''

ఆ ఉత్తరం చదివేక పాపం సేపు రామచంద్రయ్య ఆశ్చర్యంతో బాటు, ఏదో బాధపడుతూ కూర్చుండిపోయాడు. ఆఖరికి భార్యను పిలిచి ఆ ఉత్తరం చేతిలో ఉంచాడు. సత్యవతి దానిని చదివి చాలా ఆశ్చర్యపోయింది.

''ఇదేమిటండీ, ఆ అమ్మాయి చాలా సౌమ్యంగ అగుపించింది! ఆ తల్లి చాల నెమ్మదస్తురాలుగా ఉంది. మరి ఇందులో ఏమైనా నిజముంటుందంటారా! లేక ఎవరైనా గిట్టనివాళ్ళు రాసేరంటారా?''

''ఏమో! నిజానిజాలు ఆ భగవంతుడికెరుక. ఆ కుటుంబం చాలా మంచిదనే తోస్తూంది. అట్లాంటిది వాళ్ళకు శత్రువు లెవరుంటారో తెలియడంలేదు. లేకపోతే మన కృష్ణ ఆఫీసులో పని చేస్తున్నవాడు ఈ కుటుంబం సంగతి తెల్సి మన కృష్ణకు ఉపకారం చేద్దామనే ఉద్దేశంతో ఈ విధంగా రాసాడో! ఊర్లో వాడు గనుక ముఖాముఖిగ చెప్తే విశ్వనాధంకి తెల్సిపోతే ఎక్కడ పోట్లాటకు వస్తాడో అని ఇలా చేసుండొచ్చు. ఈ ఉత్తరం ఏ ఊరులో పోసు చేసిందీ ముద్ర వల్ల స్పష్టంగా తెలియడంలేదు.''

''ఇప్పుడేం చెయ్యడం? ఆ పిల్ల బాగుంది — కృష్ణకు సరైన జోడికాని మధ్యన ఈ ఉపద్రవం వచ్చిపడిందే.''

''అదే బాధ పడుతున్నాను. ఇట్లాంటి విషయాలలోని యదార్థం తెల్సుకోడం చాలాకష్టం. కుటుంబం మంచిది కావచ్చు. ఈ అమ్మాయి మంచిది కాకపోవచ్చు. తండ్రి లేని పిల్ల, తల్లి చూస్తే చాల సౌమ్యురాలులా ఉంది. ఈ అమ్మాయికి సరైన అదుపాజ్ఞలు పెట్టేవాళ్ళు లేక విచ్చలవిడిగ తిరిగుండొచ్చు. ఏమైనా రాజమండ్రి నుంచి జాతకాల మీద రిపోర్టు వచ్చాక ఏదో చేద్దాం. అవసరముంటే వాళ్ళ ఊరువెళ్ళి వాకబు చెయ్యొచ్చు.''

ఆ రోజంతా రామచంద్రయ్య మనస్సు బాగులేదు

రెండురోజుల అనంతరం రాజమండ్రి సిద్ధాంతిగారి నుండి జవాబు వచ్చింది.

''...అమ్మాయి జాతకం అంత మంచిది కాదు. ఓ మాదిరి ఫలితాలనే ఇస్తూంది. అబ్బాయి జాతకం చాలా గొప్పది. అబ్బాయి భవిష్యత్తు చాలా బాగుంటుంది. విదేశ యాత్ర చేస్తాడు. అమ్మాయి గ్రహస్థితి అంత అనుకూలంగ లేదు. శని ప్రభావం ఎక్కువగ ఉంది. ముఖ్యంగా కుజదోష ముంది. ఇక ఇద్దరి జాతకాల పొందిక చూస్తే పది అంశాలలో ఏడు అంశాలకు పొత్తు కుదరలేదు. మిగతా మూడు అంశాలకు పొత్తు కుదిరింది. మొత్తంమీద ఇద్దరి జాతకాలకు అంత అనుకూలతలేదు. ఈ జాతకాలకు వివాహం చేస్తే జీవితం అంత సాఫీగాపోదు. చెయ్యకపోవడమే మంచిదేమో!...''

ఇదీ అమరేశ్వర సిద్ధాంతిగారు వ్రాసిన లేఖలోని ముఖ్యాంశం. ఈ ఉత్తరం చదివాక రామచంద్రయ్య పూర్తిగ నిరాశ చెందాడు.

''కృష్ణా! ఈ ఉత్తరం చదువు నాయనా' అని మొదట తనకు వచ్చిన ఆ అనామధేయ ఉత్తరం ఇచ్చాడు. కృష్ణమూర్తి చదివి విభ్రాంతి చెందాడు.

''ఇందులో నిజముందంటారా, లేక ఈ వివాహాన్ని కాకుండా చేయడానికి ఎవరైనా వేసిన ఎత్తుగడమో!''

''అదికాదు నాయనా! నిప్పులేందే పొగ రాదు కదా. ఇందులో ఏమాత్రమో నిజ ముండొచ్చు. ఇంతకీ మనం ఏంచూసుకుని ముఖ్యంగ ఈ సంబంధానికి ఒప్పుకుంటు న్నాము—ఆమె కుటుంబం గౌరవనీయమైన దని, రూపురేఖలతో బాటు గుణవంతు రాలనే కదా! మరే సంపదల్ని మనం ఆశించలేదు. అట్లాంటిది ఆ ఒక్క అంతఃకరణ సౌశీల్యం లోపించిందని అనుమానం కల్గినప్పుడు మనమెందుకు చేసుకోవాలి. ఒకవేళ వాళ్ళను నమ్మి చేసుకున్నా ఈ అనుమానం పెనుభూతమై మనల్ని తరువాత కూడ పీడిస్తుందేమో! ఆలోచించు. పైగ సిద్ధాంతిగరు వ్రాసిన ఉత్తరం చదువు' అని ఆ ఉత్తరము కొడుక్కి ఇచ్చాడు. కృష్ణమూర్తి ఆ ఉత్తరం సాంతం చదివి నిట్టూర్చాడు.


''సరే మీ ఇష్టం! ఎలాతోస్తే అలా చెయ్యండి.''

''నేను, మీ అమ్మ ఈ విషయమై చాల చర్చించుకున్నాము. రేపో, ఎల్లుండో విశ్వనాధంగారు వస్తానన్నారు. అతను వస్తే మీరిరువురి జాతకాలు పడలేదనీ, ఈ వివాహం జరగదని చెప్పేస్తాను. పాప పుణ్యాలు భగవంతుని కెరుక. అందుకే ఈ ఆకాశరామన్న ఉత్తరం గురించి చెప్పి అతడి మనస్సు కష్టపెట్టను. నువ్వేమం టావు?''

''అలాగే చెప్పండి. ఈ సంబంధం వదులుకోడమే మంచిది'' అని కృష్ణమూర్తి ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

ఆ మరునాడు విశ్వనాథం పెళ్ళి విషయం కనుక్కొందుకు వచ్చాడు.

''విశ్వనాధంగారూ! నన్ను మన్నించాలి. మేము పిల్లను చూసి ఇష్టపడి చేసుకుందామనుకున్నాం; గాని దైవం వేరేవిధంగ నిర్ణయించాడు. అమరేశ్వర సిద్ధాంతిగారు జవాబిచ్చారు—ఇదుగో మీరే చదవండి'' అని



సిద్ధాంతిగారు వ్రాసిన లేఖను విశ్వనాథంకు అందించాడు. విశ్వనాథం చదివి చాల బాధ పడ్డాడు.

"చదివారు కదా! ఇద్దరి జాతకాలు సరిపడలేదట. అందువేత ఈ పెడవి జాతకాలకు వివాహం చేయడం మంచిపని కాదు. అందుకే నన్ను క్షమించి మీరు వేరే సంబంధం చూసుకోవాలి."

విశ్వనాథం ఎంతో దిగులుపడి చెప్పినా విని మరేమీలేక, నేనేమీ చేయలేక కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి వచ్చేసాడు. ఇంట్లో వాళ్ళకు చెప్పాడు, పెండ్లివారు జాతకాలు పడలేదు పొమ్మన్నారని...

జగదాంబ: పూజ కొద్దీ పురుషుడు, దానం కొద్దీ బిడ్డలన్నారు. కోమలి దురదృష్టవంతురాలు. చక్కని సంబంధం తప్పిపోయింది.

సరోజ: పాపం! కోమలక్క ఎంత వ్యధ పడుతుందో! విమలమ్మత్త ఎంత బాధ పడుతుందో?

విశ్వనాథం: పాపం! తండ్రిలేని పిల్ల. ఇంత మంచి సంబంధం దొరికిందని నేను, చెల్లెమ్మ ఎంతో సంబరపడిపోయాం- ఆఖరికి ఇలా అయింది.

నిత్యం: తన అందమైనదని గొప్పతనం, ఈ దెబ్బతో కొంత పొగరు తగ్గుతుంది.

విశ్వనాథం స్వయంగ వెళ్ళి విమలమ్మకు ఈ వార్త చెప్పడానికి ముఖం చెల్లక ఉత్తరం వ్రాసి పంపేసాడు.

ఆ ఉత్తరం అందేక చదువుకొని కుప్పలా కూలిపోయింది విమలమ్మ. తల్లి పడిపోవడం చూసి భయపడిపోయి కోమలి ఏడవడం మొదలెట్టింది. కోమలి ఏడుపుతో అవార్ణశాస్త్రి, అన్నపూర్ణమ్మ పరుగెత్తి వచ్చి విమలమ్మ ముఖం మీద నీళ్ళు జల్లి తెలివి తెప్పించారు. విమలమ్మ ఆ ఉత్తరాన్ని అన్నపూర్ణమ్మ చేతిలో పెట్టింది. తరువాత ఆ ఉత్తరాన్ని అందరూ చదివి చాల బాధపడ్డారు. కోమలి విషయంతెల్సుకుని మనస్సులో సంతోషించింది, తన వివాహానికి.

"బాధపడకమ్మా! మరో సంబంధం మంచిది నేను చూసిపెడ్తాను. నువ్వింకా ఎక్కువగా ఈ విషయాన్ని పట్టించుకుని దిగులు పెట్టుకుని, అమ్మాయికి దిగులు కల్గించకండి" అని అవార్ణశాస్త్రి ఓదార్చాడు.

జీవితగమ్యం

ఆమరు డే తన బావమరది శ్రీ గనరసింహస్వామికి టూకీగా ఉత్తరం వ్రాసాడు, ఏదైనా మంచి సంబంధం చూడమని.

20

కోమలి జాతకం బాగులేదని చెప్పేసిన నాలుగు నెలల తరువాత కార్తీకమాసంలో రామచంద్రయ్య కుటుంబాన్ని తీసుకుని అరసవల్లిలో ఉన్న సూర్యదేవుని దేవాలయంకు వెళ్ళాడు. ఆ వేళకే విశ్వనాథం భార్యతోను, కూతురు సరోజతోను వెళ్ళాడు. దేవాలయ ప్రాంగణంలో రామచంద్రయ్య విశ్వనాథాన్ని చూసి పలుకరించాడు. జగదాంబ సత్యవతమ్మను పలుకరించింది. పట్టుచీర కట్టుకుని ముస్తాబై ఉన్న సరోజ అందంగా, యవ్వన సొగసులు కట్టవేయంగా ఉంది. కృష్ణమూర్తి సరోజను చూసి చూపు తిప్పుకోలేకపోతున్నాడు.

రామచంద్రయ్య సత్యవతి ఆ అమ్మాయిని చూసారు. అబ్బాయి తదేకంగా అమ్మాయిని చూడడమూ చూసేరు!

"ఏవా అమ్మాయి?" - సత్యవతమ్మ.

"అప్పుడేనండీ! మా మూడో అమ్మాయి సరోజ. పై ఇద్దరమ్మాయిలకు వివాహమైంది, పిల్లలు కూడా." - జగదాంబ

"మరి మేము మీ యింటికి వచ్చినప్పుడు ఈ అమ్మాయిని చూడలేదే!" - రామచంద్రయ్య.

"మీరంతా పెండ్లి చూపులకని ముందు గదిలో కూర్చుని ఉంటే, మా అమ్మాయి లోపల కాఫీ, ఫలహారం చేస్తూంది. మా ఆవిడ కన్నా మా సరోజ కాఫీ బాగా చేస్తుంది. మీకు మంచి కాఫీ ఇవ్వాలని అమ్మాయిని చెయ్యమన్నాను"

అందరు నవ్వుకున్నారు. ఆ క్షణం సరోజ నవ్వుతూ తల ఎత్తి కృష్ణమూర్తిని చూసింది. కృష్ణమూర్తి చూపు తన వైపే ఉంది గనుక ఇద్దరి చూపులు కలిసాయి. కృష్ణమూర్తికి ఆ చూపు చాల మధురంగా తోచింది.

రామచంద్రయ్య విశ్వనాథం మాటల్లోని తొక్కాన్ని గ్రహించాడు. కొంతమంది ఒక అమ్మాయికి పెండ్లిచూపులు జరుగుతుంటే పెండ్లికున్న మరో అమ్మాయిని అక్కడకు రానివ్వరు. ఇద్దరమ్మాయిల్ని చూసి సరిపోల్చుకుందుకు తావివ్వరు. ఒకమ్మాయి చెల్లెలు కూతురు, మరొక అమ్మాయి తన కూతురు. దాని విశ్వనాథం తన కూతుర్ని ఆ సమయమప్పుడు పెండ్లివారికి ఎదురుపడనివ్వలేదు, కోమలి సరోజ కన్నా అందమైనదైనప్పటికీ. విశ్వనాథం సహృదయతను రామచంద్రయ్య మనస్సులోనే మెచ్చుకున్నాడు.

గుణంలో ఉన్న ఔన్నత్యం ధనంలోనూ ఉద్యోగంలోను లేదు. ప్లీడరు గుమాస్తా చేసిన పేద విశ్వనాథం ఉన్నతుడని రామచంద్రయ్య తెల్సుకున్నాడు. విశ్వనాథం కుటుంబం మీద గౌరవం కల్గింది. చెల్లెలు కూతురు పెండ్లి తప్పిపోయిన తరువాత కూడ, విశ్వనాథం తన కూతురును ఇస్తానని రామచంద్రయ్య వద్దకు వెళ్ళలేదు జగదాంబ రెండు మూడు సార్లు హెచ్చరించినా!

(ఇంకా వుంది)

ముసలి పెళ్ళిళ్లు!

జపాను దేశంలోని వృద్ధుల కోసం స్థాపించబడిన వివాహ సంప్రదింపుల కేంద్రం వారు తీరిక లేకుండా వున్నారు. ఈ కేంద్రాన్ని 1976 లో ప్రారంభించారు. వయసు మళ్ళి ఒంటరిగా జీవిస్తూ, మరల వివాహం చేసుకోవాలనుకునే వారికి భాగస్వాములను వెదికి పెట్టడమే వీరి పని. ప్రస్తుతం ఈ కేంద్రంలో 407 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరిలో 60 సంవత్సరములు లేక అంతకు పైన వయసు కలిగిన పురుషులు 148 మంది, 50 సంవత్సరములు లేక అంతకు పైబడిన స్త్రీలు 259 మంది వున్నారు. వయసు మళ్ళినప్పటికీ వీరందరూ ఉత్సాహంతో చలాకీగా వున్నట్టు కేంద్రం అధికారులు తెలియచేశారు. మగవారిలో చాలా మందికి వివాహమైనప్పటికీ, స్త్రీలలో చాలా మందికి వివాహం కాలేదు. ఇంతవరకు ఈ కేంద్రం ఆధ్వర్యాన 55 మందికి వివాహాలు జరిగాయి.

మలక్‌పేట హోమియో ఆస్పత్రి :

ప్రజలకు హోమియోపతి వైద్య విధానంపై ఆదరణ పెరుగుతున్నదనడానికి మలక్‌పేట ప్రభుత్వ హోమియోపతి ఆసుపత్రిలో నాసికా వ్యాధులకు, ప్రసూతి సౌకర్యాలకు, శస్త్రచికిత్సలకు చెరి ఒక వార్డును ఏర్పాటుచేయుటమే తార్కాణం. రాష్ట్రంలోఉన్న హోమియోపతి ఆసుపత్రులలో కెల్లా ఇది పెద్దది. మలక్‌పేట ఆసుపత్రి కాక, రాష్ట్రంలో మరి రెండు హోమియో ఆసుపత్రు లున్నాయి. ఒకటి నగరంలోని మోతీగల్లీలోనూ, మరొకటి గుడివాడలోను. గుడివాడ ఆసుపత్రి 50 పడకల ఆసుపత్రి. రాష్ట్రంలో 62 ప్రభుత్వ హోమియోపతి డిస్పెన్సరీలు ఉన్నాయి. ఈ సమాచారాన్ని దేశీయ వైద్య, సాంకేతిక విద్యాశాఖా మాత్యులు శ్రీ తిరువరంగం హయగ్రీవాచార్యులు తెలిపారు. మలక్‌పేట హోమియో ఆసుపత్రిలో రక్తపుపోటుకు, అతి మూత్ర వ్యాధికి చికిత్స చేస్తున్నామని, ఇటీవల రాష్ట్రంలో ప్రబలిన మెదడు వాపు వ్యాధిని కూడా అరికట్ట గలుగు తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీ కె. శివశంకర్ తెలియజేశారు. తక్కిన సాధారణ వ్యాధుల కన్నిటికీ చికిత్స జరుగుతున్నదని కూడా ఆయన అన్నారు.

జటప్రోలు రాజాకు నివాళి :

స్వాతంత్ర్యం రాగానే పలువురు రాజాలు, మహారాజులు, చిన్న పెద్ద సంస్థానాధీశులు ప్రభుత్వం ప్రాపకం కోసం, ఏ పార్లమెంటు సభ్యుడో, విధాన సభ సభ్యుడో కావడానికి తంటాలుపడ్డారు. ఎలాంటి పదవీ వ్యామోహానికి లోను కాక, సంఘ సారస్వత సేవలోనే మునిగినవారు నాకు తెలిసినంత వరకు, వాసిరెడ్డి దుర్గా సదాశివేశ్వరరావు, జటప్రోలు రాజా శ్రీ సురభి వెంకట జగన్నాథరావు. ఆయన కాలధర్మం వల్ల తెలుగునాడు గొప్ప సంఘ సేవకుణ్ణి కోల్పోయింది. శ్రీ జగన్నాథరావు అభిరుచి విస్తృతం. వన్యమృగ సంరక్షణ, ఫోటోగ్రఫీ, విద్యావ్యాప్తి మున్నగువాటి కోసం ఆయన తీవ్ర కృషి చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు కింద మునిగిపోయే శ్రీ మదన గోపాలస్వామి దేవాలయాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించడంలో పురావస్తు శాఖకు ఆయన చాల తోడ్పడ్డారు.

భిక్షాటనకు స్వస్తి :

రాష్ట్రంలో భిక్షుకుల సంఖ్య ఇటీవల మితి మీరిపోతున్నది. శ్రీ వెంగళరావు ప్రభుత్వంలోనే భిక్షుక నిషేధ శాసనం ప్రకటించారు. కాని, అమలుజరగలేదు. అన్య రాష్ట్ర భిక్షులు కూడ వేనకు వేలు కనిపిస్తున్నారు. కాని, ప్రస్తుత ప్రభుత్వం ఆగస్టు నెల నుంచి ఈ శాసనాన్ని అమలుపరచడానికి నిశ్చయించడం ముదావహం. ప్రభుత్వం రాష్ట్రంలోని భిక్షుకుల సర్వే చేసింది. హైదరాబాద్, తిరుపతి,విజయవాడ, సింహాచలం లలో చెరి ఒక భిక్షుక శరణాలయం నెలకొల్పింది ప్రభుత్వం. భిక్షుకులలో దేహదారుఢ్యాన్ని బట్టి

హైదరాబాద్ నోట్‌బుక్

వారికి వివిధ వృత్తులలో ఉపాధి కల్పించడాన్ని కూడా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. శరణాల యాల నుంచి పారిపోయే వారికి మొదటిసారి అయితే ఆరు నెలలు, రెండవసారి అయితే, మూడేళ్ల వరకు కారాగార శిక్ష విధిస్తారు. పిల్లలను బలవంతంగా భిక్షుక వృత్తిలో దింపే ముఠాలపై చర్యలు తీసుకుంటారు. ఈ సంగతిని గృహ నిర్మాణ, హరిజన సంక్షేమ శాఖా మంత్రి శ్రీ కోనేరు రంగారావు జులై 1వ తేదీన పత్రికా ప్రతినిధులకు తెలియ జేశారు.

గుడ్డి వారి ఊరేగింపు :

జులై 1వతేదీన దాదాపు 500 మంది అంధ బాలబాలికలు, స్త్రీలు, పురుషులు—"చెన్నారెడ్డి డవున్ డవున్,చెట్టుమీది కొంగ చెన్నారెడ్డి దొంగ" మున్నగు నినాదాలు చేస్తూ ఖయిరతాబాద్ నుంచి సచివాలయం వరకు వూరేగింపు జరిపారు. తమకు నెలకు వంద రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, స్వయం ఉపాధి పథకాలు కొనసాగించేందుకు ఆరు వేల రూపాయల ఋణం యివ్వాలని, ఉద్యోగావకాశాలు గృహవసతి కల్పించాలని అంధులు కొన్ని నెలలుగా నిరాహార దీక్ష చేస్తున్నారు. జూన్ 22వ తేదీ నుంచి శ్రీ ఎన్. అంతయ్య ఆమరణ దీక్ష చేస్తు న్నారు.


సంజయ్‌గాంధీ దుర్మరణానికి విచారం :

ఏ తల్లికయినా, పైకి వస్తున్న కుమారుని అకాల మరణానికి, అందులోను దుర్మరణానికి కడుపు కోతగా ఉంటుంది. అలాటిది శ్రీ సంజయువంటి వాడు దుర్మరణంపాలయితే కడుపు తరుక్కుపోని తల్లి ఉండదు. సంజయగాంధి అభిప్రాయాలు ఏవైనా, తన మాతృ ఋణాన్ని తీర్చుకున్న సాహ సికుడు. అత్యవసర పరిస్థితిలో తల్లిని అందరూ త్రోసిరాజనినా, వదలలేదు. పక్కనే నిలబడ్డాడు, తిట్లన్నీ తిన్నాడు. ఎదురుదెబ్బ కొట్టడానికి అవకాశం కలిగించి, లోకసభ ఎన్నికలలోను, విధాన సభల ఎన్నికలలోను ఘన విజయం సంపాదించిపెట్టాడు. కర్తవ్యం నిర్వహించాడు, కృతకృత్యుడయ్యాడు. తల్లి ఋణం తీర్చుకున్నాడు. దురదృష్టవశాత్తు జూన్ 23వ తేదీ ఉదయం విమాన ప్రమాదంలో మరణించాడు. ఆయన మరణానికి సంతాప సూచకంగా ఇందిరా యువజన కాంగ్రెస్ హైదరాబాద్ నగర విభాగం జూన్ 24వ వూరే గింపు నిర్వహించింది. గాంధి భవన్‌నుంచి ప్రారంభ మయిన వూరేగింపు మోజంజాహి మార్కెట్టు, కోటి, ట్రూప్ బజార్, ఆబిడ్స్ బషీర్‌బాగ్‌ల మీదుగా గన్‌పార్క్ చేరింది. అక్కడ పార్లమెంటరీ కార్యదర్శి శ్రీ బి. కృష్ణ యువజన ఇందిరా కాంగ్రెస్ పక్షాన సంతాప సందేశం చదివారు. గన్ పార్కులో సంజయ్ గాంధి విగ్రహం నెలకొల్పాలని తీర్మానించారు. పలువురు నివాళులర్పించారు. యువజన ఇందిరా కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ వి. హనుమంతరావు జూన్ 26న రాష్ట్ర విధాన పరిషత్తుకు ఎన్నికయిన వెంటనే, 'గన్‌పార్కు'లో సంజయగాంధి పేరుతో ఒక మొక్క నాటి శ్రద్ధాంజలి ఘటించారు.

ఉపశ్రుతి :

"ఇక నుంచి పని లేకుండా బతకడం ఎట్లా?" అన్నాడు ఒక భిక్షుకుడు. "శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు. సంక్షేమ సంఘాలు స్థాపించి చందాలు సేకరిద్దాం" అన్నాడు మరొక భిక్షుకుడు. "రాజకీయాల్లో చేరుదాం. శ్రీరామ రక్ష—" అన్నాడు ఇంకొక భిక్షుకుడు.

—తిరుమల రామచంద్ర



ఫాలాక్షుని డైరీ

గొర్రె కడుపున మనిషి!

బీజపూర్‌లో ఓ గొర్రెకు ఆడపిల్ల పుట్టిందట. ఈ ఆడపిల్ల రెండున్నర అడుగుల పొడవు, తొమ్మిది కిలోల బరువు వున్నదట. కళ్ళూ, ముక్కూ, కాళ్ళు చేతులు అన్నీ మామూలుగా మానవ శరీరాన్ని పోలి వున్నాయి. పసికందు పుట్టిన అర్ధ గంటలో చనిపోయిందట. ఈ ఆశ్చర్యకరమైన వింతను చూడ్డానికి వూరు వూరంతావే గాక, పత్రికా విలేఖరులు కూడా వెళ్ళి చూశారట.

అలనాటి మాట!

అలనాటి మేటి నటి నర్గిస్ రాజ్యసభకు ఆనాడు ఎన్నికయిన సుముహూర్తాన్ని పురస్కరించుకుని అభిమానులు ఆవిడకు బోలెడు పార్టీలు ఏర్పాటు చేస్తే పత్రికా విలేఖరులు రావివక్కర్లేదనే పేనా పార్టీలకొస్తాను అన్నారట. అందులకు కారణమేమని అడక్కపోయినా అలనాడామెను, రాజకపూర్ను గురించి గోరంతలు కొండంతలుగా రాసినందువల్లనేమో! అని పత్రికా విలేఖరులను కుంటున్నారట.

తోకకి కారణం!

కలకత్తాకు చెందిన 30 ఏళ్ళ రామాభట్టాచార్య అనే ఆవిడ రామకృష్ణా మిషన్ సేవా ప్రతిష్టాన్ ఆసుపత్రిలో ముఖప్రసవమై, మగపిల్లాడిని కన్నదట. ఆ మగ పిల్లాడికి మూడంగుళాల తోక వున్నదట. ఈ అద్భుతాన్ని కనీ వినీ ఎరుగని డాక్టరు ఆశ్చర్యం నుంచి తేరుకున్నాక విజ్ఞానశాస్త్రాన్ని తిరగతోడి, ఇది అద్భుతమేమీ అసాధ్యం కాదనీ తల్లికి థయారాయిడ్ గ్రంధి సరిగా పని చేయక పోయినందువల్ల కూడా ఆ రకం పిల్లలు పుట్టవచ్చుననీ, తల్లి గర్భంలో శిశువు వారాల వయస్సులో వుండగా వెన్నెముక భాగం ఎదిగి ఆ రకం తోకగా వస్తుందనీ అన్నారట. ఈ సంఘటన వల్ల మానసికంగా బాధ పడుతుందని ఆ విషయమేమో రెండు రోజులు తల్లికి చెప్పలేదట. అనక చెప్పి ఆ పిల్లవాని తల్లిదండ్రుల సమ్మతి మీద మూడంగుళాల తోకను శాస్త్ర శస్త్ర చికిత్స ద్వారా తొలగించారట.

పాడైపోతున్న తాజ్‌మహల్!

ప్రపంచ ఖ్యాతి గాంచిన తాజమహలు వాతావరణ కాలుష్యంవల్ల పాడవుతున్నదనీ, తాజమహలు పాలరాయి తెల్లదనం తగ్గి, ఎరుపు రంగులో తేలుతున్నదనీ, చారలు చారలుగా ఆ పాలరాయి మీద ఏర్పడుతున్నాయనీ, కాలగమనంవల్ల ఆ కట్టడం పాడవుతోందనీ, ఏ విధమైన చర్యా దీనినాపడం కష్టమనీ నిపుణులు అంటున్నారట.

ఆర్నెల్లుగా వ్రేలాడుతున్న శవం!

కుందాపూరు నుంచి కొల్లూరుకు పోయే కొండ మార్గంలో కుందాపురం నుంచి 45 కిలో మీటర్ల దూరంలో ఓ లోయలోని చెట్టుకు ఒక మానవాకారం వ్రేలాడుతూ గత ఆర్నెలలుగా వున్నదట. నోపికున్న వారా ప్రాంతానికి వెళ్ళి రోడ్డు మీంచే ఆ దృశ్యాన్ని చూసి వస్తున్నారట. అసలది మనిషి శవమేనా, ఎవరు, ఏమిటి కథా చూడరాదా? అంటే మాకు రిపోర్టు రాందే మేం రంగంలోకి ఎలా దూకుతామంటున్నారట పోలీసులు.

సంతంగా మారిన సంబరం!

ఇజ్నూరుకు చెందిన భగువాలా అనే గ్రామంలో ఓ ఇంట్లో వివాహ మహోత్సవం జరిగిందట. పెళ్ళయిన వెంటనే పెళ్ళికొడుకు తన భార్య, భార్య చెల్లెళ్ళతో ఓ గ్రూపు ఫోటో తీయించుకోవాలని సంబరపడ్డాడట. దీనికి పెళ్ళి కూతురు తండ్రి సమ్మతించనందు వల్ల పెళ్ళికొడుకు సంబరం సంతంగా మారి పోయిందట. పంతాల పట్టుదలతో పెళ్ళి అక్కడికక్కడే రద్దు చేసుకు చక్కాపోయాడట ఆ పెళ్ళికొడుకు తన పరివారంతో. వాళ్ళలా పందిరి దిగగానే పెళ్ళికి వచ్చిన ఓ యువకుణ్ణి ఎన్నిఆతనికిచ్చి ఆ అమ్మాయిని పెళ్ళి చేసినాడటా పెళ్ళి కూతురు తండ్రి. భలి

కాపీ కోపం!


భద్రాచలానికి చెందిన 18 ఏళ్ళ శారద అనే అమ్మాయిని తను రాస్తున్న పరీక్ష పేపరు చూపమని వెనుక, పక్క వరుసలలో కూర్చున్న కుర్రాళ్ళు అడిగారట. అవన్నీ కుదరవనామ్మాయి తెగేసి చెప్పినందువల్ల కోపం వచ్చిన ఆ విద్యార్థులు ఇంటికి తిరిగి వెళ్తుండగా ఆమెను ఓ దిగుడు బావిలోకి తోసేశారట. దైవికంగా చిన్న గాయాలతో ఆమె బయట పడ్డదట.

కోరిక

ధరలు అక్కడి చుక్కలతో
స్నేహం చేస్తున్నాయ్
బాధలు ఇక్కడి నరులతో
స్నేహం చేస్తున్నాయ్
అక్కడి స్నేహం—
చెడిపోవాలని
ఇక్కడి స్నేహం
విడిపోవాలని

—చాడా మునిశేఖరరెడ్డి

పాపాయికి పుట్టుకతోనే మీరిచ్చిన కానుక- 3 నెలలకు సరిపడే ఐరన్



3 నెలలు నిండాక, కేవలం పాలే అతడికి కావలసిన ఐరన్‌ను సమకూర్చలేవు

అతడికి ఇవ్వండి

ఫారెక్స్

పుష్కలంగా ఐరన్ గలది

"తల్లి నుంచి పెద్ద ఐరన్ నిల్వతో సహా పుడతాడు పాపాయి. అయితే పుట్టిన తర్వాత ఈ నిల్వ క్రమేపీ తరిగిపోతుంది. పాలు మంచి ఆహారమే అయినప్పటికీ, ఐరన్ లేనందు వల్ల అది సంపూర్ణ ఆహారం కాదు. అందుకే పాపాయికి ఐరన్ గల ఆహారాలు కావాలి."
డాక్టర్ సుభాష్ సి. ఆర్య: "ఇన్‌ఫేంట్ అండ్ చైల్డ్ కేర్ ఫర్ ది ఇండియన్ మదర్"

అంచేత, పాపాయికి 3 నెలలు నిండగానే ఐరన్‌ను ఇచ్చే ఘన ఆహారం ప్రారంభించండి. ఐరన్ అతడి రక్తానికీ, అతడి వ్యాధి నిరోధక శక్తికీ, అతడి శరీర ఆరోగ్యానికీ, అతడి పెరుగుదలకూ, వికాసానికీ అతి ముఖ్యం.

డాక్టర్లు ఫారెక్స్ ఎందుకు సిఫార్సు చేస్తారు?

ఘన ఆహారాలు ప్రారంభించడం కోసం, ప్రత్యేకంగా తయారుచేయబడిన ఆహారం ఫారెక్స్. మీ పాపాయి సున్నితమైన జీర్ణ శక్తికి అనువుగా వుండేటట్లు ముందే పచనం చేయబడింది. ఫారెక్స్‌లో ఉన్నాయి— సత్వర పెరుగుదలకు ప్రొటీన్లు; శక్తికోసం కార్బోహైడ్రేట్లు, కొవ్వు పదార్థాలు; దృఢమైన ఎముకలు, గట్టి పళ్లకోసం కాల్షియం, ఫాస్ఫరస్, విటమిన్లు. పాపాయికి ఫారెక్స్ ఇస్తే, ఘన ఆహార రూపంలో అతడికి హెచ్చు కాలరీలు లభిస్తాయి. అంచేత పాలు తాగడం తగ్గుతుంది, నమలడం నేర్చుకుంటాడు కూడా. అన్నిటికంటే ముఖ్యంగా, పాపాయి శరీర ఆరోగ్యం, పెరుగుదలకోసం అత్యవసరమైన ఐరన్ పుష్కలంగా కలిగివుంది ఫారెక్స్.



ఉచితం! "పాపాయి మొదటి ఏడాది పుస్తకం." కొత్తగా తల్లులైన వారు పిల్లల పట్ల తీసుకోవలసిన శ్రద్ధ గురించి సులభ రీతిలో వివరిస్తుంది. మీ ప్రతి కోసం, 50 పైసల స్టాంపు జతపరుస్తూ ఈ క్రింది చిరునామాకు వ్రాయండి:
పి. ఒ. బాక్స్ నం. 19119,
(FAR 15 I), బొంబాయి 400 025.

డాక్టర్లు సిఫార్సు చేస్తారు ఫారెక్స్
సత్వరమైన, సంపూర్ణమైన పెరుగుదల కోసం పాపాయికి ఆదర్శవంతమైన ఘన ఆహారం

CASGLF-12-244 Tel

మువ్వల  మురళి

సీరియల్ — ఆర్. సంధ్యాదేవి

4

(గత సంచిక తరువాయి)

అది పెద్దహాలు. హాలు నిండా పుస్తకాల రాక్‌లో పుస్తకాలు పేర్చేసి వున్నాయి. హారితకు క్షణం కళ్ళకి ఏం కనిపించలేదు. అన్ని పుస్తకాలు ఒకేసారి చూడగానే మనసు జుంమని లాగేసినట్లయింది. ఆమె ఇక ఎటూ తల తిప్పకుండా తిన్నగా వెళ్ళి ఒక అరలో వున్న పుస్తకాలు తీసిచూసుకోసాగింది.

వాటిలో వున్న ఏ పుస్తకాలు తను చదవలేదు. అన్నీ కొత్తవే! ఏ పుస్తకం తీసి చదవాలో తెలీక తికమక పడసాగింది. ఆమె దృష్టిపుస్తకాల మీద తప్ప ఎటూ లేదు. పుస్తకాలు వెతుక్కుంటున్న ఆమెకు ఒక పుస్తకం కళ్ళ పడగానే కళ్ళు వింత కాంతితో తళుక్కున మెరిశాయి. మనసులో సంతోషం పొంగింది. ఆపుకోలేని ఆనందంతో ఆ పుస్తకం పెదవులకి ఆనించుకుని చుంబించి, గుండెలకు హత్తుకుంది.

ఇది అంతా అక్కడే హాలులో ఓ మూలగా టేబుల్ దగ్గర కుర్చీలో కూర్చుని పుస్తకం చదువుతూన్న వ్యక్తి, ఆమెనే ఆశ్చర్యంగా చూస్తున్నాడు — అని అంతవరకూ గమనించనే లేదు.

అప్పుడే తల తిప్పి చూసింది. అక్కడ కుర్చీలో కూర్చున్న వ్యక్తి చిరునవ్వుతో ఇటే ఇందాకటి నుండీ చూస్తున్నాడని గుర్తించి; ఆ వ్యక్తి ఎవరో తెల్సుకోగానే సిగ్గుతో చితికిపోయింది.

అక్కడికక్కడే ఉరిపోసుకు చచ్చిపోవాలని పించింది.

అతను ఇక్కడ ఎందుకున్నాడు! ఇది అతని ఇల్లా! ఆలోచిస్తూన్న ఆమె ముఖం సిగ్గుతో, అవమానభారంతో భూమిలోకి కృంగిపోయింది. అక్కడ నుండి వెళ్ళిపోవాలి అంటే అడుగు ముందుకు పడటంలేదు.

ఈ అమ్మాయి ఇక్కడికి, ఈ హాలులోకి ఎలా వచ్చింది? తల్లీతండ్రీ చూశారా? ఎవరితో వచ్చింది? అనే ప్రశ్నలు అతన్ని వేధించసాగాయి.

ఆ హాలులో అడుగుపెట్టిన దగ్గర నుండి చూస్తున్నాడు, ఆమె అసలు ఇటు చూడనేలేదు. అతనికి ఆశ్చర్యంతోపాటు నవ్వుకూడా వచ్చింది.

"కూర్చోండి!" అంటూ కుర్చీ చూపించాడు. అతని కంఠస్వరం వింటూనే హారిత ఇంకా బిగుసుకు పోయినట్టయింది. కృష్ణసుమంత్‌కి నవ్వువస్తూన్నా, పెదవుల మధ్య నొక్కిపెట్టేశాడు ఆ నవ్వు పైకి కనిపించకుండా!

"మీకు ఇంకేమైనా పుస్తకాలు కావలిస్తే తీసుకోండి" అన్నాడు అతను లేచి నిలబడుతూ.

కృష్ణసుమంత్‌కి ఒంటిమీద షర్టులేదు. వట్టి షరాయితోనే వున్నాడు. వెడల్పుగా వున్న ఛాతీ, కండలు తిరిగిన శరీరం, బలమైన చేతులు, పచ్చగా మెరిసిపోతూంది అతని శరీరచ్ఛాయ. మనిషి ఆరోగ్యంగా, బలంగా వున్నాడు.

హారితకు ఏం మాట్లాడాలో తోచడంలేదు. "శైలజ పిలుస్తున్నట్టువుంది" అంది మెల్లగా ఎలాగో గొంతుక పెగుల్చుకుంటూ — 'నేను క్రిందకు వెళ్తాను' అన్నట్టు వుంది ఆ మాటకు అర్థం.

అతను తలవూపాడు 'వెళ్ళండి' అన్నట్టు.

ఆమె అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్తున్నా, మనసు మాత్రం పరుగుపెట్టి త్వరగా ఇక్కడనుండి పోదాం అని తొందర పెడుతూంది. గది బయటకు వెళ్ళేదాకా ఎలాగో ప్రాణం ఉగ్గబట్టుకుంది గది దాటగానే ఒకటే పరుగుపెట్టి మేడదిగి శైలజ దగ్గరకు పారిపోయింది

ఆమె కంగారు చూసి శైలజ అనుమానంగా చూసింది. "ఏమిటి అలా కంగారు పడుతున్నావ్?" అంది.

"అఁ కంగారా! కంగారు ఏముంది! ఏమీలేదు" అంది తేలిగ్గా నవ్వేస్తూ, మనసులో కంగారుని, సిగ్గుని కప్పిపుచ్చుకుంటూ.

శైలజకు ఎంత ఆలోచించినా ఆమె ఎందుకలా వుందో అర్థంకాలేదు. కృష్ణసుమంత్ మేడమీద గదిలో వున్నాడని ఆమెకు తెలీదు.

విజయమ్మ వాళ్ళిద్దరితో చాలా ఆప్యాయంగా మాట్లాడింది. శైలజ, హారిత కాఫీ ఫలహారాలు తీసుకుని కూర్చున్నారు. అంతలో మేడమీద నుండి అతను మెట్లుదిగి రావటం కనిపించింది

విజయమ్మ కొడుకువైపు విస్మయంగా చూస్తూ "నువ్వు ఇంట్లోనే ఉన్నావా? అబ్బాయ్! ఎక్కడకో వెళ్ళావనుకుంటున్నాను. ఇలా రా! ఎవరు వచ్చారో చూశావా?" అంది నవ్వుతూ.

అతను తల్లిపక్కకు వచ్చి నిలబడ్డాడు.

శైలజ, హారిత లేచి నిలబడ్డారు.

"మా అబ్బాయి కృష్ణసుమంత్! ఈ అమ్మాయి శంకరరావుగారి చెల్లెలు కూతురు. పేరు హారిత" అంటూ చెప్పింది.

ఆమె అతనికి నమస్కరించింది. కృష్ణసుమంత్ హారితకు ప్రతి నమస్కారం చేస్తూ అన్నాడు, "వైజాగ్ నుండి వచ్చినట్టున్నారు!" చిరునవ్వుతో ఆమెవైపు చూశాడు.

"నీకు ఎలా తెల్సు?" అంది విజయమ్మ ఆశ్చర్యంగా కొడుక్కి జ్యోతిష్యం తెల్సా! అన్నట్టు సంబరపడుతూ.

"ఎవ్వరికైనా ఏమోగాని వైజాగ్ వాళ్ళని ఇట్టే గుర్తుపట్టేయవచ్చు" నవ్వాడతను.

హారిత వదనం రోషంతో ఎర్రబడింది, అతని మాటలు వింటూనే! ఫెడీమని జవాబు చెప్పాలన్నంత కోపం వచ్చింది. ఆవిడ కూడా అక్కడే వుంది. పెద్దావిడ ఎదురుగా అలా సమాధానం చెప్పటం ఏం బాగుంటుంది. మౌనంగానే కోపాన్నంతట్నీ ఒక్క గుటకలో మింగి వూరుకుంది. కృష్ణసుమంత్ ఎక్కడకో వెళ్తున్నట్టుగా ఫుల్‌సూట్‌లో వున్నాడు.

తల్లికి చెప్పి అతను వెళ్ళిపోయాడు

ఆవిడ కొడుకు గురించి చెప్తూ పెళ్ళి మాట ఎత్తింది. "అబ్బాయికి ఈ సంవత్సరం పెళ్ళి చెయ్యాలనుకుంటున్నాంగాని, వాడికి ఏ పిల్లా నచ్చటంలేదు. నచ్చని అమ్మాయిని బలవంతంగా ఎలా కట్టబెట్టేస్తాం! ఏమిటో వాడికి ఎక్కడ ఏ అమ్మాయి రాసిపెట్టి వుందో!" అని గాఢంగా నిట్టూర్చింది. ఆ నిట్టూర్పులో కొడుక్కి ఇంకా పెళ్ళికాలేదు ఎప్పుడు అవుతుందో! అన్న బాధ కొట్టవచ్చినట్టు కనిపించసాగింది.

హారిత ఏం మాట్లాడలేదు. శైలజ మాత్రం ఆవిడ్ని అతని పెళ్ళి విషయం గురించి ప్రశ్నలు వెయ్యసాగింది —

"మీ అబ్బాయికి కట్నం ఎంత కావాలి అత్తమ్మా?"

"మాకు, మా అబ్బాయికి పిల్లనచ్చితే పైసా కట్నం లేకుండా చేసుకుంటాం. మాకు ఇంత ఆస్తివుంది, ఇంకా కోడలు తెచ్చిన కట్నం మాకు ఎందుకు" అంది ఆవిడ నవ్వుతూ.

"అయితే మా బంధువులమ్మాయి వుంది. ఎమ్. బి. బి. యస్. ఫైనల్ ఇయర్ చదువుతూంది. మీరు ఆ అమ్మాయిని చూస్తాం అంటే చెప్పండి నేను వారికి కబురు చేస్తాను" అంది.

"మీ మామయ్యగార్ని కనుక్కుని చెప్తాను."

శైలజ తలవూపింది. హారిత ఈ విషయాలు ఏం తనకు పట్టనట్టు సోఫాలో కూర్చుని తలతిప్పి,

---

జరిగిన కథ — 1: పి.యు.సి. పాసయిన మల్లిఖార్జునరావు చెల్లెలు హారితకు, తెచ్చిన ఏ సంబంధమూ నచ్చటంలేదు. తన పెద్ద మామయ్య శంకరంగారి కూతురు శీల పెళ్ళికి మద్రాస్ వెళ్తుండగా ఆమెకు ట్రైన్‌లో 'కృష్ణసుమంత్'తో పరిచయ మేర్పడుతుంది. అతని అందాన్ని మనసులో మెచ్చుకొంటుంది. మళ్ళీ అతను శీల పెళ్ళిలో కనబడ్డప్పుడు ఆమె కలవరపడుతుంది. మామయ్య కొడుకయిన కుమార్ భార్య శైలజ కోరగా ఆమెతో బలభద్రరావుగారింటికి వెళ్తుంది హారిత.

గోడలకు వున్న ఫోటోలు వైపు చూడసాగింది.

కాస్సేపు కూర్చుని ఇంటికి వచ్చేశారు.

గోవిందమ్మ, హారిత మర్నాడు వైజాగ్ వెళ్ళిపోవడానికి ప్రయాణం అవసాగారు.



5

రెడ్ కలర్ చెవర్లెట్ టి.ఎస్.ఎన్. కాలనీ ముందు నుండి అందంగా హుందాగా ముందుకి పరుగులు పెడుతూంది. చోదకుని దృష్టి విశాలంగా వున్న రోడ్డుమీదకే కేంద్రీకరించబడి వుంది. స్పీడుగా వెళ్తున్న చెవర్లెట్ ఎదురుగా వస్తున్న వ్యక్తిని చూస్తూనే సడన్‌గా ఆగిపోయింది.

ఆ వ్యక్తికి డెబ్బయి సంవత్సరాలు పైన వుంటాయి. పొట్టిగా కట్టుకున్న పంచెపైన మాసిన షర్టు, మెడలో కండువా, చేతిలో పాత గొడుగు. ఆయన పక్కన ఓ పాతికేళ్ళ యువతి. నడిచి ఇటే వస్తున్నారు.

కారులో వున్న కృష్ణసుమంత్ కనుబొమ్మలు క్షణం సేపు ముడిపడి స్టీరింగ్‌పై చేతులు బిగుసుకున్నాయి. వాళ్ళిద్దరూ అదేం గమనించలేదు, కారుని దాటుకుని వెళ్ళిపోయారు.

ఎవరూ! ఎక్కడో చూసిన గుర్తు. చటుక్కున మెరుపులా గుర్తువచ్చింది! ఆయన రామనాథం మాష్టర్‌గారు. చిన్నప్పుడు తనకి ట్యూషన్ చెప్పేవారు.

తనకి బాగా గుర్తువుంది. ఎంత మంచివారు. తనని ఎంత ప్రాణంగా చూసేవారు. సంతోషంతో చటుక్కున కారుదిగి వడివడిగా అడుగులు వేస్తూ అల్లంత దూరం వెళ్ళిపోయిన వార్ని "మాష్టర్‌గారూ! రామనాథం మాష్టర్‌గారు!" అంటూ పిలిచాడు.

ముందు మెల్లగా నడుస్తున్న ఆయన ఆ పిలుపు వింటూనే ఆగి వెనక్కి తిరిగి చూశారు.

"మాష్టర్‌గారూ! మిమ్మల్నే" అంటూ దగ్గరకు వెళ్ళి, "నమస్కారమండీ! నేను గుర్తు వున్నానా?" అంటూ పలకరించాడు.

"ఎవరూ!" ఆయన కంఠం మెల్లగా వణికింది. కళ్ళకు అద్దాలు వున్నా గుర్తుపట్టలేనట్టుగా నుదురు చిట్లించి, కళ్ళు చిన్నవిగా చేసి చూశారు. ఆ భారీ యువకుడ్ని 'ఎవరా!' అన్నట్టు చూశారు.

"నేనండీ! కృష్ణసుమంత్‌ని. బలభద్రరావుగారి అబ్బాయిని. మీ వద్ద ట్యూషన్ చెప్పించుకునే వాడ్ని కదండీ!" నవ్వుతూ అన్నాడు.

"ఎవరూ కృష్ణ!" ఆశ్చర్యంగా, ఆనందంగా, నమ్మలేనట్టుగా చూశారు. అతనికి పదేళ్ళ వయసులో ట్యూషన్ చెప్పేవారు. అప్పుడు ఎర్రగా, సన్నగా, పొడవుగా వుండేవాడు. అప్పటికీ ఇప్పటికీ ఎంత తేడా! కళ్ళద్దాలు సవరించుకుని మరోసారి పరిశీలనగా, సంతోషంగా, తృప్తిగా చూశారు ఆయన.

"ఇప్పుడు ఎక్కడ వుంటున్నావ్? ఏం చేస్తున్నావ్? అంతా కులాసాయేనా?"

"ఆ! అంతా కులాసాయే. నేను ఎమ్. ఏ. చేసి మాష్టర్ ఆఫ్ లా చేశాను. వాల్తేర్ అప్లెండ్స్‌లో స్వంత ఇల్లు వుంది. అక్కడ వుంటున్నాను."

"అలాగా! చాలా సంతోషం బాబు. ఎన్నాళ్ళకు చూశాను." ఆయన కళ్ళు చెమరించాయి.

ఆయన పక్కనే నిలబడిన అమ్మాయి మౌనంగా చూస్తూంది అతనివైపు. కృష్ణసుమంత్ దృష్టి ఆ అమ్మాయివైపు తిరిగింది. తెల్లగా, అందంగావున్న ఆ అమ్మాయి ఎవరో అతనికి అర్థం కాలేదు. మాష్టర్‌గారి కూతురు అంటే తనకు తెలుసున్నవరకూ ఆ వయసులో అమ్మాయిలు ఎవరూలేరు. అందరూ తన కంటే బాగా పెద్దవాళ్ళు. మరి ఈ అమ్మాయి ఎవరు? మనసులోనే ఆలోచించుకోసాగాడు

"మీరు ఎంతవరకూ వెళ్ళాలి?"

ఆయన చెప్పారు.

"పదండి నా కారులో దిగబెట్టేస్తాను."

"ఎందుకు! వద్దు బాబు. ఇక్కడికి దగ్గరే! మెల్లగా నడుచుకు వెళ్ళిపోతాం."

కృష్ణసుమంత్ వినలేదు. కారులో ఇద్దర్నీ కూర్చోమని తీసుకువెళ్ళి ఆయన ఇంటిదగ్గర దించేసి వెళ్ళిపోతుంటే — రామనాథంగారు అతన్ని లోపలకు వస్తేనేగాని వూరుకోలేదు. రామనాథంగారి భార్యకూడా అతన్ని గుర్తుపట్టలేకపోయింది. ఆవిడది కూడా పెద్దవయసు కావడంవల్ల సరిగ్గా చూపు ఆనలేదు. భార్యాభర్తలు ఇద్దరే చిన్న ఇల్లు తీసుకునివుంటున్నారు. ఏవో ట్యూషన్లు

చెపుతూ ఆ వచ్చిన డబ్బుతో, కొడుకులు పంపించే డబ్బుతో ఎలాగో రోజులు వెళ్ళబుచ్చుతున్నారు.

ఆవిడ కాఫీ తెచ్చి అతనికి ఇచ్చింది. కృష్ణసుమంత్ కాఫీ త్రాగుతూ ఆ అమ్మాయి ఎవరా! అని ఆలోచించసాగాడు.

"ఈ అమ్మాయి నాకు తెల్సిన అతని కూతురు. ఆయన పోయి అయిదు సంవత్సరాలు అయింది. అప్పటి నుండి వాళ్ళ యింటికి ప్రతి రోజూ వెళ్ళి, చూసి వస్తుంటాను. నాకూ ఓపిక లేదు. వెళ్ళి రావటం అంటే కష్టమే అయినా తప్పదు. ఆయన చనిపోతూ కూతురి బాధ్యత నాకు అప్పగించాడు. అమ్మాయి బి.ఏ. పాసయింది. ఉద్యోగం చూసుకుంటోంది. అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు ఎవ్వరూలేరు. తల్లివుంది. ఆవిడ ఆరోగ్యం అంత బాగుండటంలేదు. ఒకరోజు లేచి తిరిగితే వారం రోజులు మంచంమీద వుంటుంది.

మువ్వల మురళి

ఉద్యోగం దొరక్కపోతే ఇల్లు ఎలా గడుస్తుందా ? అన్న బెంగ ఈ అమ్మాయికి" అంటూ చెప్పారు.

కృష్ణసుమంత్ 'అలా ' అన్నట్టు తల వూపాడు

"మీ పేరు?" ప్రశ్నించాడు ఆ అమ్మాయిని. అతని ప్రశ్నకి ఒక్కసారి కళ్ళెత్తి చూసి "రోజా" అంటూ చెప్పి, మళ్ళా రెప్పలు క్రిందకువాల్చేసింది.

'రోజా !' అమ్మాయికి తగిన పేరని అనుకోకుండావుండలేకపోయాడు.

"బాబూ ! నీకు ఎవరైనా తెల్సివుంటే చెప్పు, ఈ అమ్మాయికి ఉద్యోగం వస్తే వాళ్ళ అమ్మకి అంత బెంగ వుండదు" అన్నారు ఆయన, అతనితో బ్రతిమాలినట్టే చెపుతూ !

"అలాగే నండీ! నేను తప్పకుండా చూస్తాను" అంటూ మాట ఇచ్చినట్టే చెప్పాడు.

కృష్ణసుమంత్ అలా చెప్పటంతో ఆమెకు ధైర్యం వచ్చినట్టు అయి, ముఖంలో సంతోష రేఖ తళుక్కుమంది. కళ్ళు మిలమిల మెరిశాయి.

"మీ నాన్నగారి పేరు ఏమిటి ?" అడిగాడు.

"దక్షిణామూర్తిగారు !" అంటూ చెప్పింది.

"దక్షిణామూర్తిగారా !" అంటూ అతని కనుబొమ్మలు ముడిపడ్డాయి.

"మీ అమ్మగారి పేరు?" తిరిగి ప్రశ్నించాడు.

"సీతాలక్ష్మి."

కృష్ణసుమంత్ ఇంకేం మాట్లాడలేదు. మళ్ళీ వస్తానని చెప్పి వచ్చేసాడు.

ఇంటికి వచ్చేశాక ఆ రాత్రి అంతా ఆ విషయం గురించే ఆలోచించాడు. దక్షిణామూర్తిగారి అమ్మాయి అంటే ఇంకా ఎవరో అనుకుంటున్నాడు. రోజా ఆ అమ్మాయికి తగిన పేరు. తెల్లగా, కాస్త బొద్దుగా వుంది. పెద్దపెద్ద కళ్ళు, పొట్టిగా అల్లినజడ, అందంగా, ఆకర్షణీయంగా వుంది. మర్చిపోవాలన్నా మర్చిపోలేరు ఎవ్వరూ ఆ అమ్మాయిని చూసి. వాళ్ళమ్మకి ఒంట్లో బాగుండటంలేదట. పాపం ! వెనక ఎవరూలేరు. తను వాళ్ళకి ఏదో విధంగా సాయం చేసి, ఆసరాగా నిలబడితే ! ఒకసారి వాళ్ళ ఇంటికి వెళ్ళి చూసి వస్తే !!

కృష్ణసుమంత్ ఆలోచిస్తూ ఆ రాత్రి అంతా గడిపాడు. కళ్ళు మూసినా, తెరిచినా రోజా రూపమే కళ్ళముందు కదలసాగింది. ఎవరు ఏమనుకున్నా తను ఆ కుటుంబాన్ని ఆదుకోవాలి.

జీవితం ఎంత చిత్రమైంది. ఒక్కొక్క రోజున అనుకోని మనుష్యులు ఎదురుపడతారు. వాళ్ళు అలా ఎదురుపడినప్పుడు, ఎంత సంతోషం కల్గుతుంది. లేకపోతే అనుకోకుండా రామనాథం మాష్టర్‌గారు కనిపించటం, వారితో రోజా కనిపించటం అంతా చిత్రంగా వుంది ! కృష్ణసుమంత్‌కి మనసు అంతా హాయిగా, ఆనందంగా వుంది. వాళ్ళ ఇంటికి ఎంత వేగంగా వెళ్దామా ! అని మనసు వేగిరపడుతోంది.

6

హరిత వైజాగ్ వచ్చేసినా మెడ్రాస్ ప్రయాణంలోని జ్ఞాపకాలు ఆమెను వదిలిపెట్టటంలేదు. అవి గుర్తువచ్చినప్పుడల్లా ఆమె వదనం మాట మాటకి ఎర్రబడటం, అతని స్పర్శ ఆమెకా క్షణంలో మైకం క్రమ్మినట్టు అయి తనని తాను మర్చిపోవటం గుర్తువచ్చి మనసులో గిలిగింతలు పెట్టినట్టు అవసాగింది. ఏ పని చెయ్యటానికి మనసు అంగీకరించటంలేదు. అతని గురించే ఆలోచించాలనిపిస్తూంది. హరితకు పరధ్యానం ఎక్కువైపోయింది. ఇంట్లో ఎవరైనా ఏదైనా పనిచెపితే చిరాకుపడిపోతూంది.

హరిత పరధ్యాసకు, చిరాకుకు కారణం ఏమిటో బోధపడక ఇంట్లోవాళ్ళు విస్తుపోసాగారు. వంటగదిలో అత్తాకోడళ్ళు కూర్చుని, హరితను చూడడానికి వస్తామని కబురుచేసిన పెళ్ళివాళ్ళ గురించి మాట్లాడుకుంటున్నారు. వాళ్ళు నెమ్మదిగా ఏం మాట్లాడటంలేదు కాబట్టి, తన గదిలో కూర్చుని పుస్తకం చదువుకుంటున్న హరితకు ఈ మాటలు స్పష్టంగానే వినిపిస్తున్నాయి.


"అబ్బాయి చాలా బాగుంటాడు అట !" అంటోంది తల్లి.

'ఆస్తి, అందం, చదువు ఒక్కచోట వుండటం అదృష్టం కదా ! ఈ సంబంధం నిశ్చయం అయిపోతే మన హరిత చాలా అదృష్టవంతురాలు" అంటోంది విశాలి.

' ఎప్పుడు వచ్చేది ముందుగా కబురుచేస్తాం ! అన్నారు. ఇవాళో రేపో రావాలి."

"అవును, అత్తయ్యా ! ఇవాళో రేపో కబురు


1949 కి ముందుగా మీరు జన్మించినట్లైతే ఈ ప్రకటన పూర్తిగా చదవండి.



10 కి 9 మంది ప్రజలకి 30 ఏళ్ళకి పైబడ్డ వారికి జుట్టు వూడటం సంభవిస్తుంది...మరి ఇది వారికి తెలియదు!

ఆ 9 మందిలో మీరు ఒక్కరైతే ప్యూర్ సిల్విక్రిన్ వాడటం నేడే ప్రారంభించండి.

మీ దువ్వెనతో మీ జుట్టును గట్టిగా దువ్వండి. మీ దువ్వెన మీదకి వెంట్రుకలు వచ్చినట్టయితే ఆనవాలు మీ జుట్టు వూడిపోతుందన్నమాట. మీరు వెంటనే—అంటే యిప్పుడే చర్య తీసుకోవాలి. లేకపోతే మీ జుట్టు పల్చనైపోయినట్టు మీకు అద్దంలో స్పష్టంగా కన్పించటం ప్రారంభిస్తుంది. ముఖ్యమైన ఎమినో ఏసిడ్‌లు జుట్టుకి సహజమైన ఆహారం. అవి కొరతైతే, జుట్టుపల్చబడిపోయి ఆరోగ్యం కోల్పోతుంది వాటి కొరతని తొలగించక పోయినట్టయితే జుట్టు వూడిపోతూనే వుంటుంది. అందుచేత మీరు ప్యూర్ సిల్విక్రిన్ వాడటాన్ని ఈరోజే ప్రారంభించటం అవసరం.



ప్యూర్ సిల్విక్రిన్‌లో ఏమిటి ఉంటాయంటే :

1 పెద్దది చేసిన ఒక ప్యూర్ సిల్విక్రిన్ చుక్క సహజ జుట్టు అవసరాలవి తీర్చేందుకు దేహం సమకూర్చే 17 ఎమినో ఏసిడ్‌ల అపూర్వ సమ్మేళనమే ప్యూర్ సిల్విక్రిన్.

ప్యూర్ సిల్విక్రిన్ ఎలా పని చేస్తుందంటే :

2. లోపలకు చొచ్చుకు వెళ్ళే చర్య.

ప్యూర్ సిల్విక్రిన్ వెంట్రుకల మొదళ్ళలోవరకు వెళ్ళేదాక దాన్ని తలమీద చర్మ భాగంలో యింకేట్టు బాగా మర్దనం చెయ్యండి. శాస్త్ర పరిశోధనలతో రూపొందించి ప్యూర్ సిల్విక్రిన్‌లో ఇమిడ్చిన ప్రక్రియ పద్ధతి యిప్పుడు పని చెయ్యటం ప్రారంభిస్తుంది ; మళ్లీ జుట్టు పెరుగుదల కొనసాగేట్టు దోహదం చేస్తుంది. మీ జుట్టు మళ్లీ యథా ప్రకారం ఆరోగ్యంగా పెరిగే వరకూ మీరు ప్యూర్ సిల్విక్రిన్‌ని రోజుకి రెండుసార్లు చొప్పున ప్రతి రోజూ వాడండి.

ప్యూర్ సిల్విక్రీన్



OBM/4781 A

వస్తుంది. వాళ్ళూ తొందరపడుతున్నారు అబ్బాయి పెళ్ళి వేగం చేసెయ్యాలని.''

''ఈ సంబంధం కుదిరితే దేముని దయవల్ల హారిత చాలా అదృష్టవంతురాలే!'' అంది తల్లి.

ఆ మాటలు అన్నీ వింటున్న హారిత మరి సహించలేకపోయింది. తనంత అందాలరాశి భార్య కావటం అతని అదృష్టం కాదూ! పైగా ఆ సంబంధం నిశ్చయం అయితే తను అదృష్టవంతురాలా! లేకపోతే దురదృష్టవంతురాలా! ఒళ్ళు మండిపోయింది. రయ్యిన దూసుకువెళ్ళింది వంటగదిలోకి —

''అస్తమానూ మీకీ కబుర్లేగాని మరో ధ్యాస వుండదా! వాడెవడో నన్ను చేసుకోకపోతే నేను దురదృష్టవంతురాల్నా!'' నడుంమీద చెయ్యి ఆనించుకుని, జడ ముందుకేసుకుని కోపంగా అడగటం చూసి గోవిందమ్మ, విశాలి మాటలు ఆపేసి నిశ్శబ్దం అయిపోయారు.

విశాలి పొయ్యిమీద కూర మాడడానికి వెళ్ళింది. గోవిందమ్మ తోటకూర తరుగుతూ మౌనంగా కూర్చుంది.

'ఈ పిల్ల ఎక్కడనుండి వచ్చింది బాబూ! మాట అంటే పది అర్థాలు లాగేస్తుంది. మాట అనుకోమా? మంచి వుంటుంది, చెడ్డ వుంటుంది. అన్నిటికీ ఇలా విరుచుకుపడితే ఇంకేమిటి! ఇక్కడ కాబట్టి సరిపోయింది. అదే అత్తవారింట్లో అయితే చెల్లుతుందా?' అనుకుంది ఆవిడ బరువుగా నిట్టూరుస్తూ.

''నేనేదో పెళ్ళో పెళ్ళో అని ఏడుస్తున్నట్టు, వాడికోసమే నేను పుట్టినట్టు మాట్లాడతారేమిటి?'' కోపంగా అడిగింది.

''ఏదో మాట అనుకున్నామే తల్లీ! బుద్ధి పొరపాటు అయి, ఇక వూరుకో!'' అంది గోవిందమ్మ కాస్త విసుగ్గా.

తల్లితో ఇంకేదో అనబోతుండగా అంతలో కాలింగ్ బెల్ మ్రోగింది. హారిత కనుబొమ్మలు విసుగ్గా ముడిపడ్డాయి

''అబ్బబ్బ! ఈ వచ్చిన వాళ్ళందరికీ తలుపులు తియ్యలేక చావాలి!'' అంటూ మూల్గింది.

''ఏమిటా విసుగు! పిల్లలు ఎంత చురుగ్గా వుండాలి. తలుపు తీసి ఎవరొచ్చారో చూడు'' అంది గోవిందమ్మ.

''కూర్చుని ఎన్ని కబుర్లు అయినా నేనూ చెప్తాను'' అంటూ మనసులో కలిగిన కోపాన్ని నడకలో ప్రదర్శిస్తూ విసురుగా వెళ్ళింది.

''ఈ టైముకి మా అన్నయ్య ఇంటిదగ్గర వుండడని తెల్సి ఎందుకు రావటం! ఈసారి ఎప్పుడైనా వస్తే అయిదు తరువాత రండి.'' అని గట్టిగా చెప్పాలని నిశ్చయించుకుంటూ వస్తున్న కోపాన్ని గొంతుకలోనే నొక్కిపట్టి విసురుగా తలుపు తెరిచింది.

అంతే! అలా వుండిపోయింది. గట్టిగా అనాలనుకున్న మాటలు నాలిక చివరదాకా వచ్చి, మళ్ళీ వచ్చినదారినే వెనక్కు పారిపోయి గొంతుకలో ఓ మూలగా దాక్కున్నాయి. గుమ్మంలో కృష్ణసుమంత్ నిలబడివున్నాడు. అతని కను

మువ్వల మురళి

బొమ్మలు ఆశ్చర్యంతో పైకి లేచాయి. ''ఈ అమ్మాయి ఇక్కడ వుందేమిటి? మల్లిఖార్జునరావుకి ఈమె ఏవౌతుంది?'' అన్నట్టు.

''ఇతను ఇక్కడికి ఎలా వచ్చాడు? తన అడ్రసు ఎలా తెల్సుకున్నాడు?'' కంగారుగా, గాబరాగా చూసింది.

అతని పెదవులపై చిరునవ్వు నాట్యం చేసింది. పైకిలేచిన కనుబొమ్మలు తిరిగి మామూలుగా అయి, కళ్ళు కొంటెగా నవ్వినట్టు అయ్యాయి. హారిత గుండె ఒక్కసారి జల్లు మన్నట్టు అయింది. మనసులో కోటి కాంతులు విరజిమ్మే అతని నవ్వు, హారిత మనసుని ఒక వూపు వూపింది. అతను చిరునవ్వుతో ఏదో చెప్ప

స్పందన

నాకు తెలుసు,
ఎప్పుడో ఒకప్పుడు
నీ రాక తప్పదని.
కాని ఇలా —
అర్థాంతరంగా వస్తావనీ కాదు,
మధ్యాంతరంగా వెళ్ళిపోతావనీ కాదు.
వెల్లువగా ప్రవహించాలని
ఆరాటపడే నా హృదయవేదనకు
నీ వచ్చేవరకు ఆగమని ఆనకట్ట వేశాను.
నీ రాకతో —
వెలిగిన నా హృదయజ్యోతులు
శోభను పుంజుకోకముందే —
ఉద్వృతమైన హృదయ స్పందన
తగ్గుముఖం పట్టకముందే —
గుండెలో దాగిన భావాలు
భాషా రూపం దాల్చకముందే —
నన్ను నన్నుగానే ఉంచి
నన్ను గతంలోకి త్రోసి
వెళ్ళిపోతున్నావు భవిష్యత్తులోకి.

— గంగుల నరసింహారెడ్డి

బోయాడు. ఆమె కంగారుగా అటూ ఇటూ చూసింది. ఎవరూ రావటంలేదని నిశ్చయించుకుని చప్పున చేతులు జోడిస్తూ అంది —

''ప్లీజ్! మీరు ఇక్కడనుండి వెంటనే వెళ్ళిపొండి. ఎవరైనా చూస్తే బాగుండదు'' అంది బ్రతిమాలుతున్నట్టు.

అతను అర్థం కానట్టుచూస్తూ మళ్ళీ ఏదో చెప్పబోయాడు.

''మీకు దణ్ణం పెడతాను వెళ్ళిపొండి!'' అంది తిరిగి బ్రతిమాలుతూ, వెనక్కి తలతిప్పి చూసింది తల్లీ,వదినా ఎవరైనా వస్తున్నారేమోనని. ఎవరూ రావటంలేదని ధైర్యం తెచ్చుకుని —

''మీరు ఇలా అడ్రసు తెల్సుకురావటం ఏం బాగోలేదు'' అంది ముఖం పక్కకు తిప్పుకుంటూ.

''నేను అడ్రసు తెల్సుకువచ్చానా?'' అన్నట్టు చూశాడు.

''లేకపోతే నేను అడ్రసు ఇచ్చి ఇంటికి పిల్చానా?'' అన్నట్టు సర్రున చూసింది.

''అబ్బ! ఏం ఆడవాళ్ళురా బాబూ! అర్థానికి పెడర్థాలు తీసేబుద్ధి వీళ్ళకు పుట్టుకతో వచ్చిన విద్యలా వుంది.'' అని మనసులో అనుకుంటూ —

''ఉష్'' అనుకుంటూ చేత్తో నుదురు రాసుకున్నాడు ''నీకు అర్థం అయ్యేట్టు నేను ఎలా చెప్పాలి? ఏ భాషలో చెప్పాలి?'' అన్నట్టు.

అతను 'ఉష్' అని విసుగ్గా ముఖం పెట్టటం హారితకు ఒళ్ళుమండింది. ఏమిటో! పెద్దమనిషి చెపితే వినడు — చెముడా ఏమిటి! కోపంగా చూసింది.

''చూడండి! నేను మర్యాదగా చెపుతున్నాను. మీరు వెంటనే ఇక్కడనుండి వెళ్ళిపొండి! లేదా మా ఇంట్లోవాళ్ళని పిలవ్వలసివస్తుంది. వాళ్ళు వస్తే చాలా పెద్దగొడవే అవుతుంది. ఆ తరువాత మీ ఇష్టం.''

అతనికి ఏం అనాలో పాలుపోక అరచేత్తో గెడ్డంమీద రాసుకున్నాడు, 'ఏమిటి ఈ అమ్మాయి ఇలా అంటుంది' అన్నట్టు.

''యు ప్లీజ్ గో ఎవే ఫ్రమ్ హియర్'' అంది కంగారుగా బ్రతిమాలుతున్నట్టుగా.

అతను నిశ్చేష్టుడై అలాగే నిలబడిపోయాడు.

''హారితా ఎవరు వచ్చారు! అంతసేపు మాట్లాడుతున్నావ్'' అంటూ లోపలనుండి అడిగింది విశాలి.

వదినగారి మాటలు వింటూనే కంగారుగా చూస్తూ ''అదిగో మా వదిన వస్తోంది. మీరు వెళ్ళండి'' అంటూ వీధి తలుపులు టపీమని మూసేసింది. కొద్దిక్షణాలు తరువాత కారు వెళ్ళిపోయిన శబ్దం అయింది.

మూసేసిన తలుపులకి చేరబడి నిలబడిన హారిత కారు వెళ్ళిపోయిన శబ్దం వింటూనే 'హమ్మయ్య' అన్నట్టు గుండెలపై చెయ్యి వేసుకుని తేలిగ్గా నిట్టూర్చింది.

''హారితా!'' అంటూ పిలిచింది.

''అబ్బబ్బ! ఎప్పుడూ అలా పిలుస్తూనే వుంటారు.'' విసుక్కుంటూ వెళ్ళింది, ''ఏం'' అంటూ.

''ఎవరు వచ్చారు?'' అడిగింది ఆవిడ.

''ఎవరో ఇల్లు తెలియక ఈ ఇల్లు అనుకుని వచ్చారు.'' అప్రయత్నంగా అబద్ధం ఆడేసింది. ఆవిడ ఇంకేం మాట్లాడలేదు

హారిత గబగబ మేడమీదకు పరుగుపెట్టింది. డాబామీద నిలబడి రెడ్ కలర్ చెవర్లెట్ కోసం వెతికింది. ఆమెకు ఆ చెవర్లెట్ ఎక్కడా కనిపించలేదు. ఎక్కడయినా ఆపి తన కోసం చూస్తున్నాడేమో అనుకుంది. అతనుగాని, అతని చెవర్లెట్గాని ఆ వీధిలో ఎక్కడా కనిపించలేదు. హారిత ముఖం ఒక్కసారి చిన్నబోయింది.

అతను సరాసరి ఇంటికే వచ్చేశాడు. ఎంత ధైర్యం! అమ్మా, అన్నయ్య, వదిన ఏమనుకుంటారు. అంత పరిచయమేలేదు, ఇంటికి ఎలా వచ్చేడు చెప్మా అనుకుంది.

మెల్లగా మేడదిగి తన గదిలోకి వెళ్ళి మంచం మీద పడిపోయింది. అతని ఇల్లు ఎక్కడో పాపం!

అతను మంచివాడిలాగే వున్నాడు. తనే అనవసరంగా కోపం తెచ్చుకుంది. ఏదో చెప్పబోతూంటే తనే వినకుండా తలుపులు మూసేసింది. అతను ఏమనుకున్నాడో! హరిత అమర్యాదగా ప్రవర్తించినందుకు తనలో తానే సిగ్గుపడింది.

కృష్ణసుమంత్ కనిపించిన దగ్గర నుండి ఆలోచనలు అలలు చెలరేగుతున్నాయి. అతని రూపం ఆమె హృదయంలో చెరగని ముద్ర వేసింది. అతని కళ్ళల్లో వున్న చురుకుదనం, చిలిపితనం ఆమె మనసును ఆకట్టుకున్నాయి.

ఆవేళ అంతా స్వప్నావస్థలో తేలిపోతున్నట్టుగా గడిపింది, హరిత. ఆమెకు ఆ రాత్రి అంతసరిగ్గా నిద్రపట్టలేదు. చిత్రమైన భావనలతోనూ, విచిత్రమైన మధురమైన స్వప్నాలతోనూ గడిపింది.

ట్రైన్‌లో జరిగిన సంఘటన, వాళ్ళ ఇంటి దగ్గర జరిగిన సంఘటనలు ఆమె హృదయవీధులలో పరిభ్రమించసాగాయి. ఎర్రని పెదవులమీద హాస రేఖ తళుక్కున మెరిసింది. ఆమె మనసు అంతా అతనిపట్ల అవ్యక్తమైన అనురాగంతో నిండిపోయింది

7

కృష్ణసుమంత్ రోజా యింటికి వెళ్ళాడు. యిల్లు తెల్సుకోవటం ఏమంత కష్టం కాలేదు. కారు రోడ్డుమీద ఆపి యింటికి వెళ్ళగానే, రోజా క్షణ కాలంపాటు అలాగే నిలబడిపోయింది. లాయర్ కృష్ణసుమంత్ అంటే వైజాగ్‌లో మంచిపేరు వుంది. అటువంటి అతను యిల్లు తెల్సుకుని తన ఇంటికి వచ్చాడంటే!

రోజా సంభ్రమాశ్చర్యాలతో ఉక్కిరిబిక్కిరి అయినట్టు అయి సంతోషంతో, తొట్రుపాటు పడుతూ అతన్ని లోపలకు ఆహ్వానించి, కుర్చీ తెచ్చి వేసింది కూర్చోమంటూ.

"అమ్మ వున్నారా ?"

'వున్నారు' అన్నట్టు తలవూపింది.

"పిలవండి" అని అతను అనటంతో రోజా లోపలకు వెళ్ళి తల్లిని పిల్చుకువచ్చింది.

"అమ్మా! నేను చెప్పాను రామనాథం మాష్టర్‌గారు పరిచయం చేశారు, లాయర్ కృష్ణసుమంత్‌గారు అని. వీరేనమ్మా!" అంది తల్లితో చెప్తూ.

అతను చేతులు జోడించి నమస్కరించాడు. ఆవిడ "నమస్కారం బాబూ!" అంది.

"అలా కూర్చోండి అమ్మా!" అన్నాడు ఎంతో మర్యాదగా.

"ఫర్వాలేదు బాబూ!" అంది ఆవిడ అలాగే నిలబడుతూ.

అతను బలవంతంమీద ఆవిడ కూడా ఓ స్టూల్‌మీద కూర్చుంది. ఆవిడ లేచి తిరగ్గల్గుతున్నా, చాలా బలహీనంగా, మనిషి ఎండిపోయినట్టు ఎముకల ప్రోగులా కనిపిస్తూంది. అతనితో ఏవో విషయాలు మాట్లాడుతున్నా, ఆవిడ ఆయాసంతో సరిగ్గా మాట్లాడలేకపోతూంది.

ఆవిడను చూస్తుంటే అతనికి అనుమానం వచ్చింది. ఆవిడ ఆరోగ్యం పూర్తిగా పాడైపోయిందని.

"ఏమిటి! అంత నీరసంగా వున్నారు! మందులు ఏమైనా వాడుతున్నారా ?"

"మందులా!" ఆవిడ పెదవులపై పేలవమైన చిరునవ్వు క్షణం మెరిసి మాయమైంది.

రోజా వదనం భూమిలోకి క్రుంగిపోయినట్లయింది. తల్లిని రక్షించుకునే మార్గం కనిపించటంలేదు. డబ్బులేక తనలో తానే కుమిలిపోయింది. ఆమె ముఖం మ్లానమైంది.

కృష్ణసుమంత్‌కి వాళ్ళ పరిస్థితి అంతా వెంటనే అర్థం అయిపోయింది. "మీరు ఏం బెంగపడకండి. నేను వున్నాను. మీ అమ్మగారిని డాక్టర్‌కి చూపిస్తాను" అంటూ ధైర్యం చెప్పాడు.

అతని మాటలకి రోజా ముఖం సంతోషంతో తళుక్కునమెరిసింది. సీతమ్మ ఏం మాట్లాడలేదు. ఆయాసపడుతూ అలాగే కూర్చుంది. కళ్ళల్లో నిరాశ, నిస్పృహ గూడుకట్టుకుంది.

ఇక నేను ఎంతోకాలం బ్రతకను! 'ఎందుకీ వృథా ప్రయాస' అన్నట్టు చూసింది. తల్లిని అలా చూస్తూంటే రోజాకి దిగులుగా, భయంగా వుంది. కృష్ణసుమంత్ ఇప్పుడే వస్తానని చెప్పి వెళ్ళి ఓ పావుగంటలో డాక్టర్‌ని వెంటబెట్టుకు వచ్చాడు.

డాక్టర్ ఆవిడ్ని పరీక్షించి ఏం మందులు వ్రాసి ఇవ్వలేదు. కె.జి.హెచ్.కి తీసుకువెళ్ళమని వుత్తరం వ్రాసి ఇచ్చాడు.

ఆ వుత్తరం చదువుతూనే అతని ముఖంలో గబగబ రంగులు మారాయి. "డాక్టర్" అన్నాడు అయోమయంగా చూస్తూ.

"డోంట్ వర్రీ మిష్టర్ కృష్ణసుమంత్!" అంటూ ధైర్యం చెపుతున్నట్టుగా చిరునవ్వు నవ్వాడు డాక్టర్.

కే. జి. హెచ్‌లో డాక్టర్లందరూ అతనికి తెల్సు. ఆవిడకు ఏమైనా అయితే రోజా ఒంటరిది అయిపోతుంది. ఒంటరిగా వున్న ఆడపిల్లని ఈ లోకం బ్రతకనిస్తుందా!

డాక్టర్ వెళ్ళిపోయాడు. అతను వాళ్ళకి ధైర్యం చెప్పి 'రేపు ఉదయమే వచ్చి హాస్పటల్‌కి తీసుకువెళ్తాను' అని చెప్పి వెళ్ళిపోయాడు.


యింటికి వచ్చిన కృష్ణసుమంత్‌కి ఏంచెయ్యాలో పాలుపోవటం లేదు. అతనికి కే. జి. హెచ్‌లో తెల్సిన డాక్టర్లందరితో మాట్లాడాడు, ఆ విషయం గురించి. డాక్టర్ ఇచ్చిన వుత్తరం చూపించాడు. వాళ్ళు ఆ వుత్తరం చదువుకుని ఆవిడ్ని రేపు ఉదయం తొమ్మిది గంటలకి తీసుకురమ్మన్నారు.

మీరే రానవసరంలేదు! ఎవర్ని ఇచ్చి అయినా పంపించండి అన్నారు. కృష్ణసుమంత్ తనకి తెల్సిన శాస్త్రితో మాట్లాడి అతన్ని తీసుకుని వాళ్ళ ఇంటికి వెళ్ళాడు.

రోజాని, సీతమ్మని తీసుకుని హాస్పటల్‌కి వెళ్ళి శాస్త్రిని వాళ్ళతో వుంచి, డాక్టర్ చూశాక టాక్సీలో వాళ్ళ ఇంటిదగ్గర దిగబెట్టమని శాస్త్రికి చెప్పి అతను అలా కోర్టుకి వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం శాస్త్రి అతన్ని కల్సుకుని వివరంగా చెప్పాడు. "ఎక్స్‌రే తీశారు. రేపు రమ్మన్నారు. రక్తపరీక్ష చేశారు" అని చెప్పాడు. కృష్ణసుమంత్ తల వూపి వూరుకున్నాడు.

వెల్తురు, గాలి, విశాలంగా వున్న యిల్లు ఒకటి చూసి వాళ్ళ మకాం ఆ యింటికి మార్పించేశాడు డాక్టర్లు చెప్పిన విషయం మూలంగా ఆవిడకు 'బ్లడ్ కేన్సర్' అనీ, బాగా ముదిరిపోయి పరిస్థితి చాలా విషమించింది అనీ, ఆవిడ కొద్ది రోజులకంటే ఎక్కువ బ్రతకదని చెప్పారు. 'ఆవిడ్ని ఏమాత్రం కదలనివ్వకుండా అలా మంచంమీదే వుంచాలి' అనీ, 'మందులు టైముకి వాడాలి' అని



డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

జి. ఆర్. — వాల్తేరు

నా కంఠ భాగంలో చాలా రోజులుగా వాపు వున్నది. ఏదైనా ఆహారంగాని, నీరుగాని మింగే సమయంలో ఈ వాపు బాగా కనిపిస్తుంది. దానివల్ల నెప్పిగాని మరే బాధగాని లేదు. దీనివలన భయమేమైనా వున్నదా?

★ ఈ వాపు 'థైరాయిడ్ గ్రంధి'కి సంబంధించినదని తేలికగా నిర్ధారణగా చెప్పవచ్చును. దీనినే 'గాయిటర్' లేక 'అడినోమా థైరాయిడ్' అంటారు. అయొడిన్ ఆహారంలో తగినంత ప్రమాణంలో లేకపోయినా లేక మెదడు క్రింద భాగంలోని 'పిట్యూటరీ' గ్రంధినుండి 'థైరాయిడ్ స్టిమ్యులేటింగ్ హార్మోన్' సరిగ్గా ఉత్పత్తి గాకపోయినా యిలా జరుగుతుంది. ఈ గ్రంధి ఎనితనం లోపించటంవల్ల ఏ లక్షణం కనబడకుండా వుండదు. కాబట్టి మీరు అని లేనిదృష్ట్యా ప్రస్తుతానికి భయపడవలసిన అవసరంలేదు.

వి. ఎమ్. ఎన్. — మద్రాస్

నాకు 7 నెలల నుండి 'హెర్నియా' వున్నది. అది దగ్గినపుడంతా పెద్దదవుతుంది. దాన్ని అలానే వదిలివేయవచ్చునా? పెద్దదవకుండా వుండుటకు తీసుకొనవలసిన జాగ్రత్తలు ఏమిటి?

★ హెర్నియా అనే జబ్బు ఉదర భాగంలోని "గోడలలో" ఇమిడివున్న కండరాల పటుత్వం తగ్గినా లేక జీర్ణకోశం మొదలయిన భాగాలు అమరివున్న ఉదర భాగంలో 'పీడనశక్తి' ఎక్కువ అయినా లేక ఈ రెండూ ఒకే సమయంలో వున్నా ఉదర భాగాలలో కదలిక పటుత్వం తప్పిన ఉదర భాగాన్ని కప్పివుంచుతున్న గోడలలో ఖాళీలేర్పరుస్తూ వచ్చి, క్రమేపీ బయటికి, దగ్గినా, తుమ్మినా మలబద్ధకం వున్నా రావటం అనేదే! కొన్ని సమయాలలో అంతర్గతంగానే కొన్ని భాగాలు యితర భాగాలలోనికి చొచ్చుకొనిపోవటానికి హెర్నియా అనే పదం వర్తిస్తుంది.

మీరు శస్త్ర వైద్యులకి చూపించి ఆ 'హెర్నియా' ప్రమాద స్థలంలోనో లేక ప్రమాదకర పరిస్థితిలోనో వుందని వారు చెబితే వెంటనే శస్త్రచికిత్స చేయించుకోవటం, అంత తొందర లేదని వారంటే 'బెల్ట్' మొదలయినవి సైన్స్ ప్రకారంకాని వాడటం, పై కారణాలకి తగిన చికిత్స చేయించుకోవటం అవసరం.

ఎస్. ఎల్. — అన్నంగి

తెలివితేటలు చురుకుతనం పెరగాలంటే ఏమి మందులు వాడాలి?

★ ఒక మనిషిలో తెలివితేటలనేవి ప్రకృతి సిద్ధంగా అంటే 'గర్భాశయ ప్రకృతి' అనబడే శిశువుగా తల్లి గర్భంలో ఏర్పడినప్పటినుంచి; పుట్టిన తర్వాత, ఎదురైన అవకాశాలు, పరిస్థితుల ప్రభావాలు, లోటుపాటు ప్రాపు, తల్లిదండ్రుల పెంపకం మొదలైన అంశాలపై ఆధారపడి వుంటాయి.

ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన తెలివితేటలని ప్రకృతిసిద్ధంగానే క్రమేపీ అలవరచుకోవాలిగాని మందులు — మాకులు వాడటంవల్ల తెలివి పెంచటం అనేది వృధా భ్రమే. చురుకుతనం మొదలైనవి లేకపోవటం ఏ వ్యాపకం లేక కొన్ని సంవత్సరాలపాటు పనిపాటా లేకపోవటంవల్ల ఏర్పడే ఒక అలవాటు మాత్రమే.

చెప్పారు. "హాస్పటల్లో వుంచినాసరే, ఇంటి దగ్గర జాగ్రత్తగా చూసినాసరే, ఆవిడ మాత్రం కొద్దిరోజులకంటే ఎక్కువ బ్రతకదు! ఆవిడ్ని ఎక్కడ వుంచినాసరే మీ ఇష్టం" అన్నారు.

అందుకే ఆవిడ్ని ఇంటిదగ్గరే వుంచి జాగ్రత్తగా చూడసాగాడు సీతమ్మకు తన పరిస్థితి ఏమిటో అర్థం అయిపోయింది. పైకి ఏమీ అనకుండా మౌనంగా వుండిపోయింది.

కృష్ణహనుమంత్ రోజాని చాటుగా పిల్చి చెప్పాడు. "చూడు రోజా! నువ్వు అమ్మదగ్గరే కూర్చుని జాగ్రత్తగా చూస్తుండు. నువ్వు ఈ పరిస్థితుల్లో ఏ వుద్యోగం చెయ్యలేవు. అమ్మకు కొద్దిగా నయం అయిన తరువాత వుద్యోగంలో ప్రవేశిద్దువుగాని" అంటూ. ఆమె అతనివైపు కృతజ్ఞతగా చూస్తూ, 'అలాగే' అన్నట్టు తల వూపింది. ఆవిడకు అవుతున్న మందుల ఖర్చు, యింటి ఖర్చు, యింటి అద్దె అన్నీ అతనే భరిస్తున్నాడు. మరొక టైములో అయితే రోజా అందుకు ససేమిరా ఒప్పుకోకపోను, ఇప్పుడు తప్పనిసరి అవటంవల్ల ఒప్పుకుంది. ఏమిటో, అతను పరాయివాడిలా అనిపించటంలేదు. కావల్సినవాడు, దగ్గరవాడిలా అనిపించసాగాడు.

అతను చాలా అందంగా, హుందాగా వుంటాడు అనుకుంది. ఎంత మంచి మనసు, ఎంత మంచి వ్యక్తిత్వం, అతని గురించి ఆలోచించకుండా వుండలేకపోయింది

రెండు రోజుల తరువాత — కృష్ణహనుమంత్ కోర్టునుండి ఇంటికి వచ్చేటప్పటికి శాస్త్రి హాలులో పేపరు చదువుతూ కూర్చున్నాడు. అతన్ని

మువ్వల మురళి

చూస్తూనే "హలో శాస్త్రీ! గుడీవినింగ్" అంటూ చిరునవ్వుతో — "ఏమిటి ఇలా వచ్చావు!" అంటూ ప్రశ్నించాడు.

"నీతో ఓ విషయం మాట్లాడదామని."

"నాతోనా!" అతని భ్రుకుటిముడి పడింది.

"అవును!" తల వూపాడు.

"ఏమిటో చెప్పు!" అన్నాడు కాంబూట్లు విప్పుకుంటూ, మేజోళ్ళు తీసి బూట్లలో పడేసి బూట్లు కాలితో వెనక్కి నెట్టేస్తూ. అంతలో పనికుర్రాడు ట్రేలో కాఫీలు పట్టుకొచ్చి అక్కడ పెట్టాడు. చెరో కప్పూ చేత్తో పట్టుకుని కాఫీ త్రాగసాగారు.

"రోజా తల్లిని హాస్పటల్లో ఎడ్మిట్ చెయ్యటం మంచిది."

కృష్ణహనుమంత్ మాట్లాడలేదు.

"వాళ్ళకి ఏదో దారి చూపించి వాళ్ళని అలా ఒదిలివెయ్యటం మంచిది." అతను చురుగ్గా శాస్త్రి ముఖంలోకి చూశాడు. అతను ఏ వుద్దేశంతో తనకు ఆ మాటలు చెపుతున్నాడా అన్నట్టు.

శాస్త్రి మళ్ళీ చెప్పసాగాడు. "నువ్వు వాళ్ళకి వేరే ఇల్లు తీసి పెట్టటం, ఆ ఖర్చులన్నీ నువ్వు భరించటం, డాక్టర్లందరితో ఆవిడ విషయంలో జాగ్రత్తగా, శ్రద్ధగా చూడమని చెప్పటం, నువ్వు ప్రతిరోజూ వాళ్ళ ఇంటికి వెళ్లటం, చూసినవాళ్ళు అంతా ఏమనుకుంటారు! విశాఖపట్టణంలో నీకు ఎంతో మంచి పేరు వుంది. ఈ విషయాలన్నీ తెలిస్తే అంతా ఏమనుకుంటారు! మనిషి మంచి పేరు తెచ్చుకోవటం కోసం ఎంతో కష్టపడాలి — చెడ్డపేరు రావడానికి నిముషం పట్టదు. నా మాట విని వాళ్ళకి దూరంగా వుండు. రోజా పెళ్ళికాని పిల్ల. నీకూ పెళ్ళికాలేదు. ఎందరు ఎన్ని రకాలుగా చెప్పుకుంటారో ఏమైనా గ్రహించుకున్నావా?"

ఆ మాటలు వింటూనే అతని ముఖం ఎర్రబడి, గంభీరంగా మారిపోయింది.

"నా మాట విని ఆవిడ్ని హాస్పిటల్లో ఎడ్మిట్ చెయ్యి."

"శాస్త్రీ!" అసహనంగా అన్నాడు. కోపం ఆపుకుంటూ — "స్టాపిట్" అంటూ స్నేహితుడి వైపు చూశాడు.


"నీకు కోపం వస్తుంది అని నాకు తెల్సు. నీ శ్రేయస్సు కోరే వాళ్ళలో మొదటివాడ్ని కావటం చేత చెప్పకుండా వుండలేకపోయాను"

కృష్ణహనుమంత్ మాట్లాడలేదు. అయిదు నిముషాలపాటు హాలు అంతా నిశ్శబ్దం అయిపోయింది. ఎవ్వరూ ఏం మాట్లాడుకోలేదు. మౌనంగా కూర్చున్నారు. ఒకే విషయం గురించి అయినా ఇద్దరూ రకరకాలుగా ఆలోచిస్తున్నారు. కాస్సేపటికి శాస్త్రి "నే వెళతాను. బాగా ఆలోచించుకో" అంటూ వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళినవైపే చూస్తూ క్షణం ఆలోచనలో పడిపోయాడు. కాళ్ళు టీపాయ్‌మీదకు బారచాపి, సోఫా వెనక్కి చేరబడ్డాడు. పగిలిపోతున్న తలను వేళ్ళతో కణతల దగ్గర గట్టిగా పట్టుకుంటూ కళ్ళు మూసుకున్నాడు అశాంతిగా.

/ఇంకా వుంది/





పైన : 'నకిలీ మనిషి'లో దృశ్యం — దిగువ : 'నిప్పులాంటి నిజం'లో దృశ్యం

సినిమా విశేషాలు -జి. వి. జి.

డాక్టర్ మాలతిలో కాబోయే డాక్టరు

ప్రకాష్ (శ్రీధర్) ఒక మెకానిక్. అతని జీవిత లక్ష్యం చెల్లాయి (సువర్ణ)ని డాక్టర్ చెయ్యాలని. ఓ రోజు ఉదయం అతను రొప్పుతూ రొజుతూ పరుగున వచ్చాడు. 'అమ్మా, మాలతీ!''

మాలతి కంగారుగా వచ్చింది. ''ఏమిటన్నయ్యా ఈ హడావుడి ?''

''హడావుడి కాదమ్మా; అమితానందం. నువ్వు ఫస్ట్‌క్లాసులో పాసయ్యావమ్మా ! నిన్ను ఎం. బి. బి. ఎస్.లో చేర్పించాల్సిందే. నువ్వు డాక్టర్ మాలతివి కావల్సిందే! ఇటీస్ మై డ్యూటీ!''

''ఏమిటన్నయ్యా డ్యూటీ? ఇరవై నాలుగ్గంటలూ రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదిస్తున్నావ్. ఎప్పుడూ నా చదువూ, నా బాగూ అంటూ కలలు కంటూవేగాని, నీ అభివృద్ధి, నీ బాగు గురించి ఒక్క క్షణమైనా ఆలోచించవే! పుట్టి కన్న తల్లిదండ్రులను దూరం చేసిన దౌర్భాగ్యురాల్ని. అప్పటినుంచీ నీ గుండెలమీద కుంపటినై, నీ రక్తాన్ని పిండుకు తాగుతున్నాను.''

''అమ్మా, మాలతీ! ఏమిటామాటలు ? ఎందుకా కన్నీళ్ళు ? చెల్లాయి సౌభాగ్యం కోసం అన్న కష్టపడటంలో ఆశ్చర్యమేముందమ్మా ? నిన్ను డాక్టర్ మాలని చేసి, ఒకయ్య చేతిలో పెడితేనే అన్నగా నా బాధ్యతలు తీరుతాయి. అమ్మా నాన్నల ఆత్మలూ శాంతిస్తాయి,'' అంటూ ప్రకాష్ ఉండీ తెరిచి లెక్కపెట్టి,''తొమ్మిదివందల తొంభై రూపాయలు. ఈ పదితో వెయ్యి పూర్తయ్యాయి,'' అన్నాడు పది రూపాయల నోటు చేర్చుతూ.

''ఎందుకన్నయ్యా వెయ్యి రూపాయలు ?''

''ఎందుకేమిటమ్మా ? అడ్మిషన్ ఫీజు, పుస్తకాలు, బట్టలకు కనీసం వెయ్యి రూపాయలన్నా లేకపోతే ఎట్లా ? నువ్వెళ్ళేది మెడికల్ కాలేజీకి. అన్నీ దర్జాగా ఉండాలి.''

''నువ్వు మాత్రం ఆ రెండు జతలతోనే గడపాలి.''

''నాకెందుకమ్మా ఇనుప ముక్కల్లో పడి మునిగి తేలేవాడికి ?''

''ఫో, అన్నయ్యా! నువ్వెప్పుడూ ఇంతే. నీతో మాట్లాడమే కష్టం.''

చెల్లి బుంగమూతిపెట్టుకోవడం చూసి ప్రకాష్ తృప్తిగా నవ్వాడు.

ఆట్లూరి మధుసూదనరావు కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు, దర్శకత్వంలో బి. రామకృష్ణారావు, వి. సీతారామచౌదరి నిర్మించే గురురాజా ఆర్ట్ పిక్చర్స్ ''డాక్టర్ మాలతి'' చిత్రానికి పి. రాజగోపాల్ ఛీఫ్ ప్రొడక్షన్ కంట్రోలర్.

'శుభోదయం'లో సులక్షణ





'పుట్టిబిడ్డ'లో కృష్ణంరాజు, శ్రీదేవి

నకిలీ మనిషిలో అసలు మనిషి

ప్రసాద్ (చిరంజీవి)తో గంగరాజు (సత్యనారాయణ) బాధగా తన గాథ వివరిస్తూ, "నేనా రోజుల్లో మిలటరీలో ఉన్నాను. మా అమ్మా, చెల్లీ – అయ్యగారి బంగళా చూసుకుంటూ మా ఊళ్ళో ఉన్నారు ... ఒకరోజు ఓ దొంగనాయాలు బంగళాకొచ్చాడు ... నా చెల్లెల్ని పాడుచేసి, అయ్యగార్ని చంపి పారిపోయాడు. నా చెల్లెలు పిచ్చిదైపోయింది. మా అమ్మ చచ్చిపోయింది ... చూడు. నా చెల్లెలు జీవచ్ఛవంలా ఎలా బతుకుతోందో చూడు ... అమ్మా, సుశీలా!" అంటూ పిలిచాడు.

సుశీల పక్కగదిలోంచి వచ్చింది. ప్రసాద్‌ను చూడగానే ఆమె నెత్తిన పిడుగు పడ్డట్టయింది. అతను ముమ్మూర్తులా తన ప్రియుడు శ్యాంను పోలి ఉండడంతో – చివాలున అతని దగ్గరికి వెళ్ళి, "ఇతనే ... శ్యాం ఇతనే! శ్యాం, ఇంతకాలం ఎక్కడికి పోయావ్, శ్యాం ?" బావురుమంది.

గంగరాజు నిర్ఘాంతపోయాడు.

ప్రసాద్ తెల్లబోతూ, "నేను ... శ్యాం కాదమ్మా ... నేను – శ్యాంను కాను," అన్నాడు.

"ఏమిటీ! శ్యాం! నా చెల్లెలి బతుకుని బుగ్గి చేసిన శ్యాం – నా తల్లి చావుకు కారణమైన రాక్షసుడు ... ఒరేయ్!" అంటూ ప్రసాద్‌మీద పడి పట్టుకొని గంగరాజు "నీ కోసమేరా బతికున్నది. నీ పచ్చిరక్తం తాగడానికేరా ఎదురుచూస్తున్నాను, నాయాలా!" అని గర్జించాడు.

"అన్నయ్యా! శ్యాంని ఏం చేయకన్నయ్యా!" బతిమాలింది సుశీల (కవిత).

ప్రసాద్ పెనుగులాడుతూ, "గంగరాజా, నా మాట విను. నేను శ్యాంను కాను. నాకేం తెలియదు. నీ చెల్లెల్ని నేనెప్పుడూ చూడలేదు. నన్ను విడిచిపెట్టు, గంగరాజా! నా భార్యని బిడ్డల్ని ఎత్తుకుపోయినవాడే బహుశా శ్యాం అయి ఉంటాడు. నా మాట నమ్ము. నేనలాంటి మనిషిని కాను. నేనెప్పుడూ దొంగతనాలు చెయ్యలేదు. నీ చెల్లెల్ని ఎప్పుడూ జీవితంలో చూడలేదు," అని ప్రాధేయపడ్డాడు.

సినిమా

గంగరాజు అలసటతో, బాధతో ప్రసాద్‌ని వదిలేసి, ఒకచోట కూలబడ్డాడు. ఆవేశం నిస్సహాయత, బాధ అన్నీ అతన్ని ముసురుకున్నాయి. భోరుమన్నాడు.

ప్రసాద్, సుశీల అవాక్కయిపోయారు.

ఎస్. డి. లాల్ దర్శకత్వంలో వై. వి. రావ్ నిర్మించిన రవిచిత్రా ఫిలివ్స్ "నకిలీమనిషి" చిత్రానికి గొల్లపూడి సంభాషణలకర్త. సత్యం సంగీత దర్శకుడు. ఎస్. ఎస్. లాల్ ఛాయాగ్రాహకుడు. డి. రాజగోపాల్ సంకలనకర్త.

వైజయంతీ మూవీస్ చిత్రం

"ఎదురులేని మనిషి, యుగపురుషుడు" నిర్మాత అశ్వనీదత్ త్వరలో ప్రారంభించే చిత్రంలో ఎ. ఎన్. ఆర్., కృష్ణ, సుజాత ముఖ్య భూమికలు నిర్వహిస్తారు. బాలమురుగన్ కథకు జంధ్యాల మాటలు రాస్తున్నారు. మురళి సహకార దర్శకుడు. మహదేవన్ సంగీత దర్శకుడు. కె. బాపయ్య దర్శకుడు.

తెలుగు చిత్ర నిర్మాతల సంఘ అధ్యక్షులుగా ఎం. ఎస్. రెడ్డి

జూన్ 15న మద్రాసులో తెలుగు చిత్ర నిర్మాతల సంఘ సర్వసభ్య సమావేశం జరిగినప్పుడు ఏకగ్రీవంగా ఎన్నికైనవారు : అధ్యక్షుడు : ఎం. ఎస్. రెడ్డి. ఉపాధ్యక్షులు : ఎ. పుండరీకాక్షయ్య, ఎం. బాలయ్య. కార్యదర్శులు : జి. హనుమంతరావు, కె. ఛటర్జీ. కోశాధికారి : కె. రాఘవ. కార్యవర్గ సభ్యులు : డి. వి. ఎస్. రాజు, దుక్కిపాటి మధుసూదనరావు, యు. విశ్వేశ్వరరావు, వి. బి. రాజేంద్రప్రసాద్, డి. రామానాయుడు, ఎ. పూర్ణచంద్రరావు, యు. వి. సూర్యనారాయణరాజు, వాశిరాజు ప్రకాశం, జి. శేషగిరిరావు.


'రగిలే హృదయాలు'లో మోహన్‌బాబు, కృష్ణ





శ్రీ సుజాతా ఫిలిమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సమర్పించు
ఈస్ట్‌మన్ కలర్
దర్శకత్వం: ఐ.వి.శశి
సంగీతం: ఇళయరాజా
మాటలు: జంధ్యాల
పాటలు: ఆత్రేయ
నవయుగ
GIRI

ఆంధ్ర ప్రదేశ్ లో
ఒక నవశక్తి
ఉద్భవించింది



Sobhagya



ఆంధ్రప్రదేశ్ రైతు సోదరులకు ఆర్.సి.ఎఫ్. పేరుమాత్రమే కొత్త. ఇది గతంలో ఎఫ్.సి.ఐ. లో భాగంగా ఉండేది, 1978 నుంచి దీనినే ఆర్. సి. ఎఫ్. అని పిలుస్తున్నారు. దేశంలో మొట్టమొదటిసారిగా ప్రిల్డ్ రూపంలో సువలా 20:20 సంకీర్ణ ఎరువును ప్రవేశపెట్టడంద్వారా ఎరువులు ఉత్పత్తి చేసే రంగంలో ఆర్.సి.ఎఫ్. ఒక ప్రత్యేక బాటను రూపొందించుకుంది. సుఫలా ప్రిల్డ్ 20:20 ను ప్రవేశపెట్టిన కొద్ది రోజులలోనే ఆర్. సి. ఎఫ్. తీరు ఎరువుల అమ్మకం అవధులు దాటింది. ఆర్. సి. ఎఫ్. ఎరువుల నాణ్యతకు ఇది తార్కాణం.

ఆర్.సి.ఎఫ్. కార్యకలాపాలలోనే ఒక నూతన దృక్పథం కనిపించసాగింది. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ అమ్మకాలు రు. 100 కోట్లకు మించిపోయాయి. ట్రాంబేలో నాల్గవ విస్తృత కార్యక్రమాన్ని ప్రారంభించడంతో మొదటి ఏడాదిలోనే 1,24,000 మెట్రిక్ టన్నుల కొత్త సంకీర్ణ ఎరువు ఉత్పత్తి చేయడం జరిగింది.

ఆర్.సి.ఎఫ్. ఎరువులను మాత్రమే తయారు చేస్తుందని అనుకోకూడదు. ప్రజల నిత్య జీవనంలో భాగంగా ఉండే ఇంకా ఎన్నో పారిశ్రామిక ఉత్పత్తులు కూడా ఉన్నాయి. ఆర్.సి.ఎఫ్. పారిశ్రామిక ఉత్పత్తులనుంచి అందివ్వబడుతున్న వాటిలో బేకరి వస్తువులు,మందులు వస్త్రాలు, రంగులు మొదలైనవి ఉన్నాయి ఆర్. సి. ఎఫ్. ఉత్పత్తి చేస్తున్న ఆర్గాన్ గ్యాసు స్టెయిన్‌లెస్‌స్టీలు, అల్యూమినియం తదితర నాన్-ఫెర్రస్ లోహాల వెల్డింగ్ పనులకు ఉపయోగించ బడుతోంది. కంపెనీ సిట్రిక్ ఆసిడ్ కర్మాగారం భారతదేశంలో మొట్టమొదటి ఏకైక భారీ కర్మాగారం. ప్రపంచంలో రెండవ స్థానం ఆక్రమించే పెద్ద కర్మాగారం. ఈ ఏడాది సాధించిన పురోగమనంలో పేర్కొన వలసినది అమ్మోనియా, మెథానోల్ కర్మాగారాలలో ఫీడ్ స్టాక్ మరియు శక్తినిచ్చే వనరుగా నాఫ్తాకు బదులు అసోసియేటెడ్ గ్యాస్‌ను వాడడం.

నాణ్యమైనటువంటి సమతుల ఎరువులను అందివ్వడానికి ఆర్. సి. ఎఫ్. లో నిరంతరం పరిశోధనలు జరుగుతూ ఉంటాయి. రైతాంగానికి, వ్యవసాయ రంగానికి కావలసిన అవసరాలను సమకూర్చుతూ సేవ చేయాలన్నదే ఆర్. సి. ఎఫ్. లక్ష్యం.

RCF

రాష్ట్రీయ కెమికల్స్ & ఫెర్టిలైజర్స్ లి.

(కేంద్ర ప్రభుత్వ యాజమాన్య సంస్థ)

ఆంధ్రప్రదేశ్ రీజనల్ ఆఫీస్ హైదరాబాద్

సినిమా



'త్రాగుబోతు తిరుగుబోతు'లో సారధి, సత్యకళ

అమ్మాయి మొగుడు — మామకు యముడులో

అనుమానం పెనుభూతం

రాజా (సత్యనారాయణ) అల్లుడైన కృష్ణ, పద్మ అనే మరో యువతిని వలలో వేసుకొని వంచించాడని కూర్మం (నూతన్‌ప్రసాద్) ఫిర్యాదు చేశాడు. అది విన్న కృష్ణ తండ్రి రామయ్య (గుమ్మడి) కోపంతో ''నువ్వే నా కంటికి రాక్షసుడిలా కనిపిస్తున్నావ్. నువ్వు నా బిడ్డవైనందుకు, రాజావారి అల్లుడివైనందుకు ఎంతో గర్వపడ్డాను. కాని, ఎందుకు చేశావీ పాడుపని? ఈ తలవంపులెందుకు తెచ్చావ్? యజమాని కుటుంబానికి నా కుటుంబంవల్ల ద్రోహం జరిగిందనే పశ్చాత్తాపంతో నేను కుమిలి కుమిలి కృశించిపోవాలనేనా?'' అన్నాడు.

''నాన్నా, స్వామి భక్తి మైకంలో నీ రక్తాన్ని నువ్వే సందేహిస్తున్నావు. కాని, నిప్పులాంటి నిజం చుట్టూ నీ యజమాని కట్టిన గోడ త్వరలోనే పగుల్తుంది... ఇక ఈ చోట ఒక క్షణంకూడా ఉండను... రాజ్యం! వెళ్దాం రా!'' అంటూ తన భార్య (రజనీశర్మ) చెయ్యి పట్టుకున్నాడు.

''నేను రాను!'' అంటూ అతని చెయ్యి విదిలించింది రాజ్యం.

''సరే... రాకపోతే ఇక్కడే ఉండు. నా బిడ్డను తీసుకుపోతాను,'' అంటూ భార్య చేతిలోని బిడ్డను లాక్కొని బయలుదేరాడు కృష్ణ.

''ఏమండీ... నా బిడ్డ... ఏమండీ!'' అని పిలుస్తూ కుప్పలా కూలిపోయింది రాజ్యం.

మాజీ తమిళనాడు ముఖ్యమంత్రులు స్వర్గీయ సి. ఎన్. అన్నాదురై కథకు డాక్టర్ ఎం. కరుణానిధి రాసిన స్క్రీన్‌ప్లే ఆధారంగా మహారథి సంభాషణలు రచించిన పూంపుహార్ ప్రొడక్షన్స్ ''అమ్మాయి మొగుడు — మామకు యముడు'' చిత్రానికి అమృతం దర్శకుడు. నిర్మాత సెల్వం. ''ఒక పెద్ద జమీందారు కుమార్తెకు హీరో మొగుడై, ఆ తర్వాత మామకు యముడుగా నిలచి, అతనిమీద ఎలా పగ తీర్చుకోవడమనేదే ఈ వెరైటీ టైటిల్‌లోని ముఖ్యాంశం,'' అంటూ వివరించారు మహారథి. ''తొలి షెడ్యూల్ మైసూర్‌లో జరిగింది. రెండవ షెడ్యూల్ జులై 22 నుండి 28 వరకు మద్రాసులో జరుగుతుంది,'' అన్నారు నిర్వహణ బాధ్యత వహించే టి. ఎస్. కిశోర్.

తమిళ రచయితలు నిర్మించే తెలుగు చిత్రాలు

లోగడ ''మా దైవం'' నిర్మించిన మణియన్, విద్వాన్ లక్ష్మణన్ జులై 14న రెండు చిత్రాల షూటింగ్‌లను జెమినీ స్టూడియోలో ప్రారంభించారు. తమిళనాడు ముఖ్యమంత్రి శ్రీ ఎం.జి.ఆర్., కెమెరాను స్విచ్ ఆన్ చేశారు. శ్రీ ఆర్. ఎం. వీరప్పన్ జ్యోతి వెలిగించారు.


''ఖూబ్ సూరత్'' హిందీ చిత్రం ఆధారంగా తయారయ్యే ఉదయం ప్రొడక్షన్స్ ''స్వర్గం'' చిత్రానికి శ్రీ దాసరి నారాయణరావు తొలి క్లాప్ కొట్టారు. జయసుధ, చంద్రమోహన్, సత్యనారాయణ, ఎస్. వరలక్ష్మి వగైరా నటవర్గం. చక్రవర్తి సంగీత దర్శకుడు.

''వాయాడి'' తమిళ హిట్ చిత్రం ఆధారంగా తయారయ్యే మణియన్ ఫిలిమ్స్ ''సీతాలు'' చిత్రానికి శ్రీ హృషీకేశ్ ముఖర్జీ తొలి క్లాప్ కొట్టారు. సుజాత, మురళీమోహన్, నాగభూషణం ప్రభృత తారాగణం. ఎం. ఎస్. విశ్వనాథం సంగీత దర్శకుడు.


పై రెండు చిత్రాలకూ కె. దుర్గా నాగేశ్వర రావు దర్శకుడు. రాజశ్రీ రచయిత. కె. ఎస్. హరి ఛాయాగ్రాహకుడు. భాస్కరరాజు శిల్పం, బాలు కూర్పు, డి. దశరథరామరెడ్డి సహకార దర్శకత్వం నిర్వహిస్తున్నారు.

లక్ష్మీజ్యోతి ఫిలిమ్స్

''చిల్లరకొట్టు చిట్టెమ్మ'' చిత్రాన్ని నిర్మాత ఆర్. ఎస్. రాజు తమిళంలో ''పెణ్ణుక్కు యార్ కావల్''గా తీసి, విడుదల చేశారు. ''కె. బాలచందర్ గారు విదేశాలనుంచి తిరిగిరాగానే, వారి కథ, దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో ఓ చిత్రాన్ని మొదలెడ్తాను. ఒకే షెడ్యూల్‌లో పూర్తి చేస్తాను,'' అన్నారు రాజు.



ఎమ్. బాలయ్య B.E. సమర్పించు అమృతా ఫిలింస్
చుట్టాలున్నారు
జాగ్రత్త!
కలర్
తప్పక చూడండి!
దర్శకత్వం: బి.వి. ప్రసాద్
నిర్మాతలు: అలపర్తి సూర్యనారాయణ, మన్నవ వెంకట్రావు
శ్రీ ఫిలింస్



SP
త్వరలో... తాతినేని సుబ్బారావు సమర్పించు
రామ్-శ్యామ్ క్రియేషన్స్
రామాయణంలో పిడకలవేట [కలర్]
కథ-స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: రాజచంద్ర నిర్మాత: డా॥ టి. కె. యమ్. చటర్జీ



టాగూర్ ఆర్ట్స్
నిప్పులాంటి నిజం
నిప్పులాంటి నిజం
నిప్పులాంటి నిజం
నిప్పులాంటి నిజం
నిప్పులాంటి నిజం
నిప్పులాంటి నిజం
నిప్పులాంటి నిజం
నిప్పులాంటి నిజం
నిప్పులాంటి నిజం
నిప్పులాంటి నిజం
లక్ష్మీచిత్ర శ్రీలక్ష్మీచిత్ర
SREE PUBS

కిలాడీ కృష్ణుడుగా భలే పెళ్ళి !

కృష్ణ(కృష్ణ) రాత్రి విజయ ఇంట్లోకి జొరబడ్డాడు. ఇల్లంతా వెతికాడు. ఎవరూ కనిపించలేదు. బయటకురాబోతూ చివాలున ఆగాడు. ఎదురుగా ఇన్స్పెక్టర్ మోహన్ (చంద్రమోహన్) నిలబడి ఉన్నాడు. అతని చేతిలో పిస్టల్ ఉంది.

"ఓ ... తమరా ! ఇంకా నేనే హంతకుడ్నని నమ్మి వెంటాడుతూనే ఉన్నారన్న మాట ?" అన్నాడు కృష్ణ.

"నువ్వు హంతకుడివి కాదు; అసలు హంతకులు ఎవరో తేలిపోయింది. వాళ్ళకు సహకరిస్తున్న అధికారెవరో కూడా సాక్ష్యంతో సహా తేలిపోయింది. నువ్వు భయపడి పారిపోనవద్దు. నిన్ను అరెస్టుచేయను," అన్నాడు మోహన్.

'కిలాడి కృష్ణుడు'లో జయమాలిని



"థాంక్యూ, మోహన్ ! నా చెల్లి చావుకు కారణం కేవలం పాముకాటు కాదు. నిలువెల్లా విషం ఉన్న ఒకడిచేత మానభంగం చెయ్యబడింది. వాడెవడో తెలుసా ? కిశోర్ ... "

"నీకెలా తెలుసు ?"

"ఇదిగో ఫిల్ము. మాలినీ అనే డాన్సర్ అనుకోకుండా ఈ దారుణాన్ని పిక్చరైజ్ చేసింది. ఈ నెగెటివ్ కోసమే ఫొటోగ్రాఫర్ని కిశోర్ హత్య చేశాడు. ఇది నిరూపించడానికే ఆ రోజు నీకు దొరక్కుండా తప్పించుకున్నాను."

"గుడ్ మిస్టర్ గోపీ ! గిరీష్‌కి, కిశోర్‌కి మద్దతుగా నిల్చి మా డిపార్ట్‌మెంట్ పరువు తీస్తున్న మహానుభావుడు ఎవరో కాదు. మా నాన్న ... అందుకు సాక్ష్యం ఈ టేప్. ఇక వాళ్ళ పాపం పండింది. రేపు గగనమహల్‌లో విజయ్‌కి, కిశోర్‌కి పెళ్ళి జరిపించబోతున్నారు. మా నాన్న వాళ్ళకు అండగా ఉంటాడు. ఇదంతా పోలీస్ కమీషనర్‌కు చెప్పి, మనకు సపోర్ట్ తీసుకున్నాను. ఇక ఇద్దరం కలిసి రేపు ... "

"వాళ్ళ పెళ్ళి చేద్దాం." "ఓ — కే ?"

"ఓ — కే !"

ఇద్దరూ చేతులు కలిపారు.

విజయనిర్మల దర్శకత్వం వహించే సంగమం ఆర్ట్‌పిక్చర్స్ "కిలాడి కృష్ణుడు"లో విజయశాంతి, జి. వరలక్ష్మి, పండరీబాయి, జయమాలిని, నిషా, కాంతారావు, త్యాగరాజు, నాగభూషణం, మిక్కిలినేని, పద్మనాభం, గిరిబాబు, సాక్షిరంగారావు, సారథి, పాత్రధారులు. అప్పలాచార్య కథ, మాటలు రాశారు. రమేష్‌నాయుడు, లక్ష్మణ్‌గోరే, తోట, ఆదుర్తి హరనాథ్, శేషు, పద్మనాభం వగైరా సాంకేతికవర్గం.

'కాళి'లో ఒక సన్నివేశం



కన్నవి - విన్నవి

★ తుమ్మితే అపశకునమంటారు. ఐతే, చలనచిత్రాల విషయంలో ఇది తద్విరుద్ధమని చెప్పక తప్పదు. ఎంచేతంటే, థామస్ అల్వా ఎడిసన్ ఆదిలో చలనచిత్రాలు తయారుచేసే విధానం కనుగొనే ప్రయోగంలో — అతని అసిస్టెంటు ఫ్రెయిట్ తుమ్ముతూండగా వెంట వెంటనే ఫొటోగ్రాఫ్ చేసేశాడు. ఫలితం అతనికి సంతృప్తినిచ్చింది. అంచేత, ఏదైనా కొత్తచిత్రం ప్రారంభోత్సవ సమయంలో ఎవరైనా తుమ్మినా — శుభసూచకంగా తీసుకోవడంలో తప్పులేదేమో !

★ అమితాబ్‌బచ్చన్‌కు మందులు, పెయింట్లు తయారుచేసే కార్ఖానా ఉంది. రాజేంద్రకుమార్‌కు బీర్ తయారుచేసే కర్మాగారం ఉంది.

★ తమిళ సినీకవి వాలి "అదు — అదు అల్ల" (అది — అది కాదు) అనే నాటకం తయారుచేస్తున్నాడు. అందులో హీరో గాయకుడు. ఆ పాత్రకు పి. బి. శ్రీనివాస్‌ను ఎన్నుకున్నాడు.

★ కె.వి. మహదేవన్ ప్రతిరోజూ రాత్రిళ్ళు రిక్షాలో కొంతదూరం షికారు వెళ్లిరావడం మామూలు. అందుకోసమని ఓ రిక్షాను కొన్నాడు కూడా. అలా రిక్షాలో వెళ్తున్నప్పుడే చక్కని ట్యూన్‌లు తడుతూంటాయట.

★ రతి తన 18వ ఏట స్విమ్మింగ్ ఛాంపియన్ అనిపించుకుంది. 1978లో మిస్ మద్రాస్‌గా ఎన్నికైంది. ఇప్పుడు ఎనిమిది హిందీ చిత్రాల్లో బుక్ అయింది.

★ ఇటుపైన మలయాళ చిత్రాల్లో నటించనని రెండేళ్ళుగా చెప్తూవచ్చిన కమలహాసన్ ఇటీవల రెండు మలయాళ చిత్రాల్లో నటించడానికి ఒప్పుకున్నాడు.

★ తమిళ దర్శకుడు మాధవన్ ఉదయం కాల్‌షీట్‌కు ఆలస్యం చేయకుండా హాజరయ్యే తారలను "గుడ్ మార్నింగ్" అని విష్ చేస్తాడట. కాస్త ఆలస్యంగా వస్తేచాలు "గుడ్ ఆఫ్టర్ నూన్ !" అని విష్ చేస్తాడట.

★ "నేను చదువులో మొద్దు. లెక్కల్లో సున్న. ఏడవ తరగతి మూడుసార్లు డింకీ కొట్టాను. క్లాసులకు సరిగా హాజరవక కొన్ని రోజులపాటు సస్పెండ్ చేయబడ్డాను కూడా. పదవక్లాసుతో ఎలాగో బయటపడ్డాను. ఆ తర్వాత ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరాను. చివరికిలా నటిగా వెలుగొందుతున్నాను," అంటుంది హిందీ నటి రంజితా.



'నిషానా' హిందీ చిత్రంలో ఒక దృశ్యం

నాగమల్లి:
నీళ్ళు — కన్నీళ్ళు

గూడెం గుండెల్నిండా ఆనందం పొంగుతున్న ఆ రాత్రి కాముని పున్నమి. వయసులు సొగసులు జతపడి, సృష్టిలో జమపడి పోయే ఆ రాత్రి ఎంతో సందడిగా ఉంది. గూడెం దేవతదగ్గర నిలబడి పూజారి ఏవో మంత్రాలు చదువుతున్నాడు. వయసులో సొగసరి అందంలో పోటరి అయిన నాగరాజును మాత్రం ఇద్దరు మనుషులు తాళ్ళతో చెట్టుకు కట్టేస్తున్నారు.

ఇంతలో నాగరాజు తండ్రి వచ్చి, "నీ పిల్లంగోవి పాడుగాను. నా కడుపున చెడ బుట్టావురా! నేను నా జన్మలో ఎప్పుడైనా గూడెం కట్టుబాట్లు ఎదిరించానా? థూ!" అని కాండ్రించి ఉమ్మేశాడు. అతని చేతిలోని పిల్లనగ్రోవిని మంటల్లో పడేశాడు.

అప్పటికే చాలా దెబ్బలు తిని ఉన్న నాగరాజు ఒళ్ళు బొబ్బలెక్కిపోయింది. అదంతా చూసిన గూడెం పెద్దకు కంటతడి అయింది. "ఆగరా. కొండా! ఇంకాడ్ని కొట్టమాక. పండగపూట ఈ దెబ్బలేంట్రా? నాగరాజా, నీ కట్లు ఇప్పేస్తా. ఎల్లి రయికల పండగ సేసుకుంటావా?"

"ఛత్! ఆ ఎదవ ముండల్తో నాకేటి పని?" అని నాగరాజు తల తిప్పేసుకున్నాడు.

"ఈ అందగాడి కోసం ఆకాసంనుంచి అప్సరస ఊడిపడద్ది!" తండ్రి దిగ్గున లేచాడు.

నాగరాజు అభిమానం దెబ్బతిన్నది. వాడికి వాడి పిల్లనగ్రోవి ముందు ఈ ఆడవాళ్ళెవరూ ఆనడం లేదు. "ఓరయ్యో, నువ్వు మల్లా అట్టా గన్నావంటే నేనొల్లకోన్రో!" అని నాగరాజు గింజుకోవడం చూసిన పూజారి "ఏటో అనుకున్నా. నీ కొడుక్కి ముట్టె పొగరు దట్టంగా ఉందిరోయ్!" అన్నాడు.

తండ్రి, గూడెం పెద్దతో అక్కడ్నించి వెళ్ళిపోయాడు.

నాగమ్మ, గూడెంలోని కుర్రకారు అంతా ఆడారు. పాడారు. ఆ తర్వాత అంతా ఎటువాళ్ళు అటు పోయారు. నాగమ్మ ఒక్కతే మిగిలింది. జాలిగా నాగరాజు దగ్గరికి వెళ్ళింది. స్పృహ తప్పినట్లు తల ఒక పక్కకు వాల్చేసి వేలాడుతున్నాడు. నాగమ్మ కట్లువిప్పి అతన్ని పడుకోబెట్టి, మంచినీళ్ళు తీసుకురావడం కోసం పరుగెత్తింది. నాగరాజు ఇదే అదను అనుకొని లేచిపరుగెత్తాడు.

నాగమ్మ నీళ్ళతో వచ్చి, కన్నీళ్ళతో మిగిలిపోయింది.

చంద్రమోహన్(నాగరాజు), పద్మ(నాగమ్మ) పాల్గొన్న వి. ఆర్. ఇంటర్నేషనల్ "నాగమల్లి" చిత్రంలో మల్లిక, దీప, రాజేశ్వరి, జయమాలిని, వంకాయల, రాళ్ళపల్లి, సాక్షి, రంజిత్, పి. యల్. నారాయణ ప్రధాన తారాగణం. జంధ్యాల, రాజన్–నాగేంద్ర, వేటూరి, ఆర్. ఎం. భల్లా, తార వగైరా సాంకేతికబలంతో దేవదాసు కనకాల దర్శకత్వంలో డి. భాస్కరవర్మ నిర్మాత.



పెళ్ళిగోల

పై పేరున కట్టా సుబ్బారావు దర్శకత్వంలో జూలై 10న ప్రారంభించిన చిత్రానికి స్వర్ణోత్సవం జరుపుకున్న ఒక హిందీ చిత్రం మాతృక అని రాజలక్ష్మి కంబైన్స్ అధినేత యు. ఎస్. ఆర్. మోహనరావు చెప్పారు. మురళీమోహన్, గాయత్రి నాయకా నాయికలు. నూతన్‌ప్రసాద్, మోహన్‌బాబు, రమణమూర్తి, ముక్కామల, జయమాలిని తక్కిన పాత్రధారులు. తొలి షెడ్యూల్ జూలై 25 వరకు ఉంటుంది. రెండవ షెడ్యూల్ ఆగస్టు 11 నుండి 20 వరకు ఉంటుంది. కాశీ విశ్వనాథ్ మాటలు, వేటూరి పాటలు రాస్తున్నారు. సత్యం సంగీత దర్శకుడు. జి. మోహనకృష్ణ ఛాయాగ్రాహకుడు. వీరప్ప సంకలనకర్త.



'లక్ష్మి'లో విజయవాణి, భరత్‌కుమార్

కస్టమ్స్ సుంకంపట్ల పరిశ్రమ ఆందోళన

కొత్త బడ్జెట్‌లో విదేశాలనుంచి దిగుమతి చేసుకునే పోజిటివ్ ఫిలిమ్‌మీద కస్టమ్స్ సుంకాన్ని మీటర్‌కు యాభై పైసల నుంచి 1 రూపాయికి రెట్టింపు చేయడంవల్ల రీలు ఒక్కింటికి రూ. 150 నుంచి రూ. 260 వరకు పెరుగుతుందని చిత్ర పరిశ్రమ ఆందోళన చెందుతోంది. ఈ ప్రతిపాదనను పునఃపరిశీలించి, పెరుగుదలను ఆపుచేస్తూ, చిత్ర నిర్మాతలకు తోడ్పడవలసిందిగా కేంద్ర ఆర్థిక మంత్రికి భారత ఫిలిమ్ ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీ డి. వి. ఎస్. రాజు విజ్ఞప్తి చేశారు.

సి ని మా

"జీన్స్ తొడిగిన హీరోయిన్ భ్రాంతితో
రయమున ఓ గోడ పైకెక్కింది.
వెంటనే కళ్ళుతిరిగి, కింద రాయిపై పడి,
వెక్కి వెక్కి ఘోరున విలపించింది."

అని ఓ రచయిత స్క్రిప్ట్ ప్రారంభించాడు. అంతే... ఆ తర్వాత కలం ముందుకు సాగలేదు... ఆలోచనలో పడిపోయాడు. ఆ రచయిత తెలివైనవాడే; ఇదివరకు కొన్ని చిత్రాల్లో సంభాషణలు ఎంత చాకచక్యంతో రాశాడంటే-

[భర్తల వృత్తిరీత్యా భార్యల ధోరణి]

పూజారి తన కొడుకును నోటికొచ్చినట్లా తిడుతూంటే, అతని భార్య "చాలించండి మీ దండకం!" అంటుంది.

లెక్చరర్ వాదిస్తూంటే, ఆయన భార్య "ఇక మీ లెక్చర్ కట్టిపెట్టండి," అంటుంది.

ఒక ప్లీడరు కోప్పడితే, ఆయన భార్య "మీరన్నదానిలో పాయింటే లేదు," అంటుంది.

గాయకుడు ఏదో సొద చెప్పబోతే, ఆయన భార్య "మళ్ళీ మీ పల్లవి ప్రారంభించారా ?" అంటుంది.

గడియారాల కొట్టతని భార్య "మీ అమ్మ మీకు బాగా కీ ఇచ్చినట్లుంది. అందుకే నామీదపడి

కలల కర్మాగారం !

ఏడుస్తున్నారు," అంటుంది.

హరిదాసు భార్య "అబ్బా! ఆపండి మీ హరికథ" అంటుంది.

ఇలా రాయగల ఆ రచయిత ఆ స్క్రిప్ట్ ప్రారంభంలో రాసిన రెండు వాక్యాలనూ చదివిన నిర్మాత "బాగా ఉంది. మరింత రసవత్తరంగా ప్రారంభిస్తే ఇంకా బాగుంటుందేమో!" అని కాస్సేపు ఆలోచించి, "అన్నట్టు మీకు మందు అలవాటుందా ?" అని అడిగాడు.

"లేదు," అన్నాడు రచయిత.

"ఒక్క చుక్క మందు వేస్తే, మీ కలం ఇంకా బాగా సాగుతుందనుకుంటా... ఓ గుక్కెడు బ్రాందీ సేవిస్తానంటే – తెప్పిస్తాను."

"అది వేడి చేస్తుందటగా ?"

"పోనీ, బీరు... ?"

"అది రొంప పట్టిస్తుందని విన్నాను."

"ఐతే, కాక్‌టైల్ తెప్పించనా ?"

"అంటే ?"

"జిన్, బ్రాంది, రమ్ము, ఓడ్కా, విస్కీ – అన్నీ సమపాళ్ళలో కలిపి సేవిస్తే, రామబాణంలా పనిచేస్తుంది."

"మరి, కల్లు... సారాయి ?"

"అవికూడా కలిపించమంటారా ? భలే... ఐతే, కాస్సేపాగండి – తర్వాత రాద్దురుగాని," అంటూ ఆ నిర్మాత అవన్నీ మిశ్రమంచేసి తెప్పించాడు.

అంతవరకు మద్యం అలవాటులేని ఆ రచయిత ఆ కాక్‌టైల్ ఒక్క పెగ్గు పుచ్చుకున్న కాస్సేపటికే "ఆహా !... ఇక షడ్రసభరితంగా కాదు – కాదు... నవరసోపేతంగా రాయగలను," అంటూ కాగితం, కలం అందుకొని, మొదట రాసిన రెండు వాక్యాలనూ కొట్టేశాడు.

"ఇంకో పెగ్ సేవించి ప్రారంభించండి," అన్నాడు నిర్మాత.

రెండో పెగ్‌కే తూలడం మొదలెట్టిన రచయిత – ఆ కొట్టేసిన రెండు వాక్యాల కింద ఇలా రాశాడు —


"జిన్ తొడిగిన హీరాయిన్ బ్రాందితో
రమ్మున ఓడ్కా గోడ కైపెక్కింది.
వెంటనే కల్లు తిరిగి కింద సారాయిపై పడి,
విస్కి విస్కి బీరున విలపించింది."

"కాక్‌టైల్" మహత్యం ! ★



మనవడి కోసం

విన్నకోట సునీలాదేవి



సుందరి చెయ్యి పట్టుకుని పరీక్షగా కిందికీ, పైకీ చూసి వదిలాడు స్వామీజీ !

"బాబూ ! సంతానయోగం వుందా ?" ఆత్రంగా అడిగింది కామాక్షమ్మ !

నుదుటిమీద వున్న నామాన్ని వేళ్లతో రాసుకుంటూ ఆలోచనల్లో పడ్డాడు స్వామీజీ !

"ఏం చెప్తాడో ?" అనుకుంటూ అతని ముఖంలోకి చూస్తున్నారు కామాక్షమ్మ, ఆమె కోడలు సుందరి, పక్కింటి సీత !

"అమ్మాయి చేతిలో సంతానరేఖ చాలా అడ్డదిడ్డంగా వుంది ! శాంతి చేస్తేగానీ సంతానం కలగదు !" అన్నాడు.

సంతానం అసలు కలగదని చెప్తాడేమోనని హడిలిపోతున్న కామాక్షమ్మకి ఆ మాట కాస్త శాంతి నిచ్చింది.

"శాంతి అంటే ఏం చెయ్యాలి ? బాబూ !" అనడిగింది కామాక్షమ్మ.

"దంపతులు తీర్థయాత్రలు చెయ్యాలి నేనొక పూజ చెప్తాను, తిరిగొచ్చాక దాన్ని చెయ్యాలి !"

"బాబూ ! ఇవన్నీ చేస్తే పిల్లలు పుడ్తారంటారా ?" సందేహంగా అడిగింది కామాక్షమ్మ.

ఆ మాటకి స్వామీజీ కళ్లెర్ర చేసి – "నా మాట మీద నమ్మకం లేదా ?" అన్నాడు.

అది చూసి కామాక్షమ్మ కంగారుపడుతూ చెంపలు వాయించుకుంది.

"అయ్యో ! అదేం కాదండీ ! ఊరికే అడిగాను. మీరెంత గొప్పవారో నాకు తెలీదా !" అంటూ ఆయన్ని పొగిడి, పదిరూపాయలు ఆయన చేతిలో పెట్టింది.

ఆయన చేయవలసిన పూజా కార్యక్రమాన్ని వివరించాడు.

"ఇవన్నీ చెయ్యండి ! సంతానం కలగకపోతే అప్పుడడగండి !" అని, సుందరిని దీవించి వెళ్లాడు.

"ఇలా ఎంతమంది చెప్పలేదు? వాళ్లు చెప్పినవన్నీ చేశాం ! అయినా ఏం జరిగింది ? నాకిటువంటి పూజల్లోనూ, వ్రతాల్లోనూ నమ్మకం పోతోందత్తయ్యా !" కుర్చీలో చారగిలబడి అంది సుందరి.

"అయ్యో ! అలా అనకే అపచారం. ఈయన పెద్ద స్వామీజీ! హిమాలయాల్లో తపస్సు చేశాట్ట! ఈయన ఎలా చెప్తే అలా జరుగుతోందట ! ఎన్నో దాఖలాలు కూడా వున్నాయి."

"ఏమో బాబూ ! ఇదంతా అనవసర ఖర్చు అనిపిస్తోంది."

"చాల్లే వూరుకో ! ఇదేం పెద్ద ఖర్చు ! రేపు మనవడు పుడ్తే అంతా ఆదానే !" అంది ఆవిడ.

"నువ్వేమంటావు సీతా !" అంది సుందరి సీతవేపు చూస్తూ.

అప్పటివరకూ వారిద్దరి మాటలు వింటు కూర్చున్న సీత సుందరి మాటకి,

"అత్తయ్యగారు చెప్పినట్లు చెయ్యవే ! ఏ పుట్టలో ఏ పాముందో ఎవరు చెప్పగలరు ?" అంది సీత.

ఆ మాటకి కామాక్షమ్మ సంతోషపడ్తూ – "అలా చెప్పవే సీతా !" అని,

"అప్పుడే మూడు దాటిందే సుందరీ ! నాకిన్ని కాఫీనీళ్లు పోస్తివా సిద్ధాంతిగారి దగ్గరకు వెళ్లి ప్రయాణానికి ముహూర్తం పెట్టించుకొస్తా" అంది.

సీత లేచి "నేనూ వెళ్తాను సుందరీ ! చిన్నాడు లేచాడేమో !" అని వెళ్లిపోయింది !

తనని తీర్థయాత్రలకు పంపేవరకూ అత్తగారికి నిద్రపట్టదు ! అనుకుంటూ లేచి వంటింట్లోకి వెళ్లింది సుందరి !

సాయంత్రం ఆరయింది !

వెంకట్రావు ఆఫీసునుంచి వచ్చి, బట్టలు మార్చుకుని పేపరు పుచ్చుకుని కుర్చీలో కూర్చున్నాడు.

అప్పటివరకూ కోడలు దగ్గిర కూర్చుని తను విన్న పుణ్యక్షేత్రాల్ని గూర్చి వర్ణించి చెప్తున్న

కామాక్షమ్మ కొడుకుని చూసి, తనే కాఫీగ్లాసు పుచ్చుకుని అతని దగ్గరికెళ్లింది!

కొడుక్కి గ్లాసు ఇచ్చి అతని ప్రక్కనే కూర్చుని మధ్యాహ్నం జరిగినదంతా వివరించి చెప్పింది.

"నేను సిద్ధాంతిగారిని అడిగానురా అబ్బాయి! వచ్చే శుక్రవారం ప్రయాణానికి చాలా బాగుంటుం దన్నాడు. శుక్రవారం అంటే సరిగ్గా రేపటికి వారమన్నమాట! ఈలోపు డబ్బు సిద్ధం చెయ్యి" అంది.

అసలే ఆఫీసులో పనిలో అలిసివచ్చిన వెంకట్రావుకి తల్లి ధోరణి విసుగు కలిగించింది

'ఈవిడ కింకేం పనిలేదు! ఎప్పుడూ వ్రతాలూ, శాంతులూ అని, నన్ను చంపేస్తోంది!' మనసులో విసుక్కున్నాడు.

కాని తల్లిమీద వుండే గౌరవంకొద్దీ పైకి ఏమీ అన్లేకపోయాడు.

ఆవిడ మనవడి కోసం పడే తాపత్రయం చూస్తుంటే ఒక్కొక్కప్పుడు జాలేస్తుంది! తనకీ పిల్లలంటే ఇష్టమే!

కాని దేనికైనా అదృష్టం వుండాలిగదా! వ్రతాలూ, పూజలూ చేస్తే పుడతారా! కాని తల్లి కదో పిచ్చి!

ప్రతి నెలలోనూ ఇటువంటి పూజా కార్యక్రమాలు కనీసం రెండైనా వుంటాయి. తన జీతంలో సగభాగం వీటికే ఖర్చవుతోంది! వెనకాల కొద్దిగ ఆస్థి వుండబట్టి, అప్పులు మాత్రం లేవు.

కాని ఇప్పుడు నెలాఖరు రోజులు!

ఈ పుణ్యతీర్థాలు సేవించుటకు ఎంత డబ్బవుతుందో? ఏమో!

"ఏమిట్రా? ఆలోచన?"

"మొన్ననేగా రెండొందలుపెట్టి అదేదో వ్రతం చేశావు! ఇప్పుడు మళ్లీ అంటే..." నసుగుతూ అన్నాడు.

"అదేమిట్రా! అలా అంటే ఎలా? ఏది చేసినా పిల్లలకోసమేగా! నువ్వొక్కడో అక్కడ మూడాలి!" అంది కామాక్షమ్మ ఇక తప్పదన్నట్లు.

"ఎంతవుతుందో?"

"నేను వాకబు చేశాన్రా! ఒక వెయ్యి చాలుతుందిలే!" ఎంతో తేలిగ్గా అంది.

"వెయ్యి రూపాయలే!" గుడ్లు తేలవేశాడు వెంకట్రావు.

ఆవిడ అదేం పట్టించుకోకుండా — 'ఒరేయ్! నీ వేషాలు చాలుగానీ, వచ్చే శుక్రవారం మీరిద్దరూ బయలుదేరి వెళ్ళాలందే! ఈలోపు డబ్బు ఎక్కడ తెస్తావో, ఎలా తెస్తావో, నాకు తెలీదు!" ఖచ్చితంగా అని, అక్కడినుంచి లేచి లోపలకెళ్లింది కామాక్షమ్మ.

వెంకట్రావు నీర్సంగా వెనక్కు వాలాడు!

నెలాఖరు రోజుల్లో డబ్బు అప్పు ఎవ్వడూ ఇవ్వడు.

అమ్మ మాటకు తిరుగులేదు. తాము తీర్థయాత్రలకు ఎలా...?

ఆలోచించి, ఆలోచించి చివరికి ఆఫీసులో లోను తీసుకోవడానికి నిశ్చయించుకున్నాడు.

రోజులు గడుస్తున్నాయి!

కామాక్షమ్మ తీర్థయాత్రలకు కావల్సిన ఏర్పాట్లన్నీ దగ్గిరుండి చూస్తోంది!

సుందరి ప్రయాణం గూర్చి ఆ వీధిలో అందరికీ తెలిసిపోయింది!

రోజూ వచ్చి తమకు తెలిసిన పుణ్యక్షేత్రాలను గూర్చి అత్తాకోడళ్లకు చెప్పడం మొదలెట్టారు.

ప్రయాణం 'రేపు'లోకి వచ్చింది.

ఆ మధ్యాహ్నం భోజనాలయ్యాక సుందరి సీత దగ్గరికి వెళ్లింది.

సుందరి వెళ్లేసరికి సీత దిగాలుగా కూర్చుని వుంది. సీత కొడుకు నాలుగేళ్ల రాముం మంచం మీద పడుకుని వున్నాడు.

సుందరిని చూసి,

"రా! సుందరీ!" అంది సీత మెల్లగా.

"రామూ అలా పడుకున్నాడే సీతా! ఏమయింది?" సుందరి ఆత్రంగా అడిగింది

"ఏం చెప్పను సుందరీ! వారం రోజులనుంచీ రామూ కడుపునొప్పి అంటుంటే, అజీర్తి అనుకుని ఏదో నాటువైద్యం చేశాను. కానీ తగ్గలేదు! నిన్న డాక్టరు దగ్గిరికి తీసికెడితే పరీక్షచేసి కడుపులో ఏదో కంతిలా లేచిందని త్వరగా ఆపరేషను చెయ్యకపోతే కుర్రాడు దక్కడని చెప్పాడు. ఆపరేషన్‌కి ఎంతలేదన్నా అయిదొందలన్నా కావాలి! మా స్థితి నీకు తెలుసుకదే! అంత డబ్బు ఎక్కడి నుంచి తెస్తాం! అక్కడికీ ఆయన ఏదో తంటాలు పడుతూనేవున్నారు. ఆపైన మా అదృష్టం ఎలా వుంటే అలా జరుగుతుంది!" సీత చెంపలు నీటితో తడిసిపోయాయి.

సుందరికి దుఃఖం వచ్చింది.

నిన్నల్లా రామూ కన్పించని కారణం ఇదన్నమాట! అంటూ రాము వేపు చూసింది.

ఎప్పుడూ వుషారుగా గంతులు వేస్తూ తిరిగే రామూ అలా పడుకుని వుంటే కడుపులో దేవినట్లయింది.

రామూ అంటే సుందరికి చాలా ఇష్టం! రామూ పుట్టింది సీతకే అయినా చిన్నప్పట్నించీ ఎక్కువ సమయం సుందరి దగ్గిరే వుండేవాడు.

వాడికి సుందరే నీళ్లు పోసేది, అన్నం పెట్టేది! రాత్రిళ్లు కూడా తన దగ్గిరే పడుకో బెట్టుకునేది. అప్పుడప్పుడు ఎవ్వరూ వినకుండా వాడిచేత'అమ్మా'అని పిలిపించుకుని సంతోషిస్తూ వుండేది.

ఒక విధంగా చెప్పాలంటే సుందరికి పిల్లలు లేనిలోటు తీర్చి ఆమెని ఆనందపెట్టేది రామూనే!

అటువంటి రామూకి ఇంత భయంకరమైన వ్యాధా! వెంటనే ఆపరేషన్ చెయ్యకపోతే ప్రమాదంట!

అంటే రామూ చనిపోతాడా!

సుందరి గుండె దడదడ లాడింది.

ఇక అక్కడ వుండలేక ఇంటికొచ్చేసింది. మాటి మాటికీ రామూనే కళ్లల్లో మెదుల్తున్నాడు. రామూ చావకూడదు! ఎలాగైనా వాడిని రక్షించాలి.

కాని ఎలా?

ఆలోచించి చివరికి ఒక నిర్ణయానికి వచ్చింది! గబగబా లేచి సీత దగ్గిరికి వెళ్లింది.

సుందరి చేతిలోని డబ్బు చూసి తెల్లబోతూ,

"ఏంటిది!" అంది సీత.

"డబ్బు! వెయ్యి రూపాయలు!! తీసుకో!"

సీతకి నోటమాట రాలేదు.

"తీసుకో!" అంటూ సుందరి వాటిని సీత చేతిలో పెట్టింది.

"మరి మీ ప్రయాణం!" అంది సీత ఎలాగో నోరు పెగల్చుకుని.

"మేము వెళ్లటం లేదు!" తాపీగా అంది సుందరి.

"కాని ..."

"సీతా! అనవసర ప్రశ్నలతో కాలయాపన

'శ్రీ లక్ష్మినిలయం'లో టి. రాజేశ్వరి, గోకిన రామారావు



చమురు కొరతను కాదనే ఎలక్ట్రిక్ మోటారుకారు

గల్ఫ్, వెస్టన్ ఇండస్ట్రీస్ అనే ఒక అమెరికన్ పారిశ్రామిక సంస్థ ఒక ఎలక్ట్రిక్ బ్యాటరీని తయారుచేసింది. దీనితో గంటకు 55 మైళ్ల వేగంతో 150 మైళ్లు ఒక కారు నడిపారు. దీనికోసం బ్యాటరీని ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు చార్జి చేయవలసి వచ్చింది.

జింక్ – క్లోరైడ్‌తో ఈ బ్యాటరీ నిర్మాణం జరిగింది. వీటి నిర్మాణం పక్కాగా పూర్తయినప్పుడు 2000వ సంవత్సరం లోగా అమెరికా 10 లక్షల పీపాల చమురు పొదుపు చేసుకోగలదని భావిస్తున్నారు.

ఈ కొత్త ఎలక్ట్రిక్ బ్యాటరీని జపాన్‌లో తయారైన ఒక వ్యానుకీ, వోల్క్స్‌వాజన్ రాబిట్ అనే ఒక వాహనానికీ అమర్చి పరీక్షించారు. అయితే, మామూలు కారుకు అమర్చినట్లయితే, ఇది ఇంకా బాగా పని చేయగలదట. ఈ బ్యాటరీ తయారీకి 1 కోటి 60 లక్షల డాలర్లు ఖర్చయింది.

ఈ బ్యాటరీని చార్జి చేయటానికయ్యే ఇంధన వ్యయం ఆయా రాష్ట్రాలలో కరెంటు చార్జిలనుబట్టి ఉంటుంది. అమెరికాలో కరెంటు చార్జీ సగటున కిలోవాట్‌కి 5 సెంట్లు ఉంటుంది. వోల్క్స్‌వాజన్ రాబిట్ అనే వాహనంలో నలుగురు చొప్పున – కిలోవాట్‌కి 5 సెంట్లు లెక్కన 240 కిలోమీటర్లు ప్రయాణం చేసినట్లయితే పెట్రోలు ధరకు సమానంగా ఖర్చు అవుతుంది. (ప్రస్తుతం అమెరికాలో పెట్రోలు ధర గ్యాలన్ 1.25 డాలరు చొప్పున ఉన్నది.)

ఈ బ్యాటరీ నిర్మాణం ఈ శతాబ్దిలో ఒక ముఖ్యమైన పరిణామం అనాలి.

మనవడికోసం

చెయ్యకు ! రామూకి ఏదన్నా అయితే ఆ తర్వాత ఎన్ననుకున్నా లాభం లేదు !''

ఆ మాటతో సీత కాస్త జంకింది.

''సుందరీ ! మీ అత్తగారికి చెప్పావా ?''

''లేదు ! అవన్నీ నేను చూసుకుంటాను. ముందు రామూకి ఆపరేషన్ చేయించు !''

మరో మాటకు ఆస్కారం ఇవ్వకుండా వెళ్లిపోయింది సుందరి.

మర్నాడు పొద్దున వెంకట్రావు పేపరు చదువుకుంటుంటే అతని దగ్గిరికెళ్లి –

''ఏవండీ ! ఇవ్వాళ మన ప్రయాణంలేదు!'' అంది సుందరి.

వెంకట్రావు హాయిగా వూపిరి పీల్చాడు.

''ఉఁ ... సరే!'' అన్నాడు పేపరు లోంచి తలెత్తకుండానే.

''మరీ మీరిచ్చిన వెయ్యి రూపాయలు సీతకిచ్చాను !'' అంటూ జరిగిన విషయం చెప్పింది.

''సరే ... సరే !'' అన్నాడు వెంకట్రావు.

ఇంటి విషయాల్లో జోక్యం చేసుకోవటం అతనికి మొదటి నుంచీ అలవాటులేదు.

తల్లి, భార్య చెప్పిన మాటలకల్లా తలూపుతుంటాడు.

సుందరి చెప్పిన విషయాన్నిగూర్చి పెద్దగా పట్టించుకోలేదు. 'సరే' అని వూరుకున్నాడు.

కాని వంటింట్లో కూర్చుని కూరలు తరుగుతున్న కామాక్షమ్మ ఆ మాటలు విని చరచరా కోడలు దగ్గిరికొచ్చింది.

''ఏవిటీ ! వెయ్యి రూపాయలు దానికిచ్చావా ! నాకు చెప్పకుండానే ! ఎంత ధైర్యమే నీకు ! ఇవ్వాళ ప్రయాణం ఎలాగనుకున్నావు ?''

''అదికాదత్తయ్యా !'' అంటూ రామూ పరిస్థితి చెప్పబోయింది... కాని ఆవిడ విన్పించుకోలేదు.

ఈ రగడ చూసి వెంకట్రావు ఆశ్చర్యపోయాడు. ఇప్పటివరకూ ఈ విషయం తల్లికి కూడా తెలుసనుకున్నాడు. కాని తల్లికి చెప్పకుండా సుందరి ఇచ్చిందని తెలిసేసరికి ఇక అక్కడ వుండలేకపోయాడు.

ఇటు భార్య, అటు తల్లి ఎవరికి చెప్పగలడు ! అందుకే అక్కడినుంచి లేచి నెమ్మదిగా లోపలికి జారుకున్నాడు.

కామాక్షమ్మ సుందరిని ఇంకా తిట్టిపోస్తూనే వుంది.

''ఏదో వందా, యాభై ఇచ్చుకుంటారుగానీ, వెయ్యి రూపాయలు తీసికెళ్లి దాని చేతిలో పోస్తావా ! అందునా ఇవ్వాళ ప్రయాణం పెట్టుకుని ! బుద్ధుల్నిబట్టే రాతలుంటాయిట ! ఇటువంటి దరిద్రపు బుద్ధులుండబట్టే మా ఖర్మ ఇలా కాలింది !''

అత్తగారి తిట్లు ఒకవైపు దుఃఖాన్ని, ఒకవైపు కోపాన్ని కలిగిస్తున్నా అన్నీ భరించి తన పని తను చేసుకోసాగింది సుందరి.

పది రోజులు గడిచాయి !

ఒక మనిషిని మాటలతో ఎంత చిత్రహింస పెట్టవచ్చో ఈ పదిరోజుల్లో అనుభవపూర్వకంగా తెలుసుకుంది సుందరి.

రోజూ ఇంటికి ఎవరో ఒకరు వచ్చేవారు !

వాళ్ల దగ్గిర కామాక్షమ్మ సుందరిని తిట్టిపోసేది, వాళ్లు కామాక్షమ్మని ఓదార్చేవారు! రోజూ ఇదో ఫార్సు అయిపోయింది !

''దానికసలు పిల్లలంటేనే ఇష్టంలేదొదినా! ఎవరన్నా వుంటారా ఇలా ? మా కర్మకొద్దీ మాకు దాపురించింది ! ఏ జన్మలో చేసుకున్న పాపమో కానీ, మనవడిని ఎత్తుకునే అదృష్టం లేదు నాకు'' కామాక్షమ్మ కళ్లొత్తుకుంటూ అనేది.

అవతలి వాళ్లు – ''నువ్వు కాబట్టి ఇన్ని కష్టాల్ని భరిస్తున్నావు ! ఇదే ఇంకో అత్తయితే ఈపాటికి కోడల్ని తరిమేసి కొడుక్కి మళ్లీపెళ్లి చేసేది. ఏం చేస్తాం ! నువ్వు మంచి దానివి కాబట్టి సరిపోయింది. ఊరుకో !'' అంటూ ఓదార్చేవారు.

ఈ మాటలు విని, విని సుందరి మనస్సు తూట్లు పడింది.

రామూ ఆరోగ్యంగా తిరిగొచ్చాడు. అదే సుందరికి కాస్త శాంతినిచ్చింది. వాడితో కాస్సేపు కబుర్లు చెప్పి ఆనందపడదామన్నా కామాక్షమ్మ రామూని గుమ్మం ఎక్కనివ్వటం లేదు.

ఇంట్లో నరకం రోజురోజుకీ ఎక్కువవుతోంది.

సుందరి భరించలేకుండా వుంది.

రోజూ ఇరుగు పొరుగు వాళ్ల మాటలు, అత్తగారి సాధింపులు వింటూ కాస్త, కాస్త చచ్చేకన్నా ఒకేసారి చస్తే తనకీ హాయి ! వాళ్లకీ తన అడ్డు తొలగిపోతుంది.

ఒకరోజు బజారుకెళ్లి నిద్రమాత్రలు తెచ్చుకుని వేసుకుంది.

''వచ్చే జన్మంటూ వుంటే ఆడదానిగా మాత్రం పుట్టించకు భగవంతుడా !'' అని దేవుడిని ప్రార్థిస్తూ కళ్ళు మూసుకుంది.

మళ్లీ సుందరి కళ్ళు తెరిచేసరికి ఎదురుగా అత్తగారు కన్పించింది ! ఆవిడని చూసి సుందరి ఆశ్చర్యపోయింది !

''ఇదేమిటి ? తను చావలేదా ! తనకాదృష్టం కూడా లేదా !'' అనుకుని నీర్సంగా కళ్ళు మూసుకోబోతున్న సుందరిని చూసి —

''ఎంత అఘాయిత్యం చేశావే తల్లీ ! ఇంకో రెండు మాత్రలు ఎక్కువ మింగివుంటే ఏమయ్యేది ? పెద్దదాన్ని ఏదో నా బాధకొద్దీ అన్నానే అనుకో ! అంతలోనే ఇలా చెయ్యాలా ! నువ్వు మళ్లీ కళ్ళు తెరిచేవరకూ నా మనసు మనసులో లేదనుకో ! ఆ ఏడుకొండలవాడి దయవల్ల ఆపద గట్టెక్కింది ! నా మాటలేవీ మనసులో పెట్టుకోకే సుందరీ !'' అంటూ సుందరి చెయ్యి పుచ్చుకుంది కామాక్షమ్మ.

సుందరి అత్తగారివేపు అయోమయంగా చూసింది.

''సుందరీ ఇంకో శుభవార్త విన్నావా ! డాక్టరమ్మ చెప్పింది, నీకు మూడో నెలట !'' అంది సంబరపడుతూ.

సుందరికిది కలో, నిజమో తెలియనంత ఆశ్చర్యం కలిగింది !

(గత సంచిక తరువాయి)



[ఇంకా ఉంది]

పాడవేల రేడికా!

భండి నాగరాజు



ట్రంకు రోడ్డో రాజారాం కనిపించాడు. టీ హోటల్లోకి వెళుతున్న రాజారాంని సుబ్బారావు చూస్తూ పూరుకుండి పొయ్యాడు. రాజారాం యీ రోజు చాలా హుషారుగా కనబడుతున్నాడు. సుబ్బారావు కళ్ళెతి. సుబ్బారావులో యీ మధ్య ఒకరకమైన నిరుత్సాహం నిలువెల్లా చోటు చేసుకుంది. అందుక్కారణం లేకపోలేదు.

రాజారాం, సుబ్బారావు ఎస్.ఎస్.ఎల్.సి. వరకు క్లాస్‌మేట్స్. రాజారాం కలెక్టరేట్‌లో గుమాస్తా అయి పద్దుకుంటున్నాడు. అతనికి ఇతర వ్యాసంగాలు ఏమీ లేవు, అప్పుడప్పుడూ సుబ్బారావుతో పిచ్చాపాటీ తప్ప. సుబ్బారావు మునిసిపల్ హైస్కూల్లో సెకండరీ గ్రేడ్ టీచరుగా కుదిరిపొయ్యాడు. సుబ్బారావుకు కథలు రాసే జబ్బు, కవిత చెప్పే కామాటకం కాల క్రమంలో ముదిరి తీవరించింది. సుబ్బారావు చాలా కథలు రాశాడు. అన్ని పత్రికలకీ పంపించాడు. కవిత లల్లాడు. జాబుల్లో, శుభాకాంక్షల్లో కవిత్వపు పంక్తులు పొక్కు పరిచేవాడు. పత్రికలకి విమర్శనాత్మక లేఖలు రాశాడు. కొన్ని సుదీర్ఘ లేఖల్లోని పంక్తులు రెండు మూడు అచ్చయ్యాయి. మిత్రులు తనని విమర్శకుడు కావాలని ఆకాంక్షించి శుభాకాంక్షలు తెలిపి టీలతో, సిగరెట్లతో, ముసి ముసి నవ్వులతో కొంచెం పైకే ఎత్తారు.

సుబ్బారావు తాను కథకుడుగా, కవిగా స్థిరపడాలని కోరిక. యుద్ధ ప్రాతిపదికన్మై రచనలు సృష్టించడం మొదలు పెట్టాడు. పత్రికలు, రేడియోవాళ్ళు చాలా సున్నితంగా సుబ్బారావుకు వేదాంత ధోరణి అబ్బేటట్లు చేశారు.

ఒకసారి సుబ్బారావు కథ కొత్తగా వస్తున్న ఓ మాస పత్రికలో పడింది. సుబ్బారావు ఆనందానికి హద్దు లేకుండా పోయింది. తన కథలు నచ్చి స్వీకరించే వాళ్ళు కూడా ఉన్నారని సుబ్బారావు ధైర్యం తెచ్చుకున్నాడు. తన వేదాంత ధోరణిని కొంచెం తగ్గించుకున్నాడు. భౌతిక శక్తి యుక్తుల పైన తన బుద్ధి నైశిత్యాన్ని కేంద్రీకరించాడు. కథ ప్రచురించబడ్డ రోజున మిత్రుల్నంతా సమావేశ పరిచాడు. చిన్న టీ పార్టీ యిచ్చాడు. రాజారాం సమావేశానికి పెద్దరికం వహించాడు. తన కథలోని మంచి చెడ్డల్ని నిష్పక్షంగా విమర్శించవల్సిందని సుబ్బారావు మిత్రుల్ని అభ్యర్థించాడు. తన అభిప్రాయాల్ని లేఖల రూపంలో సదరు పత్రికవారికి తెల్పవలసిందని కోరాడు. ఎన్నో అవాంతరాలు యీనాటి తన విజయానికి సోపానాలని అభివర్ణించుకున్నాడు.

సుబ్బారావు పాత కథల్ని మళ్ళీ పైకి తీశాడు. మిత్రులకి వినిపించాడు సూచనలివ్వవలసిందని కోరాడు. కథ యెట్లావుందని అడిగాడు. 'బాగున్నది' అనడం కంటె మరేం చెప్పలేని స్థితి కల్పించి మిత్రుల్ని ఇరకట్టుకున్నాడు. సుబ్బారావు మళ్ళీ విజృంభించాడు.

ఒకసారి తన కవిత ఒకటి ఉత్తరాల శీర్షికలో పన్నెండు పంక్తులుగా అచ్చు పడింది. ప్రతి రచయితా, కవీ ఉత్తరాల శీర్షిక మంచే దేశానికి పరిచయమయ్యాడని సుబ్బారావు నమ్మాడు; తన సర్కిల్‌లో నమ్మించాడు కూడా. మొత్తం మీద పత్రికల వాళ్ళని కొంతకు కొంత తన వైపుకు తిప్పుకున్నాడు సుబ్బారావు, తన నమ్మకం ప్రకారం. రేడియో పరిస్థితులు మాత్రం యధాప్రకారంగానే వున్నాయి. అయితే వాళ్ళయినా ఒకనాటికి దిగిరాక తప్పదని సుబ్బారావు ప్రగాఢంగా చిత్తున్నాడు. యథాశక్తి కృషి సాగిస్తూనే వున్నాడు.

సుబ్బారావు కృషిలో పాలు పంచుకొని చేదోడు వాదోడుగా ఉంటున్న మిత్రుడు రాజారాం ఒక్కడే! మొదట్లో భార్య చాలా చేయూత నిచ్చింది. సుబ్బారావు ఆమె వ్యాఖ్యలకి ప్రాముఖ్యం యివ్వడం మానేసి ఫేర్ కాపీకి మాత్రం ఆమెను పురమాయిస్తూ వచ్చాడు. ఆమె చివరకు వ్యాఖ్యలకు బదులు మూతి విరుపులు ప్రారంభించి ఫేర్ కాపీ ఉద్యోగం నుంచి విరమణ పొందింది. మిత్రుల్లో దరిదాపుగా అందరూ టీ, సిగరెట్టు అనంతరం గూడా సుబ్బారావ్ని

కథలకు కాకుండా లోకాభి రామాయణానికి ప్రాముఖ్యమిస్తూ అందరూ అర్థంటు మొహాలు పెట్టి తప్పించుకోవడం మొదలు పెట్టారు. రాజారాం కూడా చివరకు తదితర మిత్రుల పద్ధతి ననుసరించక తప్ప లేదు. తన ప్రాణ మిత్రుడు రాజారాం కూడా చివరకు ఇంతటి అమిత్రవర్యకు దిగుతాడని సుబ్బారావు అనుకోలేదు. రాజారాం ముఖం తప్పించటంతో సుబ్బారావు పరిస్థితి నిరుత్సాహజనకం అయి పోయింది. అందుకే సుబ్బారావుకు ఈరోజు ట్రంకు రోడ్డో రాజారాం కనిపించినా, పిల్చి టీ యిప్పించి సిగరెట్టు కొని పెట్టి కవిత్వం అని అను పొమ్మే దాకా నైనా తన సాహిత్య వ్యవసాయాన్ని గూర్చి దాని ఫలసాయాన్ని గూర్చి ముచ్చటించ లేక పోయ్యాడు. చూస్తూ ఊరకుండి పోయ్యాడు. రాజారాం తనని గమనించినట్లు లేదు. చూచి తప్పించుకొని పోవటం స్పష్టంగాదు ఈ మధ్య తన పాడ వెళ్లబోసుకోవడానికి సుబ్బారావుకు విన్నగా ఆప్తులు లేరు. బలవంతంగా నైనా రాజారాంని వాయించుకుందామనుకున్నాడు. కాని రాజారాం మొహంచూచి సుబ్బారావుకే మనసొప్ప లేదు.

రాజారాం టీ స్టాల్ నుంచి వచ్చేదాకా ఒకపక్క నుంచి చూస్తూ సుబ్బారావు నిల్చున్నాడు. రాజారాం చూచి కూడా చూడనట్టు వెళ్లిపోతే పోనీ, తను పలకరించుకో కూడదు. చూడకుండా వే

పాడవేల రేడికా!

ళుతుంటే పలకరించి ... ద్దామని సుబ్బారావు అనుకున్నాడు. రాజారాం స్టాల్‌లో కుర్చీమీద తనకు ఎదురుగా కని పించేటట్లు కూర్చున్నాడు. సుబ్బారావు గమనించనట్లు గమనిస్తున్నాడు. రాజారాం టీ చప్పరిస్తూ, ఉన్నట్టుండి లేచి తన వైపే వస్తున్నాడు. సుబ్బారావు మరో వైపు చూస్తున్నట్టు నటిస్తూ కొంచెం పక్కకి జరిగాడు. అయినా, రాజారాం తన దగ్గరకే వచ్చేశాడు.

భుజంమీద చెయ్యి వేసి, "ఏరా సుబ్బా, ఈ మధ్య కనిపించడమే మానేశావ్? టీ తీసుకుందాం రా" అంటూ బలవంతాన లాక్కొని వంత పని చేశాడు. సుబ్బారావు బెట్టుపడ దల్చుకోలేదు. మౌనంగా టీ తీసుకుంటున్నాడు రాజారాంతో. "నీ కవితా వ్యాసంగం ఎట్లా వుంది?" మధ్యలో రాజారాం మాటల్లోకి దింపాడు. సుబ్బారావు వేదాంతిలా చిరునవ్వు ప్రకటించాడు. "మొన్నట్నుంచి నిన్ను కల్సుకుందామని చూస్తున్నాను" రాజారాం మాటలు సుబ్బారావుని చకితుణ్ణి చేశాయి. "నా కవిత్వం విందామని నీకేమైనా దుర్బుద్ధి పుట్టిందా?" సుబ్బారావు పెద్ద చురక వేసినట్లు ప్రశ్నించాడు. సుబ్బారావు మనస్తాపం రాజారాంకి తెలియక పోలేదు. కాని తాను చెయ్యగలిగిందేమీ లేదు. "విందా

మని కాదు. మనం మరో విధంగా ప్రయత్నం చెయ్యవచ్చునని మొన్ననే ఒక ఆలోచన వచ్చింది." రాజారాం ప్రియంగా అన్నాడు. సుబ్బారావుకు ఏదో ఒక ఆశ, ఒక హామీ గోచరించింది రాజారాం మాటల్లో. "ఏమిటది?" ఆత్రుతను కొంచెం అణచుకొని సుబ్బారావు అడిగాడు.

"మా కోటేశ్వరరావు విజయవాడ ఏ.ఐ.ఆర్‌లో అనౌన్సర్‌గా కుదిరాడు."


"ఏ కోటేశ్వరరావు?" సుబ్బారావుతో ఆత్రుత అణగడం కొంచెం కష్టమే అయింది.

"మా సద్గుకుడు, మరదలి భర్త; పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసుగా పనిజేస్తుండి యిప్పుడక్కడకి మారాడు. మొన్న విజయవాడ కాపురం మార్చిన ఉద్యో జాబు వచ్చింది. నువ్వు వెంటనే జ్ఞాపకం వచ్చావు."

మనసులో అణుచుకున్న సంతోషం పూర్తిగా పంచలైపోయి గ్రీష్మతాపం తీవ్రమయింది సుబ్బారావుకు. నిభాయించుకో లేక పోయ్యాడు. ఆత్రుత అదుపు తప్పుతున్నది. తన కవిత రేడియో నుంచి యిప్పుడే వినబడుతున్నట్లు సుబ్బారావు శివమెత్తి పోతున్నాడు.

రాజారాం చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు సుబ్బారావు. "రేడియోలో నాకొక అవకాశం యిప్పించి నా జీవితానికి ఒక సార్థకతను కల్పించవలసిన బాధ్యత క్లాస్‌మేట్‌గా నీ మీద వుందని విన్నవించు కొంటున్నాను. నీకంటే నాకు మరి ఆప్తులు లేరు." సుబ్బారావు కోరకని అతను కోరక ముందే తీర్చే ప్రయత్నం చెయ్యాలని రాజారాం నిర్ణయించుకున్నదే. ఆ అభిప్రాయాన్నే రాజారాం ముక్తసరిగా వ్యక్తపరిచాడు సుబ్బారావుకు. సుబ్బారావు ఆపడానికి అవకాశ్కెక పోయ్యాయి. కవితకు అలంబం లేకపోతే శోభించ జాలదన్న సూక్తిని సుబ్బారావు జ్ఞాపకం తెచ్చుకున్నాడు. ఇప్పుడు తన కోరిక తీరడానికి ఒక మార్గం ఏర్పడబోతున్నది.

ఈరోజు సుబ్బారావు టీ డబ్బులు ఇవ్వడానికి విఫల ప్రయత్నం చేశాడు. వక్కపొడి పొట్లాం, సిగరెట్లు రాజారామే కొన్నాడు. మిత్రుల మధ్య ఏర్పడిన ముభావం మూలచ్ఛేదమై పోయింది. సుబ్బారావు



ఆంధ్ర సచిత్ర వారపత్రిక పరిశీలనార్థం పంపే బొమ్మలు, ముఖచిత్ర రచనలు పంపేవారు కూడా వాటితోపాటు తగినన్ని తపాలా బిళ్లలు అంటించిన కవరును జతపరచకపోతే అవి త్రిప్పి పంపబడవు. -సం.

ఇంటికి రావడానికి రాత్రి పదిగంటలయింది. రాజారాంని అంటిపెట్టుకొని తిరిగాడు.

సుబ్బారావు జీవితంలో ఈ రోజు మధ్యాహ్నంనించి అనుకోని ఒక పెద్ద మలుపు తిరిగింది. ఇంక సుబ్బారావు భవిష్యత్తు స్వర్ణమయంగా పరిణమించబోతున్నది. సుబ్బారావుకు నిద్ర పట్టలేదు. పాతట్రంకు తీశాడు. ఒక దశాబ్దానికి పైగా మంచి కథలు, కవితలు రాస్తున్నాడు తాను. తాను అంత సాహిత్యం సృష్టించినందుకు తనకే ఆశ్చర్యంగా ఉంది. నిద్ర రాలేదు. కవితలన్నీ తీశాడు. అన్నీ ఒకసారి చూసుకున్నాడు. బాగాలేవని తాను అనుకోలేకపోయ్యాడు. ఈనాడు వస్తున్న కవితల్లో చాలా వాటి కంటే యివేమీ తీసిపోవు. అయితే ప్రచురించబడుతున్నవన్నీ ఎవరో ఒకరి ములాజాతోనే ప్రచురించబడుతున్నాయా? యోగ్యతను గుర్తించి స్వీకరించే అవకాశాలు లేవా? లేవు అందామంటే అచ్చయిన తన మొదటి కథ సంగతి? తన కవితను ఉత్తరాల శీర్షికలో ఎందుకు వేశారు? సుబ్బారావు నిద్రపోవడం కుదరలేదు. తెల్లవారవస్తున్నది.

సుబ్బారావు ఒక నాలుగు కవితల్ని ఎన్నిక చేశాడు. అవి తనకు బాగా నచ్చాయి. రెండు రకాల పద్య కవితలు, ఒక గేయం, ఒక వచన కవిత తీసుకున్నాడు. శుభ్రంగా ఫేర్ చేశాడు. తెల్లారింది. కాలకృత్యాలు తీర్చుకున్నాడు, టిఫిన్ చేశాడు. రాజారాం యింటికి వచ్చాడు.

రాజారాం కొద్దిగా ఆశ్చర్యపడ్డా, సర్దుకొని సుబ్బారావు ఆతృతని గమనించి ఉత్సాహం ప్రదర్శించాడు. రాజారాం తన భార్యచేత ఆమె చెల్లెలికి విపులంగా, వివరంగా జాబు రాయించాడు. సుబ్బారావు కవితల్ని, జాబుని తన మరదలి పేర కోటేశ్వరరావు అడ్రసుకు రాజారాం పంపించాడు. సుబ్బారావుకు తాను చెయ్యదల్చుకున్న సహాయ కార్యక్రమాన్ని రాజారాం ఏ ఆటంకమూ చెప్పకుండా పూర్తి చేశాడు. ఆ రోజుకి ఆఫీసుకు పోలేక రాజారాం లీవు పెట్టాడు. సుబ్బారావు కూడా పెట్టాడు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు సుబ్బారావు రాజారాం వోపికకు పబ్లిక్ పరీక్ష పెట్టాడు. రాజారాం వల్ల సుబ్బారావుకు గూడు కట్టుకొని వుండిన బాధ చేత్తో తొలగించిన

పాడవేల రేడికా!

ట్టయింది. సుబ్బారావు మనసు తేలిక పడింది. ఉల్లాసంగా ఉంది. "ఎన్ని రోజుల్లో ప్రోగ్రాం కుదరవచ్చు?" సుబ్బారావు ఆతృత ఎంతటిదో అతని స్వరంతో పైకి వచ్చింది. "ఎన్ని రోజుల్లోనంటే చెప్పలేను గాని ప్రోగ్రాం మాత్రం బహుశా కుదరవచ్చు మన ప్రయత్నం డ్రైవింగ్ టేబిల్ మీద నుంచి కాబట్టి." ఇద్దరూ తృప్తిగా నవ్వుకున్నారు

సుబ్బారావు పరిస్థితి నిమ్మళంగా లేదు. రాజారాం దొరికితే చంపేస్తున్నాడు. కోతికి చదువు చెప్పినట్టుంది రాజారాం

కాలచక్రం

తిరిగిరాని "నిన్న"
నేటిని చూపి
అపహాస్యం చేసింది
నీ కంటే నేనెంతో
మెరుగని..
అనేక సమస్యల
సంకెళ్ళలో నిలిచిన
"నేడు"!
నమ్మరాని "రేపు"ను
నమ్ముకుని.
కుమిలిపోతూంది
పాపం!
చెయ్యని నేరానికి
చెరలో చిక్కిన
నిరపరాధిలా!!

— డి. సి. కేశవరావు

మనస్థితి. ఇలా పది రోజులయిపోయింది. నెల పూర్తి కావస్తున్నది. సుబ్బారావు నీరసించి పోతున్నాడు. సుబ్బారావు పెడుతున్న ఊదరకు రాజారాం తట్టుకోలేకపోతున్నాడు. రాజారాం కూడా కోటేశ్వరరావుకు జాబు రాశాడు.

సుబ్బారావుకు నెల రోజులు సంవత్సరమయింది. ఆ రోజు రాజారాం సైకిలేసుకొని సాయంత్రం మూడున్నరకు హైస్కూలుకొచ్చాడు. సుబ్బారావు అనుకోకుండా రాజారాంకు ఎదురొచ్చాడు. "కంగ్రాచ్యులేషన్స్‌రా సుబ్బా" రాజారాం సుబ్బారావు చేతికి కవరిచ్చాడు. ఆలిండియా రేడియో విజయవాడ కేంద్రం నుంచి డిస్పాచ్ అయిన కవరు అది. సందేహంతో కవర్లోని కాగితాలు తీశాడు. తాను పెట్టిన నాలుగు కవితలు చెక్కు చెదరకుండా తిరిగివచ్చాయి. సుబ్బారావు మొహం పీల్చుకుపోయింది. నోట్లో చెమ్మ ఆరిపోయింది. రాజారాం చెప్పిన కంగ్రాచ్యులేషన్సు అవహేళన అని సుబ్బారావు నిశ్చయించుకున్నాడు. దుర్భర అవమానంతో సుబ్బారావు రాజారాం మొహంలోకి చూడలేక కలబడి పోయ్యాడు. "నీ చివరి వచన కవిత - దేశభక్తి అనేది — అంగీకరించార్రా సుబ్బా" అన్న రాజారాం మాటలు సుబ్బారావుకు, ఆకలేసి రోగికి గరళం పోస్తున్నట్టనిపించింది. ఇప్పుడు సుబ్బారావు ఏ. ఐ. ఆర్ వాళ్ళు పంపిన మెమో చూశాడు. దేశభక్తి కవితలో ఒక నాలుగు లైన్లు ఎర్ర సిరాతో నిలువుగా గీతలో గుర్తించబడి వున్నాయి. వాటిని తొలగించి పంపితే ప్రసారానికి అంగీకరిస్తామని మెమో సారాంశం. "ఇదిగో యీ లైన్లు తీసెయ్యమంటున్నార్రా రాజా యిందులో తప్పేమిటి?" సుబ్బారావు ఆశ్చర్యం ప్రకటించాడు.

"వారి సూచన ప్రకారం సరే అనిపించు. ఇట్టా నీ కవిత ప్రసారం కావడమే మనకు ముఖ్యం గదరా?" రాజారాం ప్రోత్సహించాడు

సుబ్బారావు మెమో మేరకు కవిత సరిచేసి పద్ధతి ప్రకారం మళ్ళీ పంపాడు. తర్వాత కొన్నాళ్ళకు సుబ్బారావు అడ్రసుకు కాంట్రాక్టు వచ్చింది. ఏ తేదీన ఏ సమయానికి ప్రసారమయ్యేదీ, రెమ్యూనరేషన్ ఎంత యిస్తున్నది వగైరా వివరాలు అందులో వున్నాయి. ఆదివారం ఉదయం సాహితీ స్రవంతి కార్యక్రమంలో స్వీయ కవిత శీర్షిక క్రింద ప్రసారమవుతుంది. ఐదు నిమిషాల కార్యక్రమం అది. ఇతర కవులతో కలిపి ప్రతిఫలంగా నూట పది రూపాయలు చెక్కు రూపంలో ఇస్తారు. ముందురోజు మధ్యాహ్నం సుబ్బారావు స్టేషనుకు రికార్డు చెయ్యడానికి స్వయంగా వెళ్ళి చదవాలి.

సుబ్బారావు ఉప్పొంగిపోయ్యాడు. తన గొంతు కూడా తాను స్వయంగా వినబోతున్నాడు. రాక రాక ఎంత కాలానికి ఎటు







అధిక దిగుబడి ప్రతి పైరునుండి ప్రతి సారి పొందాలంటె మీ భూమిలో సారం అధికంగా ఉన్నప్పుడు మాత్రమే సాధ్యమవుతుంది.

మీ భూసారం అధిక స్థాయిలో ఉండేందుకు ఈ క్రింది పద్ధతులు అవలంభించండి.

1. సిఫార్సు ప్రకారం నత్రజని, భాస్వరం, పొటాసియంలను విజయ్ ఎరువుల ద్వారా అందివ్వండి.

మోతాదు (ఎకరాకు కిలోలలో)

పైరు	దుక్కిలో విజయ్ 17-17-17	పైరుమీద విజయ్ యూరియా
ప్రత్తి	120	60
మిర్చి	150	75
పసుపు	150	75

2. అధిక దిగుబడులకు విజయ్ ఎరువులను సరిఅయిన సమయానికి సరిఅయిన పద్ధతిలో వేయండి.

3. పసువుల పెంట, చెత్త చెదారాలను భద్రపరచిపొలంలో కలియ దున్నండి.

ఇంకా వివరాలు కావలిస్తే ఈ క్రింది విరునామా నుండి పుస్తకాలు తెప్పించుకొని తెలుసుకొండి.

ఏరియా మేనేజర్
మద్రాస్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్
44, గాంధీనగర్,
హైదరాబాదు-500 028



నాణ్యమైన, నమ్మకమైన విజయ్ ఎరువులను తయారుచేయువారు

మద్రాస్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్

మణలి, మద్రాస్ 600 068

MFL 2268

పాడవేల రేడికా!

వంటి అవకాశం తనకు లభించింది? ఎంతటి శుభ పరిణామం! ఈ జన్మ దాన్ని ఏ విధంగా ధరించడం ఎట్లా? ఉరుకులు పరుగుల మీద పోయి రాజారాంకి చెప్పి వచ్చాడు. రాత్రి అంగళ్ళు మూసే వేళకి ట్రంకు రోడ్డంతా తెలిసిపోయింది. నెల్లూరులో సాహిత్యాభిలాషులకీ, జిల్లాపరిషత్తుకీ, పత్రికల గజ్జెకీ, కలెక్టరేటుకే ఇంకా తెలియవలసిన వాళ్ళకందరికి వర్తమానం అంది పోయింది. సుబ్బారావు స్వీయకవితా ప్రసారం గురించి 'వాణి' పంచికలో తన పేరు వేశారు. సుబ్బారావు తన కొత్త పాత మిత్రులు బంధువులకు. తోటి టీచర్లకు పూర్వ విద్యార్థులకు పెళ్ళి పత్రికలు పెట్టినట్టు కార్డులు రాశాడు. ఇన్ని చేసినా తన ప్రోగ్రాముకి ఇంకా రెండు వారాలు పట్టుతుంది. కాల వేగం మందగిస్తున్నట్టనిపించింది సుబ్బారావుకు. సెలవు రోజులు అసలు గడవటమే లేదు రాజారాం సహాయాన్ని సుబ్బారావు పొగిడి దానికి విడదల్లేదు మిత్రులందరో రాజారాం కొక ప్రత్యేకత యివ్వబడింది. సుబ్బారావుతో చెక్కలేని ఆనందోత్సాహంతో పాటు ఒక బెంగ కూడా పట్టుకుందని చెప్పాలి. సుబ్బారావు రేడియో కార్యక్రమం గురించి దరిదాపు అందరికీ తెలిసిపోయింది.

రేపు శుక్రవారం. రేపు విజయవాడకి సుబ్బారావు ప్రయాణం. రేపు సెలవు పెట్టాడు. సుబ్బారావు రైల్వే టైంటేబిల్ కొన్నాడు. రైళ్ళ టైమ్సు చూసుకున్నాడు. టికెట్ చార్జి వగైరా గుర్తుపెట్టుకున్నాడు. బేస్తవారం తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు ప్రయాణం బెర్త్ రిజర్వేషన్ కుదర్లేదు. అందుకు సుబ్బారావు చాలా విచారించాడు. తనకు సహాయంగా రావలసిందని రాజారాంని కోరాడు. చివరికి రాజారాం కూడా వస్తానన్నాడు ఇద్దరికీ రానుపోను చార్జీలు పెట్టుకోవాలని అనుకున్నాడు. ఒక్కరోజుకి కోటేశ్వరరావు గారింట్లో ఉండవచ్చని ఇద్దరూ తీర్మానించుకున్నారు. కోటేశ్వరరావు తన భార్య కోరిక మేరకు రాజారాంని సుబ్బారావు గారితో పాటు రావలసిందని జాబు రాశాడు. అన్నీ యిట్లా కలిసి వస్తున్నాయి సుబ్బారావుకి అనుకూలంగా.

బేస్తవారం రాత్రి పదకొండు గంటలకు నెల్లూరు నుంచి ట్రయిను బయల్దేరుతుంది. తెల్లవారున అయిదు గంటలకు విజయవాడ చేరుతుంది. సుబ్బారావు రాజారాంతో పాటు పది గంటలకు స్టేషనుకు వచ్చారు. తిరుమల ఎక్స్‌ప్రెస్ ఒక గంట లేటు, జీరో అవర్‌కు వస్తుందని నోటీసు బోర్డుమీద రాసివుంది. రెండు గంటల కాలక్షేపం సుబ్బారావుకు పెద్ద కష్టమనిపించ లేదు గాని రాజారాంక్కు కొంచెం బోరు కొడుతున్నది. సుబ్బారావు మరి కొంచెం కొడుతున్నాడు. పన్నెండింటికి ట్రయిను వచ్చింది. జనం క్రిక్కిరిసి వున్నారు నిల్చుకోను గూడా సందు లేదు. రిజర్వేషను ప్రయత్నం విఫలమయింది. అయిదు నిమిషాలు అయిపోయింది. రైలు కదలబోతున్నది. జనరల్ కంపార్ట్‌మెంటులో తోసుకొని ఇద్దరూ ఎక్కారు. వాడి సూదిమొన మోపినంత సందు గూడా లేదు. ఈ రాత్రి యీ రైల్లో నిద్ర లేకుండా ఒంటికాలి ప్రయాణం ఎట్లారా దేవుడా అనిపిస్తున్నది యిద్దరికీ. రెండు గంటలో ఎవరో దిగారు. సీటు దొరకలేదు

ధర్మపథం — బులుసు వెంకట రమణయ్య

నాలుగు హెచ్చరికలు!

శ్రీమంతుడైన ఒక వర్తకుడు తనకు చావు కుండా చెయ్యాలని కోరుతూ మృత్యుదేవతను పూజిస్తూ ఉండేవాడు. కొన్నాళ్ళకు యముడు ప్రత్యక్షం కాగా, తన కోరిక తెలియజేశాడు. అది సాధ్యంకాదనీ చావు యెప్పుడు వస్తుందో ముందుగా హెచ్చరికను మాత్రం ఇవ్వగలననీ యముడన్నాడు. దానికి వర్తకుడు సమ్మతించాడు. కాని, ఎంతకాలానికి మృత్యువు ఫలానా సమయంలో వస్తుందనే హెచ్చరిక రాలేదు. ఒకనాడు హఠాత్తుగా అతన్ని మింగడానికి మృత్యువు వచ్చింది. యముడు తన్ను మోసగించాడని వర్తకుడు అతడిని నిందించగా, ప్రత్యక్షమైన యముడిలా అన్నాడు — "నాయనా! నిన్ను నేను మోసగించలేదు. నాలుగు సార్లు హెచ్చరిక చేశాను. మొదట నీ తలవెంట్రుకలు పండిపోయేటట్లు చేశాను. నీవు దాన్ని గమనించలేదు. పండు వెంట్రుకలకు నల్లరంగు పూసి యువకుడవుగా నటించావు. ఆ తర్వాత నేను నీ వెంట్రుకలు రాలిపోయేటట్లు చేశాను. నీవు నీ బట్టతలకు టోపీ పెట్టికొని, జుత్తు వున్నట్టు నటించావు. ఈ రెండో హెచ్చరికను కూడా నీవు లక్ష్యం చెయ్యలేదు. తర్వాత నేను నీ పళ్ళు ఊడిపోయేటట్లు చేశాను. శ్రీమంతుడవు కాబట్టి ఎంతో డబ్బు ఖర్చు పెట్టి నీవు కట్టుడు పండ్లు పెట్టుకున్నావు. అంత వరకూ సహించాను. నీకు అవసానదశ ప్రాప్తించింది. నీ శరీరం బాగా ముడతలు పడి, అవయవాలన్నీ బలహీనాలై లేవలేని స్థితిని కలిగించాను. మందుల వల్ల ప్రయోజనం లేకపోయింది. వయస్సు వల్ల కలిగే వార్ధక్యాన్ని మార్పుచెయ్యడం ఎవరికి సాధ్యమవుతుంది? అందువల్లనే నీవు మృత్యువుకు గురికాకతప్పిందికాదు. నేను ఇన్నిసార్లు నీకు అంత్యకాలం వస్తున్నదని సూచించినా గమనించకుంటివి. ఈ విషయంలో నా తప్పు లేదు" అని అతడు అన్నాడు.

మృత్యువు హెచ్చరికను మాటలతో చెయ్యదు. శరీరంలోని పరిణామాలను బట్టి మనమే ఊహించుకోవాలి. ఆ కాలంలో మరణం సంభవిస్తే రోగాల దాడిని సూచిస్తాయి. వయస్సు పరిపక్వాన్ని పొందినట్లయితే అవయవాలు సడలిపోయి వేటి పని అవి చెయ్యడం సాధ్యం కాకుండా ఉంటుంది. దానిని బట్టే అవసాన కాలం సమీపించినట్లు గ్రహించవలసి వుంటుంది.

చరాచరాలన్నిటికీ ఉత్పత్తి ఎలా సహజమో నాశనం కూడా సహజమే. మానవునికి ఈ విషయం కొత్తదేమీకాదు. జీవించి ఉన్నంత వరకూ శ్రమ పడకుండా ఉండడానికి యత్నించడం అతడు చెయ్యవలసిన పని. అదే సమయంలో యథార్థం గుర్తించి పరంకోసం కూడా ప్రయత్నం చెయ్యవలసి ఉంటుంది.

[శ్రీ సత్యసాయిబాబా "చిన్నకథ" లలో ఒక దానిని ఆధారం చేసుకొని]

గాని ఫ్రీగా వినబడే వీలు కలిగినట్లనిపించింది. తెనాలిలో ఒక సీటు ఖాళీ అయింది. రాజారాంని కూర్చోమన్నాడు సుబ్బారావు. అతను అంతకు ముందే తోసుకొని కూచునే వాడు. సుబ్బారావు నిలువు జీతంమీద విజయవాడ దాకా వచ్చాడు. కునుకుతున్న రాజారాంని లేపి సుబ్బారావు రైలు దిగాడు. ఇద్దరూ కరకర పొద్దు పొడుస్తుండగా కోటేశ్వరరావు గారి యిల్లు చేరారు. సుబ్బారావు బిస్కట్ పాకెట్, ఆపిల్ పండ్లు కోటేశ్వరరావుగారి సంతోషార్థం తెచ్చాడు. సుబ్బారావు కళ్ళు పుచ్చ విత్తుల్లా వున్నాయి. కాళ్ళు పీకుతున్నాయి. కోటేశ్వరరావుకు పొద్దుటి డ్యూటీ ఉండటంతో అప్పటికే ఆయన రేడియో స్టేషనుకు వెళ్ళిపోయాడు. మరదలి స్వాగతంతో రాజారాం, సుబ్బారావుతో ఇంట్లో అడుగు పెట్టాడు. లఘువుగా కాలకృత్యాలు తీర్చుకొని యిద్దరు మిత్రులూ కాఫీ సేవించుకున్నారు. సుబ్బారావుకు అంత బడలికలోను నిద్రపట్టలేదు. తల బరువుగా కూడా వున్నది. రాజారాం నిద్రపొయ్యాడు.

గంట పదకొండు కావస్తున్నది. రాజారాం నిద్ర చాలించలేదు. సుబ్బారావుకు నిద్ర పట్టడం లేదు. ఇంతలో కోటేశ్వరరావు గారు డ్యూటీ నుంచి వచ్చారు. సుబ్బారావును చూసి రాజారాం మిత్రుడని గ్రహించి నమస్కరించుకొని కుశల ప్రశ్నలు వేశాడు. సుబ్బారావు చాలా నెమ్మదిగా అనుకూలంగా మాట్లాడాడు. పదకొండు గంటలు కావస్తున్నందువల్ల రేడియో స్టేషనుకు వెళ్ళే విషయమై ప్రస్తావించాడు సుబ్బారావు "తొందరేం లేదు నిదానంగా పోవచ్చు. సాయంత్రంలోగా ఎప్పుడైనా రికార్డు చేస్తారు" అన్నాడు కోటేశ్వరరావు. సుబ్బారావు పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వీలయినంత ముందుగా వెళ్ళాలని సుబ్బారావు ఆలోచిస్తున్నాడు.

రాజారాం నిద్ర లేవలేదు. "పన్నెండు గంటల దాకా రాహుకాలం గదా" కోటేశ్వరరావుగారి భార్య అందుకొన్నది. సుబ్బారావు నీరసించి పొయ్యాడు. తాను ఒక్కడే వచ్చి వుంటే యీ బందిఖానా లేకపోవు ననుకున్నాడు కూడా.

మధ్యాహ్నం పన్నెండయింది. ముగ్గురూ భోంచేశారు. రాజారాంకి కొంచెం అలసట తీరినట్టయింది. కోటేశ్వరరావు భుక్తాయాసంతో ఆవలిస్తూ అన్నాడు. "రాజన్నగారూ మనం మధ్యాహ్నం మూడుగంటలకు రేడియో స్టేషనుకు వెళ్దాం. మీ మరదలు కూడా వస్తానంటున్నది. వారి రికార్డింగ్ కూడా అప్పుడే చేయిస్తాను." సుబ్బారావు పరిస్థితి చాలా బోర్‌గా వున్నది. కోటేశ్వరరావు నిద్ర పొయ్యాడు. రాజారాం మళ్ళీ పండుకున్నాడు. సుబ్బారావు కూడా విధిలేక శవాసనం వేశాడు.

సుబ్బారావు మెలకువగానే వున్నాడు. సాయంత్రం మూడుకు పైబడుతున్నది. రాజారాం కదిలాడు కోటేశ్వరరావు లేవలేదు. సుబ్బారావు నడిమంచంలో కూర్చున్నాడు. అతను బిక్కుబిక్కుమంటున్నాడు. "ఏరా సుబ్బా, మూడైందా?" రాజారాం హెచ్చరించుకున్నాడు. "పైబడుతోంది లేవండి మరి" అన్నాడు సుబ్బారావు కొంచెం అసహనంగా. రాజారాం లేచాడు. మరదలు వచ్చి కోటేశ్వరరావుని లేపింది. టిఫిన్ కార్యక్రమాలు అనంతరం రేడియో స్టేషనుకు బయల్దేరారు. రాజారాం మరదలి సింగారింపుతో సాయంత్రం నాలుగు కావస్తున్నది.

పాడవేల రేడికా!

ఇరవై యెనిమిదో నెంబరు టౌన్ బస్సులో వెఱుగురూ స్టేషనుకు వచ్చారు.

"ఏ. సి. ప్లాంట్ చెడిపోయి వుంది. ఢిల్లీ నుంచి రిపేరరు రావాలి." కోటేశ్వరరావు మాటలు విని సుబ్బారావు బిత్తరపోయ్యాడు. దాని అభిప్రాయ మేమిటో బోధపడలేదు. "రికార్డింగు కేమైనా అంతరాయం కలుగుతుందా ... గారు?" పీల గొంతుతో సుబ్బారావు అడిగాడు. "లేదు లేదు. కాకపోతే ... లి అడదు, రికార్డింగ్ సమయంలో." కోటేశ్వరరావు అభయం చెప్పినట్టు అంది. కోటేశ్వరరావు మొదట రేడియో స్టేషనంతా చూపించాడు. రికార్డింగ్ స్టూడియోలు, లైబ్రరీ మొదలైన వన్నీ చూపిస్తున్నా సుబ్బారావు అనాసక్తంగా వాళతో కూడా తిరిగాడు. సాయంత్రం అయిదు కావస్తున్నది. కోటేశ్వరరావు తాను చెప్పి ఏర్పాటు చేయించిన ప్రోగ్రాం ఆఫీసరుతో సుబ్బారావు సంగతి చెప్పాడు. ఆయన వరేనని రికార్డింగుకు సిద్ధమయ్యాడు. సుబ్బారావును స్టూడియో లోకి తెమ్మన్నాడు.

సుబ్బారావు లోపల అడుగు పెట్టేప్పుడు గడపకు చెప్పుకాలు కొద్దిగా తగిలింది. ఏమిటా అనుకున్నాడు సుబ్బారావు. లోపలికొచ్చాక చెప్పులు బయట పెట్టి రండని కొత్త వ్యక్తి చెప్పాడు. బయటకు వెళ్ళి సుబ్బారావు మళ్ళీ లోపలికొచ్చాడు. "మీకు కేటాయించింది మూడు నిమిషాలు మాత్రమే, మీ కవిత ఆ మేరకే చదవాలి" అన్నాడు, రికార్డు చేయడాని కొచ్చిన కొత్త వ్యక్తి. "నాకు అయిదు నిమిషాలని చెప్పారు కదండీ?" అన్నాడు సుబ్బారావు, తన గొంతు తనకే వినిపించి నట్టు లేదు. "నిజమే, మీకు ముందు ప్రసంగించిన వారు పదకొండు నిముషాలు తీసుకున్నారు ... కొక నిముషం. పోతే మీకు మిగిలింది మూడు నిముషాలు. మధ్యలో కొన్ని లైన్లు తొలగించి చదవండి" అన్నాడు కొత్త వ్యక్తి. అప్పటి కప్పుడు ఏ పంక్తులు తొలగించాల్నో బోధపడ లేదు సుబ్బారావుకు. బలి పశువు పరిస్థితైపోయింది సుబ్బారావుది. తొలగించని ఏ లైన్లయితే వేం కానిమ్మనుకున్నాడు చివరకు.


టేబిల్ ఫేన్ నీ ... కొత్త వ్యక్తి తలుపు బిగించి వచ్చాడు. గొంతు సర్దుకో మన్నాడు. కాయితం కదల కూడదండు. చేస్సైగ చేసిన క్షణం మొదలు పెట్టమన్నాడు కొత్త వ్యక్తి. గాలి లేదు. ... గా వుంది. గుండె 'గొంతులో అడ్డుపడినట్టు అనుమానంగా వుంది సుబ్బారావుకు. దడ దడగా వుంది. కొత్త వ్యక్తి చేయి వూపాడు. సుబ్బారావు చదవటం మొదలు పెట్టాడు. అక్కడున్న పెద్ద గడియారం సెకండ ముల్లును గమనిస్తూ సుబ్బారావు మూడు నిముషాల్లో స్వీయకవిత– మధ్యలో కొన్ని పంక్తులు అప్పటికప్పుడు అనుకొన్నవి తొలగించి– చదివేశాడు. బట్ట చెమటలు పట్టి పోయ్యాయి పాపం సుబ్బారావుకు. ఓ. కే అన్నాడు కొత్త వ్యక్తి. సుబ్బారావు బైట పడ్డాడు. మరో గదిలో కొత్త వ్యక్తి వలుగురికీ స్వీయకవిత రికార్డు వినిపించాడు. సుబ్బారావు తన్మయుడై విన్నాడు.

"సి. గ్రేడు వేస్తారను కుంటాను" అన్నాడు కొత్త వ్యక్తి కోటేశ్వరరావుతో.

"ఫర్వాలేదు" చిరునవ్వుతో అన్నాడు కోటేశ్వరరావు. సుబ్బారావుకు ఈ భాష (ఇంక మళ్ళీ ప్రోగ్రాం యివ్వరని) అర్థం కాలేదు. కావాలనుకోనూ లేదు. రాత్రి తిరుమల ఎక్స్ప్రెస్కు నెల్లూరు వచ్చెయ్యాలని ఒంటికాలి మీదున్నాడు సుబ్బారావు.

తెల్లవారు ఝామున మూడున్నరకు నెల్లూరు చేరుకున్నారు సుబ్బారావు, రాజారాం. సుబ్బారావు యిల్లు చేరాడు. భార్యని తొందర పెట్టాడు. వేణ్ణీళ్ళతో తలకి పోసుకున్నాడు. పొద్దున్నే ప్రాంత విశేషాలు విన్నాడు. సుప్రభాతం విన్నాడు. ఢిల్లీ వార్తలు విన్నాడు. సాహితీ స్రవంతి మొదలయింది. సుబ్బారావు నాడీ స్పందన హెచ్చింది. తన స్వీయ కవితకు ముందు ప్రసంగం వస్తున్నది. అతడు సాగదీసి చదువుతున్నట్టు వినిపించింది. వింతకీ పూర్తి కావడం లేదు. పదకొండు నిమిషాలకు ప్రసంగం అయిపోయింది. తన స్వీయ కవిత గూర్చి కోటేశ్వరరావు గొంతు వినిపించింది. ఇంక మరో క్షణంలో తన గొంతు వినిపిస్తుంది.

నిమషం దాటినా తన గొంతు వినిపించ లేదు. గుండె మంటపుట్టిందంతే! రెండు నిమిషాలయ్యాయి. సుబ్బారావు పరిస్థితి



చాలా ఆందోళనకరంగా వుంది అసహనంగా రేడియోను అటూ ఇటూ తిప్పాడు కొద్దిగా మృదువుగా అన్నాడు "వెధవ బోడిముండ రేడియోలు; డావ్ డర్రీ కంట్రీ సరుకు..." సుబ్బారావు ఆక్రోశించాడు.

"... ఈ ప్రసారంలో ఏడు గంటలా యిరవై యేడు నిముషాల నుంచి యిరవై తొమ్మిదిన్నర నిముషాల వరకు సాంకేతిక కారణాల వల్ల అంతరాయం కలిగినందుకు చింతిస్తున్నాము. తరువాత కార్యక్రమం వెంటనే..."

వారఫలం

1-8-1980 శుక్రవారం మొదలు
7-8-1980 గురువారం వరకు

మేషం : పనులు జరుగుటలేదే అని ఆవేదనపడుతారు. ఆర్థికంగా ఇబ్బందులుండవు. అనుకున్న కార్యాలు క్రమంగా, సక్రమంగా, సాంగంగా నెరవేరుటకు ఇంకా కొన్ని వారాలు పట్టవచ్చు. రావలసిన బాకీలున్నాయి. వసూలు కాలేదనే బాధకూడా చాలామంది విషయంలో చెప్పదగి ఉన్నది. తాపత్రయపడి లాభం లేదు. కార్యదీక్ష కావాలి. స్త్రీలకు : సకల సౌకర్యాలతో సహా ఆర్థిక లాభం సమకూడ నున్నది.

వృషభం: దూరదృష్టితో మీరు గావించనున్న పనులు, కార్యరూపం ధరించి, ఆర్థిక పుష్టిని కలిగించనున్నవి. ఉద్యోగ వృత్తులు లాభదాయకం. జాగ్రత్త వహించి కృషి చేస్తే, వ్యాపార, వ్యవహారాలలో అనుకూలత గలదు. మీ సాహిత్య కృషి రాణించగలదు. బాగా శ్రమించాలి. ఒక సమస్యా పరిష్కారం చేయనున్నారు. మంచిదే. స్త్రీలకు: ఉన్నత విద్య, చాలమందికి పదవులు లభించగల వారం.

మిథునం: గ్రహచారం మీకు అనుకూలం. రాశికి మూడింట గల గ్రహాలు అనేక విధాల మీకు యోగమివ్వనున్నవి. కృషి చేయండి. విద్యా వైజ్ఞానిక రంగాలలో మీకు యోగదాయకవారం. రాబడి గలదు. అప్రయత్న ధన లబ్ధి గలదు. చాలామందికి క్రీడా రంగ ప్రవేశము లభించగలదు. స్త్రీలకు : చాలా మందికి, ఉన్నత విద్యకు అవకాశం, ప్రమోషనులు, ఆర్థిక స్థోమత్తు లభించగలదు.

కర్కాటకం : పోటీవారి పోటీ ఎక్కువవుతుంది. సాహిత్య కళారంగాలలో అనుకున్న కార్యాలు సఫలం కాలేదనే తపన ఉండగలదు. ఓపికపట్టాలి. ఇంకా కొన్ని వారాలకు గాని, సర్వత్రా విజయసిద్ధి సమకూడదు. ఆర్థికంగా పుంజుకొంటారు. ఏదో ఒక విధంగా ఆదాయముంటుంది. స్త్రీలకు : సాహిత్య కళారంగ ఖ్యాతి లభించును. ప్రయత్నించండి. మేలైన వారం.

సింహం: వారంలో అధిక భాగం స్వవిషయాల కన్నా, సంఘ విషయాలలోనే అధిక శ్రద్ధ చూపనున్నారు. సభా గౌరవం, పత్రికాముఖంగా గౌరవం, ఆర్థికలాభం సమకూడగలదు. ఆకస్మికంగా దూర బంధువులు గృహానికి రాగలరు. వ్యాపార విజయం, కంట్రాక్టులలో లాభం సమకూడగలదు. సాహిత్య రంగానుభవంగల వారికి లాభమున్నది. స్త్రీలకు : గృహ కార్యాలలో విజయంగల వారం.

కన్య : వ్యాపారరీత్యా సాహిత్యపరంగా ఉద్యోగరీత్యా శ్రమపడే వారికి అనుకూల వారం, అధిక వ్యయ సూచన గల వారం. ఉత్తరాల మూలాన చిక్కుల లాభదాయకమయిన విషయంలో, ముఖ్యంగా గృహసంబంధ విషయంలో చిక్కులు కాగలవు. మన్నన లభించగలదు. సభా గౌరవం చాలామందికి సంభవించే వారం. స్త్రీలకు : ఉన్నత విద్యకు అనుకూల వారం. ఆర్థికంగా లాభదాయకమయిన వారం. కళారంగంలో చాలామందికి ఖ్యాతి లభించగలదు.

తుల : మీరు సహజంగా చాకచక్యం కలవారు. కృషి చేస్తే మీ మనోరథం సఫలం కాగలదు. అధికారులతో సంభాషించే సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. చాలమందికి లలితకళలలో ప్రవేశమున్న వారికి కొన్ని అవకాశాలు లభించనున్నవి. ప్రయత్నించండి. ఆర్థిక విజయం సాధించండి. స్త్రీలకు : ఉద్యోగ వృత్తులలో ప్రగతి గలదు. ఉన్నత విద్యకు చాలా మంది ప్రాకులాడదగిన వారం.

వృశ్చికం : ఈ వారంలో, శక్తి సామర్థ్యాలతో అనేక పనులు సాధించనున్నారు. రాదగిన బాకీలుంటే వసూలు కాగలవు. పోయిన వస్తువుల ఆచూకీ చిక్కగలదు. అల్పులైనవారితో సంబంధం అధికంగా పెట్టుకోకండి. ఆర్థికంగా మీకు లాభదాయకమైన వారం. ఆరోగ్యలోపం కనిపిస్తుంది. అధిక రాబడి ఉన్నా వ్యయం అధికమే. వ్యాపారంలో అనుకూల వారమే. స్త్రీలకు : దూరప్రయాణాలుండవచ్చు. సాగినా లాభదాయకమే. క్రీడారంగంలో అనుకూల వారంగా చాలామందికి చెప్పవచ్చు.

ధనుస్సు: ఈ వారారంభంలో మీ కార్యకలాపాలలో మార్పులు రానున్నవి. కొన్ని విషయాలలో అధిక లాభం కూడా పొందనున్నారు. ప్రయాణమవడి, ముఖ్య వృత్తిలో ప్రగతి సాధించనున్నారు. దైవికంగా వ్యాపార, వ్యవహార రంగాలలో కొన్ని మార్పులు రాగలవు. మీకు అనుకూలంగా పరిగణించగలవు. స్త్రీలకు : బంధు సమాగమం, ఉద్యోగంలో ప్రగతి, కళా ప్రావీణ్యత రాణించగల వారం.

మకరం : ఈ వారంలో మీ కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడించగలవు. సాహిత్య కళారంగాలలో మీకు నూతనావకాశాలు లభించనున్నవి. కృషి చేయండి. ధనాదాయం గల వారం. గృహ విషయంలో, విద్యాత్మకంగా మార్పులు చేయనున్నారు. ఇది మంచి వారమే. స్త్రీలకు : గౌరవం, ఆదరణ, సభా గౌరవం, కొందరకు విద్యాభ్యాసానికి అనుకూలత గల వారం.


కుంభం : ఈ వారం నుండి, ఇంకా రెండు వారాల పాటు, మీకు అన్ని రంగాలలో అనుకూలత గలదు. ఉద్యోగవృత్తులలో వికాసమున్నది. ముందు వెనుక లాలోచించి చేసే పనులలో మీకు అనుకూలత, ధన లాభం, గౌరవం సమకూడగల వారం. స్త్రీలకు : శుభకార్య ప్రస్తావన, దూరప్రయాణం సంభవం.

మీనం: మీ వృత్తి, వ్యాపారం, ఆర్థికస్థోమతు నకు ఇది అనుకూల వారం. భారీ వ్యాపారంగాని, జాయింటు వ్యాపారంగాని, మీ మనోరథ ప్రాయాలకు తగినట్లుండగలవు. ఇరుగు పొరుగు వారితో జగడాభిప్రాయాలుండగలవు. మీ తాళాలు వస్తువులు పోయే గ్రహచారమున్నది. జాగ్రత్త! స్త్రీలకు: చాలమందికి, ఉద్యోగ వృత్తులలో ప్రగతి గలదు. దైవకార్యాలు నెరవేరగలవు.

— విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి

కాలం ఉత్తిక్కిన మనసులు

చక్రవర్తి రంగస్వామి



సుందరానికి రాత్రి పడక గదిలో మళ్ళీ చెప్పింది లలిత ఖండితంగా "ఈ ఇంట్లో ఇక వుండలేం" అని.

"ఉండలేం" అంటే, తమ ఇద్దర్నీ కలుపుకొని అన్నమాట.

ఆ మాటలు లలిత మొదటిసారిగా అన్నప్పుడు, తమ అతి గాఢంగా ప్రేమిస్తున్నప్పటికీ, సుందరానికి లలిత మీద అసహ్యాన్ని కలిగించాయి.

...లలితంటే ఉండలేక పోవచ్చు. తనను కని పెంచిన తల్లి దగ్గర తను వుండలేడా! "ఏం మాటలివి!" అని ఆశ్చర్య పడ్డాను.

చాలా రోజులుగానే లలిత వేరే కాపురం పెడదామని పోరు పెడుతోంది. పోరు పెట్టినప్పుడల్లా, లోపల బాధ పడుతూనే, పైకి తల్లిపైన జాలి నిండిన కంఠంతో— "మనమే వీలాగో సర్దుకుపోవాలి. అమె పెద్దది... స్వభావం మార్చుకోలేదు... మనం మాత్రం ఎక్కడికో, కాని చోటుకు పోయి ఏమి సుఖపడగలం చెప్పూ!" అంటూ వుండేవాడు అనునయంగా, ఆమె కళ్ళల్లోకి ప్రేమగా చూస్తూ "ఓరుకో గౌరు" అన్నట్లు.

అంతతో ఆగకుండా, ఇంకా, "ఐనా, నామీద ప్రేమకొద్దీ "ఉండలేం" అంటున్నావుగాని, నేనెందుకుండలేనూ? నీవు వుండలేకపోవచ్చు అగౌ నీకు అత్త కనుక. నాకు 'అమ్మ' అని మర్చిపోయావా?" అని అనేవాడు చిరునవ్వుతో.

"ఏమీ మరచిపోలేదు. ఆమె నన్ను తన బిడ్డను నాముకున్నట్టు చూసుకుంటే, నేను మాత్రం వుండకుండలేనూ?" అన్నది చెమ్మగిల్లిన కళతో. ఎర్రబడ్డ ముక్కుతో.

తనను ప్రేమిస్తూ, తననే సేవించబడే లలితను ఆ స్థితిలో సుందరం చూసి బాధపడ్డాడు.

ఎంత ప్రయత్నించినా, విన్ని రోజులకూ ఈ విషయంలో లలిత మారనేలేదు పట్టు వదిలిపెట్టనూలేదు. సుందరాన్ని ఎక్కువగా ఒత్తిడి చేస్తుండడంతో అతనిలో క్రమంగా ఓర్పు తగ్గిపోయింది.

రాత్రి లలిత మరింత ఖండితంగా, చివరిసారిగా చెప్పడంతో, అతనికి వొళ్ళు తెలియని కోపం వచ్చింది.

"నీవిక ఈ యింట్లో వుండలేనప్పుడు నేను మాత్రం చేయగలిగేదేముంది?— వెంటనే అద్దె కొంప వెతకటం తప్ప" అన్నా

ఓక తల్లి, తండ్రీ, కొడుకూ కోడలూ వేర్వేరు కాపురాలు! లోకం నవ్విపోతుందని నీ కెందుకు తోచదు! ఐనా, నా భ్రమకానీ, నీకు లోకం తీరు ఏమి తెలుసునని?" అన్నాడు మండిపడుతూ.

ఆ మాటలు సుందరం ఎంతో కోపంతో అంటున్నా, ఆ కోపానికి వెనుక వ్యక్తపరచ లేని బాధ- తల్లిదండ్రులను వీడిపోవటం ఇష్టం లేని బాధ- కూడా వుందని, లలితకు తెలుస్తూనే వుంది. ఐనా, ఆమె వెనుకడుగు వేయదల్చుకోలేదు. ఇంట్లో అత్తగారి చేతిలో తను పడుతున్న బాధను భర్త అర్థం చేసుకోలేదన్న నిర్ణయానికి వచ్చింది.

తన మనస్సులోని కష్టాన్ని, ఆవేదనను లలిత గ్రహించక పోతే, తాము వేరుగా వుంటే కష్టనష్టాలు, అప్రతిష్ఠ తప్పవని తెలియ చెప్పడానికే అతనంత ఆవేశంతో మాట్లాడుతున్నాడు.

అతనా విధంగా వ్యక్తం చేస్తున్న బాధా, కోపమూ, అతననుకున్నట్లు లలితలో అవగాహను కలిగించలేక పోగా, పైపెచ్చు రోషాన్ని కలిగించాయి.

"ఐతే, వేరు కాపురానికి నేరమంతా నాదేనా?" అన్నది లలిత నిష్ఠూరంగా.

"ఎందుకౌతుంది? నాదే అవుతుంది భర్తను కనుక" అన్నాడు అదే ఆవేశంతో, వ్యంగ్యంగా.

లలితకూడా కోపం వచ్చి, మాట్లాడకుండా ఊరుకుంది, బుంగమూతి పెట్టి.

సుందరానికి తను నొప్పి కలిగించిందిక ఏమీ లేనిపించి, విస్సు... ంది.

ఇదివరలో కొన్నిసార్లు అమ్మతో లలితను ప్రేమగా చూడమనీ, ఆమె పుట్టింటి అలవాట్లూ, పద్ధతులూ, నీకు నచ్చక పోయినా క్షమించి క్రమంగా మార్పు తీసుకు రమ్మనీ నెమ్మదిగా చెప్పి చూశాడు. కానీ, ఆమె సుందరం మాటలను అపార్థం చేసుకుని, అతను లలిత మనిషి అయిపోయాడనీ, తానింత కాలం పెంచిందీ ఊరకే గాలిలో కలిసి పోయిందనీ అంటూ భోరున ఏడ్వసాగింది.

సుందరం నిశ్చేష్టుడైనాడు.

ఈ సంఘటన జరిగిన రోజునే బాధతో ఏదో నిర్ణయానికి వచ్చినట్లు కనబడ్డాడతను.

ఆ పరిస్థితుల వేడిలో, మర్నాడే అద్దె యిల్లు దొరికించుకుని, లలితతో బయటికి నడుస్తున్నాడు, ఇష్టం లేకపోయినా.

ఇదంతా చూసి అనంతలక్ష్మమ్మ "ఎక్కడికిరా నాయనా?" అని దీర్ఘం తీస్తూ అడిగింది.

"అద్దె యింటికి"

"ఎందుకూ?"

"నీ కోడలు, నీవూ, ఒకరికొకరు దూరంగా వుంటే మంచిదని!"

"అలాంటప్పుడు నీవెవరికి దూరంగా వుంటావు?" అని సూటిగా అడిగి, కళ్లలోకి చూస్తూ— "ఐతే ఇదంతా నా వల్లనేనా?" అని అడిగింది.

"చూడమ్మా! నీ వల్లా కాదు, లలిత వల్లా కాదు; అంతా నా వల్లనే" అంటూ తలదించుకున్నాడు. తాను ఏది చెప్పినా ఆమె అర్థం చేసుకోదన్న నిరాశతో.

"ఔను, అదుపులో వుంచడం చేతకానప్పుడు అలా అనుకోక తప్పదు మరి."

"ఏమో నమ్మా! నీ యిష్టం వచ్చినట్లు అను" అని, యిక ఆమెతో మాట్లాడకుండా బయటికి నడుస్తున్నాడు. లలిత నిండా చెమట పట్టుకొని భర్త వెంట నెమ్మదిగా అడుగులు వేస్తోంది.

లక్ష్మీనారాయణగారికి ఇదేమిటో అర్థం కాలేదు. హఠాత్తుగా ఏదో ముంచుకు వచ్చినట్లు మాత్రం తోచి, బయటికి నడుస్తున్న కొడుకు వెంట ఆదుర్దాగా తడబడుతున్న అడుగులతో నడుస్తూ, అతని ముఖంలోకి చూస్తూ వణకుతూన్న కంఠంతో అడిగారు -

"ఎక్కడికీ? ఎందుకూ? నాతో చెప్ప కూడదట్రా సుందరం?"

"ఇందులో ఎవరికి తెలియందేముంది నాన్నా? అత్తా కోడలూ ఒక యింట్లో వుండలేక పోవడం లోక సహజం— ఎంతో సంస్కారం వుంటే తప్ప మనింట్లో అంత సంస్కారం లేదు. అదే సంగతి. అంతకంటే ఏమీలేదు."

"అయితే అందుకోసం యింట్లోంచి, వెళ్ళిపోవాలా?"

లక్ష్మీనారాయణగారి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. శరీరం కంపించింది.

అప్రతిభుడై, సుందరం ఏమీ చెప్పలేక పోయాడు.

"అత్తా—కోడలు ఘర్షణ ఎప్పుడూ వుండే పాత పాటే గదట్రా! ఈ కాస్త దానికే ఇంతపనా?... పదమ్మా లలితా! నా మాటవిని, ఇంట్లోకి పద!... మీకింకా చిన్నతనం. మీరేమి చేస్తున్నదీ ఇప్పుడు తెలియదు. అంతా మించిపోయాక— అప్పుడు— తెలుస్తుంది. చేతులు కాలాక, ఆకులు పట్టుకున్నట్లుంటుంది... ఊఁ, వెనక్కి తిరగండి, ఇంట్లోకి పదండి!" అని లేని శక్తిని తెచ్చుకుని, దృఢ స్వరంతో అన్నాడు. తన మాట ఈ పరిస్థితిలోనైనా వింటా రన్న నమ్మకం ఆయనలో ఏ మూలో చివరి ఆశగా వుంది.

కానీ, ఊహూఁ. ఆయన మాట పనిచెయ్య లేదు. ఆ ఉప్పెన ఆగిపోలేదు. ముంచు కొచ్చింది.

...అలా స్వంత ఇల్లు వదలిన సుందరం, ప్రవాహంలో కొట్టుకు పోతున్నట్లు తన తాలూకా, జిల్లా కూడా వదలి, చివరకు రాష్ట్ర రాజధాని చేరుకుని, అతి కష్టం మీద ఒక ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం సంపాదించుకుని, కుటుంబాన్ని పోషించు కుంటున్నాడు.

ఇంటింటికి భోజనం!

జపాను దేశంలో ప్రస్తుతం "వంటింట్లో విప్లవం" ప్రారంభమైంది. చాలా మంది గృహిణులు కిరాణా కొట్లను, వంట సామాగ్రిని వదిలేసి, వండివార్చిన ఆహారానికే అధిక ప్రాధాన్యత నిస్తున్నారు. ఈ వండిన ఆహార పదార్థాలను నేరుగా ఇంటికి తీసుకొచ్చి అందిస్తారు. సుమారు పదిహేను లక్షల కుటుంబాలు- మూడు పెద్ద కంపెనీలు, మరికొన్ని చిన్న కంపెనీల మీద తమ ఆహారానికై ఆధారపడి వున్నారు. ఇది కేవలం పట్టణ ప్రాంతాలలోనే కాక గ్రామ ప్రాంతాలలో కూడా రైతుల భార్యలు తగినంతగా వీరికి ఖాతాదారులైనారు. దీనివలన చాలా శ్రమ మిగులుతుందని వీరు భావిస్తున్నారు. రంగు రంగుల బొమ్మలతో, ఆకర్షణీయంగా వున్న కేటలాగు నుండి తమకు కావలసిన పదార్థాలను ఒక్కసారి టెలిఫోనులో చెబితే చాలు! గుమ్మం ముందర ప్రత్యక్ష మౌతాయి.

ఒకదాని వెంట ఒకటిగా రోజులు గడిచి పోతున్నాయి.

2

కోడలితో కలిసి కొడుకు ఇంట్లోంచి వెళ్ళి పోవడం లక్ష్మీనారాయణగారిమీద చాలా పెద్ద దెబ్బ కొట్టింది. వాళ్ళటు వెళ్ళగానే ఆగాధ శోకంతో దశరథుడిలా కూలి పోయారు. అనంత లక్ష్మమ్మ ఆయనవెయ్యి పెట్టుకుని, విర్జీవమైన బరువును మోస్తున్నట్టు, విసుగ్గా లోపలికి తీసుకుపోయింది.

అప్పటి నుంచీ, ప్రతి రోజూ ఉదయమే లక్ష్మీనారాయణ, అనంతలక్ష్మమ్మల మధ్య యిదే విషయం మీదుగా ఘర్షణ ప్రారంభమై, అర్ధరాత్రి వరకు పరాకాష్ఠ నందుకునేది. వాళ్ళు నిద్రపోయిన కొంచెంసేపు మాత్రమే, యిల్లు నిర్మానుష్యమయ్యేది. మళ్ళీ ఉదయమే ఘర్షణ మొదలయ్యేది.

లక్ష్మీనారాయణగారికి మొదటి నుంచీ పుత్రప్రేమ ఎక్కువ. దాన్ని అతి గారాబం అని అందరూ ఆక్షేపించేవాళ్ళు. అందుకాయన తేలిగ్గా నవ్వేసేవారు.

ఇప్పటికీ ఆ ప్రేమ పదిలంగా అలాగే వుంది ఆయనలో. కోడలు కాపురానికి వచ్చినా, చెక్కు చెదరలేదు. పైగా కోడల్ని కూడా తన కూతురన్నంత ప్రేమగా చూసుకునేవాడు.

సుందరం పెద్ద చదువుల జోలికి పోలేదు ఉద్యోగం కోసం ప్రాకులాడనూ లేదు. పెద్ద ఆస్తి లేకపోయినా, తిండికి కొదవ లేదు. అదీగాక, పెద్ద చదువులు చదివి, ఉద్యోగం పేరుతో ఎక్కడికో వెళ్ళి అయినవాళ్ళకు అందుబాటులో వుండలేక పోవటం లక్ష్మీనారాయణగారికి సుతరామూ ఇష్టంలేదు.

అయితే, అనంతలక్ష్మమ్మ సుందరాన్ని ప్రేమించలేదని కాదు. కానీ, కోడలు వచ్చినప్పటినుంచీ, ఆమెలో చాలా మార్పు వచ్చింది. లలిత ఆమెను మొదట 'అమ్మా' అని పిలిచేది ఆప్యాయంగా. క్రమంగా పని పాటల పట్ల అసంతృప్తి ప్రకటించటం, కఠినంగా శాసించటం, సాధించడం ప్రారంభించడంతో అత్తగారియందు లలితకున్న గౌరవం తగ్గి, తేలిక భావం కలగడం మొదలైంది. చివరకు యిద్దరూ ప్రత్యర్థులైనారు. ఒకరిమీద ఒకరు సుందరంతో చాడీలు చెప్పుకోసాగారు. చివరినీ సుందరం సమర్థించడం లేదు కనుక ఇద్దరికీ అసంతృప్తి కలిగింది. అనేదు— "వేరే పండక తప్పదు" అనే నిర్ణయానికి వచ్చింది లలిత. అందుకే ఆమె అంతగా పోరింది భర్తతో.

లక్ష్మీనారాయణగారికి ఎలాంటి కట్టుబాట్లూ పనికిరావు ఐనా, అగావది అధికారం చాలాయించే తత్వం కాదు కనుక, ఆయనకు ఆ ఇంట్లో ఎవరూ భయపడవలసిన పనిలేదు. అందుకే అనంతలక్ష్మమ్మకు బోలెడంత స్వాతంత్ర్యం ఉంది.

"సుందరం లలితతో కలిసి వెళ్ళి పోయాడు. కనుక సుందరం లలిత మనిషి! ఇక తనకు సుందరం మీద ప్రేమ వుండీ ప్రయోజనం ఏమిటి?" అనుకున్నది అనంతలక్ష్మమ్మ.

కానీ లక్ష్మీనారాయణగారికి లలిత మీద ద్వేషం కలగనూ లేదు, సుందరం మీది ప్రేమ తగ్గనూ లేదు.

వృద్ధుడైన లక్ష్మీనారాయణగారు భార్యతో జరుగుతున్న నిత్యఘర్షణతో, పుత్రవియోగ దుఃఖంతో బ్రతుకలేక పోతున్నారు. కొంతకాలం ఓర్చుకుంటే, అంతా సర్దుకుపోయే విషయాన్ని పెద్ద సమస్యగా తయారుచేసి, వేరే కాపురం పెట్టే స్థితికి వాళ్ళను తరిమిందని భార్య మీద ఆయనకు కోపం.

3


సుందరం నిత్యజీవితం శ్రమపడి సంపాదించి తెచ్చి భార్య చేతికిచ్చేంతవరకే పరిమితమైపోయి, మిగతా అన్ని పనులూ చూసుకునేంతవరకూ లలిత దినచర్య విస్తరించింది. దానితో ఆమెకు లోకజ్ఞానంతో సహవాసం, ఇతరులతో మర్యాదగా మాట్లాడవలసిన తీరూ తెలిశాయి.

ఇప్పుడు వాళ్ళకు ఒక పిల్లవాడూ, ఒక పిల్లా.

తనూ తండ్రి కావడంతో సుందరానికి తనను నాన్న ఎంత గోముగా పెంచాడో ఇప్పుడూ జ్ఞాపకం వచ్చేది. ఇప్పుడూ నాన్నకు తనమీద అంత ప్రేమా వున్నదని తెలుసు. అప్పుడప్పుడూ తల్లిదండ్రుల మీద గాలి మళ్ళి అనేక ఆలోచనలు చెలరేగేవి. తనొక దుష్కార్యం చేసినట్టూ, తను చేసింది పెద్ద పొరపాటే అన్నట్టూ అనిపించేది. తల్లిదండ్రులకు తానేదో తీరని అన్యాయం చేసినట్టు తీవ్రమైన వ్యధ అతని మనస్సు పొరల్లో తరచూ కలకవేస్తూ వుండేది.

ఇలా వుంటూ వుండగా ఒకనాడు సుందరానికి టెలిగ్రాం వచ్చింది. రాత్రి ఇంటికి రాగానే చూసుకొన్నాడు. నాన్నకు జబ్బుగా వుందనీ, వెంటనే బయలుదేరి రావలసిందనీ అమ్మ యిచ్చిన టెలిగ్రాం అది.

ఆ రాత్రంతా నాన్న గురించిన ఆలోచనలతో సుందరానికి నిద్రపట్టలేదు. భయం, దిగులూ వేశాయి. దుఃఖం ముంచుకొచ్చింది. తనూ, లలితా ఇంట్లోంచి బయటికి వచ్చిన నాడు ఆ రోజు తన ముఖం చూస్తూ, వణుకుతూ తనతో పాటు అడుగులు వేస్తూ— "మీరింకా చిన్న పిల్లలు. ఏమి చేస్తున్నదీ మీకు తెలియదు. వెనక్కి తిరగండి. పెద్ద



వాణ్ని, నామాటవిని ఇంట్లోకి నడవండి" అని అనడం అతనికి వినిపిస్తూ, దృశ్యం కనిపిస్తూన్నట్లుంది. నాన్న ఆకృతి-తనూ, లలితా, అమ్మా చేసిన గాయాలతో దీనంగా వెనుదిరిగి, చీకటి మబ్బుల్లోకి వెళ్ళుతున్నట్లు కనిపించింది.

ఎలాగో తెల్లవారింది. ఆఫీసుకు వెళ్ళి సెలవడిగి, అడ్వాన్సు తీసుకొని, రాత్రి రైల్లో ఊరికి బయలుదేరి, మర్రోజు మధ్యాహ్నానికి చేరుకున్నాడు.

ఇల్లు తుఫాను అనంతరం సొమ్మసిల్లి పడివున్న ఊరులా హృదయ విదారకంగా వుంది. ఇంటినిండా మనుషులు. నాన్నజాడ మాత్రం కనపడలేదు. భయంకరమైన నిశ్శబ్దం ఆవరించి వుంది. అక్కడ చేరిన వారందరూ తనను పితృద్రోహిని చూస్తున్నట్టు, చూస్తున్నారనిపించింది. కళ్ళు చెమ్మగిల్లాయి. దుఃఖం పొంగి పొరలి వస్తోంది.

అంతలో శేషాద్రి మామయ్య, దగ్గరికొచ్చి నెమ్మదిగా చెప్పాడు— టెలిగ్రాం యిచ్చిన కొంచెంసేపటికే నాన్న శాశ్వతంగా కన్ను మూశాట్ట. జరుగవలసిన తతంగమంతా శేషాద్రి మామయ్యే జరిపించాట్ట. "నీవు ఇప్పటి కొచ్చావ్, నీకష్టం ఏమిటో" అని.

సుందరానికి అది వినటంతోటే ఏడుపు ముంచుకొచ్చింది. కన్నీళ్ళతో చిన్న పిల్లవాడిలా అమ్మ దగ్గరికెళ్ళి కూచున్నాడు.

అమ్మ ఏడుస్తూ, కళ్ళు తుడుచుకుంటూ కూర్చుంది. సుందరానికి ఏడుపు రావటం తప్ప, అమ్మతో ఏమిమాట్లాడాలో తెలియటంలేదు. దుఃఖంలో మునిగివున్న ఈ అమ్మ, తాను ఇల్లు వదలిపెట్టి వెళ్ళే ముందు తనను అసహ్యించుకుంటూవున్న అమ్మ కాదు అనిపించింది.

అశ్రువులు నిండిన కళ్ళతో అనంతలక్ష్మమ్మ, కొడుకు వేపు అదేపనిగా చూస్తోంది దయగా.

తన కొడుకు పసిపిల్లవాడిలా, తండ్రి కోసం ఏడుస్తున్నాడు. అది చూసి, ఆమె హృదయం తరుక్కుపోతోంది. ఆమెలో ఏదో పెద్ద మార్పు అలజడితో ప్రారంభమైంది.

ఎంత ఏడ్చినా అక్కరాని తండ్రి కోసం ఆరాటపడుతున్న కొడుకు మీద జాలి ముంచు

కొచ్చింది. తండ్రి మీద అంత ప్రేమ వున్నవాడు, ఇలా వదలి వెళ్ళాడు? ఎలా వదలివెళ్ళినా, తండ్రి మీద ఇంత ప్రేమ వుందా? మరి తల్లి అయిన తన మీద ఇంత ప్రేమ ఉండదా?... తప్పకుండా ఉంటుంది. ఉన్నా ప్రకటించటానికి చేతగాని పసిహృదయాలు, యువకుల్లో, వృద్ధుల్లో కూడా ఉంటాయేమో!... తన హృదయమూ అలాంటిదేమో అనిపించింది. సుందరం మీద తనకు ప్రేమ లేకపోలేదు; ఉన్న ప్రేమను ప్రకటించటమూ చేతకాలేదు. తదనుగుణంగా ప్రవర్తించటమూ చేతకాలేదు. లలితను తాను సహజంగా కోడలిపిల్లకు తల్లిలా, ఎందుకు చూడలేకపోయిందో! అదే తన తప్పు. లలిత పట్ల తన అసహజ ప్రవర్తనను ఆమె జ్ఞాపకం చేసుకుంది. తనమీద తనకే అసహ్యం కలిగింది. సిగ్గనిపించింది! ఇంత పెద్ద ఆపద కలిగిన తరువాత ఇప్పుడు మాత్రమే, తనకు తన తప్పు తెలిసివస్తుందనిపించింది. తన ప్రేమకు ప్రతిబింబాలను తను హింసించింది! ఎంత పెద్ద పొరపాటు!! "ఎలా సవరించుకోవడం?" అని ఆమె ఆలోచిస్తోంది లోతుగా.

4

సుందరం తండ్రి పోయిన సంగతి భార్యకు వెంటనే టెలిగ్రాం కొట్టాడు. తనకిది గొప్ప ఆపదనిపించి ఆమె మనస్సు విలవిల్లాడిపోయింది. వెంటనే తిరిగివస్తామనే ఉద్దేశ్యంతో పిల్లల్ని ఇంటి పట్టునే వదలి అత్తగారి ఊరికి బయలుదేరింది.

వచ్చిన లలిత విషాద వదనంతో అత్తగారి దగ్గరికెళ్ళి కూర్చుంది. తనకు తెలియకుండానే చేతులు జోడించి నమస్కారం చేసింది. ఆమె తల వంచుకొని, కళ్ళు తుడుచుకుంటుంది.

లలిత, అత్తగారినుండి మొదట టెలిగ్రాం రావటం, భర్త బయలుదేరి రావటం, మామగారు కోలుకుంటారని వార్త వస్తుందని వినుకుంటూండగా భర్త పంపిన టెలిగ్రాం రావటం, పిల్లల పరీక్షలు, కష్టసుఖాలూ, అరమరిక లేకుండా వివరించి చెప్పింది.

అత్తగారు మౌనంగా అంతా వింటూ వుంది.

లలిత బయలుదేరి వచ్చేటప్పుడు గతం తాలూకు ఏ 'ద్వేషం' తన మనస్సులో లేకుండా జాగ్రత్తగా చూసుకొని మరీ వచ్చింది. మామగారు పోయినందుకు తన మనస్సులో ఇంత విచారం కలగడం, అత్తగారి మీద ఇంత సానుభూతి కలగడం — తనలో ఎంతో గౌరవంతమైన మార్పుగా ఆమె గుర్తించింది. ఈ గుర్తించగలగడంతో తాను మానసికంగా ఎంతో ఎదిగినట్లు ఆమె అనుభూతి పొందింది. ఈ ఎదుగుదల తనూ, భర్తా కలిసి వేరే వుండటంలోని అనుభవాల వల్ల కలిగిన మేలు అని ఆమె తెలుసుకున్నది. అత్తవారింట్లో వున్నప్పుడు అదేది! చాలా చిన్న ప్రపంచం. వాకిట్లో తిండీ, నిద్రా, సాధింపూ, వ్యధ వరకే పరిమితంగా వుండేది. తరువాతి అనుభవంలో మరింత విశాల ప్రపంచం పరిచయమయింది. అక్కడ ఎలాంటి ఇరుకూ లేదు.

అదంతా ఇప్పుడాలోచిస్తే, తనలో అప్పుడు సహనం, కొరవడడం స్పష్టంగా తెలుస్తూనే ఉంది. బహుశా ఇప్పుడైతే, లోకజ్ఞానంవల్ల ఎదిగిన మనస్సుతో, అంత తొందరపడి వుండేది కాదు. ఇప్పుడు తనలోకి, ఇతరులను క్షమించే శక్తీ, తన తప్పులను గుర్తించి ఒప్పుకుని క్షమించమని కోరే శక్తీ, ప్రవేశించాయని అనుకుంది.

5

కర్మకాండ యథావిధిగా పూర్తయింది. బంధువులందరూ వెళ్ళిపోయారు. అనంతలక్ష్మమ్మ సుందరాన్ని ఇక్కడే వుండిపొమ్మని యేమీ అనలేదు. ఆమె ఆంతర్యం ఏమిటో సుందరానికిగానీ, లలితకుగానీ బోధపడలేదు. ఆమె పట్టుదల స్వభావం సుందరానికి తెలిసిందే! తనమీద వాత్సల్యం లేదని లలితకూ తెలిసిందే.

సుందరం అమ్మ దగ్గర కూర్చుని వున్నప్పుడే శేషాద్రి మామయ్య ఇలా అన్నాడు—

"పది రోజులపాటు నువ్విక్కడుంటే, నేనొకసారి మా వూరు వెళ్ళి తొందరపనులు చూసుకొని వస్తాను. నువ్వెలాగూ హైదరాబాదులో వుండేవాడివే. నేనూ, మా ఆవిడా ఎలాగూ మా అక్కను కనిపెట్టి చూసుకుంటూ వుండక తప్పదు."

సుందరం ముఖం వెలవెలపోయింది. ఐనా, వెంటనే తేరుకుని— "అమ్మ వుండదలిస్తే ఇక్కడే వుండిపోవాలని, లేదా నాతో వస్తే తీసుకుపోదామనే వచ్చాను" అన్నాడు దృఢంగా.

"ఏమిటీ! విశేషం లాంటి ఉద్యోగం వదులుకొని వచ్చి, ఇక్కడే వుండిపోతావా? ఇక్కడుండి ఏం బావుకుంటావ్? మీ అమ్మకు ఏమంత ఆస్తి వున్నదని ఆశపెట్టుకున్నావ్?" అన్నాడు శేషాద్రి మామయ్య కత్తిమొనలా గానూ.

ఇంతలో అనంతలక్ష్మమ్మ కొడుకువేపు చూస్తూ ఇలా అన్నది—

"వాడు సుందరం! నువ్వు కుటుంబంతో ఇక్కడే వుంటే, మనకున్నది తినటానికే చాలదు. ఎలాగూ అక్కడ సుఖంగా సంపాదించుకుంటున్నావు. ఎందుకు చెడగొట్టుకొని వస్తావ్? నా సంగతంటావా? మామయ్య దగ్గర్లోనే వున్నాడు. నన్ను కనిపెట్టుకొనే వుంటాడు. నువ్వు అప్పుడప్పుడూ వచ్చి చూసిపోతూండవమ్మా."

సుందరానికి పై ప్రాణం పైనే ఎగిరి పోతున్నట్లయింది. అది తనను పట్టుకున్న దురదృష్టమేతప్ప, ఎవరి అమ్మా ఇలా మాట్లాడదనుకుని శూన్యంలోకి చూస్తూ, బరువుగా—

"నీ యిష్టం అమ్మా! నేను నీకు ఏమి చెప్పగలను? నీవెలా అంటే అలాగే! ఐనా, నా దగ్గర మా అమ్మ ఉండకూడదా అమ్మా! లోకంలో ఎవరైనా, తనకూ కొడుకున్నప్పుడు, తమ్ముడూ మరదలూ అంటూ వాళ్ళ దగ్గరకెళ్ళి వృద్ధాప్యాన్ని ప్రశాంతంగా గడపగలరా అని నా సందేహం" అన్నాడు.

ఇంతలో లలిత కల్పించుకొని, అత్తగారి కళ్ళలోకి వినయంగా చూస్తూ "అత్తగార్! మిమ్మల్ని మా దగ్గర వుంచుకోటం మా బాధ్యత. ఇదివరకు నా వల్ల జరిగిన దానికి క్షమించమని మిమ్మల్ని కోరాలని కొన్ని రోజులుగా మనస్సులో అనుకుంటూనే వున్నాను. కానీ, ధైర్యం చాలలేదు." అని చొరవగా అన్నది.

అనంతలక్ష్మమ్మ లలితవేపు ఆశ్చర్యంగా చూసింది.

ఆమెను పరీక్షగా చూస్తున్న లలిత, ఆమెలో తనపట్ల మునుపటంత కాఠిన్యం, వైరభావం కనపడకపోవడంతో, ఉత్సాహం తెచ్చుకుంది.

"మన ఆస్తి ప్రసక్తి లేకుండానే, నేను నిన్ను పోషించుకోగలను అమ్మా!" అన్నాడు సుందరం స్థిరకంఠంతో.

ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి.

సుందరానికి తన తల్లి — లలిత రాక ముందూ, వచ్చిన కొత్తల్లో ఎంత ప్రేమగా ఆప్యాయతతో చూసిందో — అంత ప్రేమగానూ, అంత ఆప్యాయంగానూ ఇప్పుడు కనిపించింది.

ఆమె కళ్ళు నిర్మలంగా, ప్రేమాశ్రువులతో నిండి వున్నాయనిపించింది ఆ దంపతులకు.

శేషాద్రి మామయ్య ముఖం పాలిపోవటం కనిపించింది.

ఆ క్షణంలో సుందరానికీ, లలితకూ, అనంతలక్ష్మమ్మగారికి కూడా— లక్ష్మీనారాయణగారి ఆనాటి మాటలు జ్ఞాపకం వచ్చాయి.

"...వదినా! లలితా! నా మాట విని ఇంట్లోకి పద!.. మీరింకా చిన్న పిల్లలు. ఏమి చేస్తున్నదీ మీకిప్పుడు తెలియదు... అంతా మించిపోయాక అప్పుడు తెలుస్తుంది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టుంటుంది... ఊఁ! వెనక్కి తిరగండి, ఇంట్లోకి పదండి!"

తన మాట వినకపోయినా ఆనాటి లక్ష్మీనారాయణగారి ఆశ, ఆయన లేకపోయినా ఈనాడు ఫలించింది.

భయం

వెక్క ప్రేమ కారు వెనక
మ్యాం విహార కూచుని ఫోటో దిగితే
ఏ విన్నర్‌లా ఉంటాము...
పైజామా లాల్చీవేసుకుని
షైరు కెళ్తానంటే
కుర్రజమీందార్లా ఉంటాము...
మైకులో లెక్చర్ దంచానంటే
పండిత పామరులంతా హడల్...
ఫైళ్ళముందు కూచున్నానంటే
అరగంటలో అరవై ఫైళ్ళు జాట్
డిటొచ్చి...
దినవెచ్చాలు తెమ్మనే
బెటర్ హాఫంటేనే భయం!

— 'లెఫ్టినెంట్ కిషన్'

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

బి వి ఎస్ ఆర్. — గుడివాడ

సృష్టిలో తీయనిది స్నేహమే అన్నారు. ఆ స్నేహితులే తీయని మాటలతో నమ్మించి గొంతు కోస్తున్నారు. మరి యిలాంటి వారినేమనాలి?

అంత డబ్బుల రంగడైతే కష్టం చిట్టితల్లీ. తీయని మాటలు వింటున్నా వ్యక్తిగత గౌరవం, ఆత్మాభిమానం సంగతి మరిచి పోకూడదు. అది మరచిన వాళ్లనే— అంతా వో ఆట పట్టించేది.

బాధించినా నిజం చెప్పాలంటాడు నా ఫ్రెండు. అబద్ధం అయినా సంతోష పడేదిగా వుండాలంటాను.

నిజం ఒక్క క్షణం తల దిమ్మెక్కిస్తుంది. అబద్ధం నాన్చి నాన్చి చంపుతుంది. ఎప్పుడు కత్తివేటుగా సూటిగా, పదునుగా చెప్పెయ్య నిజం. అప్పుడు అదెక్కువ బాధ పెట్టదు. కనువిప్పు కల్గిస్తుంది.

వి. వి — మద్రాసు

దేనికి మనిషి భయపడాలి?

చెడు చేయడానికి భయపడితే చాలు. ప్రపంచములో ఇక దేనికీ భయపడనక్కర లేదు.

ప్రభాకర్ — జనగామ

ప్రేమ వివాహాలు ఎంతవరకూ సఫలీకృతం అవుతున్నాయి. కోరుకున్నవిధంగా జీవించడానికిలాంటి వివాహాలవల్ల అర్హతవుందా ?

'ఒకరే' కోరుకున్న విధంగా ఏ వివాహమూ సఫలీకృతం అవదు. పెళ్లి యిచ్చి పుచ్చుకోడాలలోవుంది. పుస్తెపూసల్లో కాదు. ఏ పెళ్లి అయినా సుఖశాంతులతో సమస్యలతో సతమత మవుతూ కూడా నిల బడ కల్గాలంటే వోర్పు వోదార్పు, ఒకరిపై ఒకరికి గౌరవం, ఆదరం అన్నీ కావాలి. కలిసి బ్రతకడం ప్రారంభించిన దగ్గర నుంచీ కలిసి బ్రతకడానికి అనునిత్యం ప్రయత్నం చేస్తూనే వుండాలి. అది ఏ ఒక్క సైడునుంచి తగ్గినా— ఒడిదుడుకులు తప్పవు. మగాడివిసుక్కి ఆడది దెప్పుతుంది. ఆడదాని సాధింపు మగవాడ్ని యింటికి దూరంగా ఉంచుతుంది. ఆ దూరంగా వుంచడం యింకోరకం సాధింపుకి దారి తీస్తుంది. యిలా చిలు తలకాయిత సమస్యలు వేరు వుల్లా పెరిగి సంసారరథాన్ని అటూ ఇటూ లాగి కూల దోస్తాయి. ఆ కూలిన శిధిలంలో చితికి పోయేది పిల్లలు. అంచేత ప్రేమవివాహం, పెద్దలు చూసిచేసిన వివాహం అన్న ప్రసక్తి లేదు. ఏ పెళ్లయినా పదికాలాల పాటు సాగాలంటే, మొగుడూపెళ్లాలిద్దరూ సర్దుకు పోతూ వుండాలి. నేను మగవాణ్ణి నేనెందుకు సర్దుకు పోవాలన్న అహంతలెత్తకూడదు. "పెళ్లయ్యేదాకా ఒకమనిషి పెళ్లయ్యాక అరమనిషిను మగాడు" అనే వాడు మా పెద్దమామయ్య.

ఆర్. జి. పి. కె. — మర్లపూడి.

ఆడపిల్ల కన్పిస్తే చాలు. ఆకలిగొన్న పులుల్లా చూస్తూ అల్లరిచేసే వారికి మరిచి పోలేని పాఠం చెప్పాలనుంది.

దండం దశగుణం భవేత్ అనికదా— పెద్దల మాట. అందుకే ఇందిరమ్మ యీవ్ టీసింగ్‌కి — ఫ్లాగింగ్— విప్పింగ్ పెట్టొళ్ళప్ప మార్గం లేదని ఆలోచిస్తున్నది.

పి. పి. — కరీంనగరు

రచయిత్రిగా మీ అనుభవాలు ఏమిటి?

నిల్.

ఇంతవరకు ఎన్ని నవలలు నాటికలు, కథలు వ్రాశారు?

తెలియదు. అచ్చయినవి వో పదిహేను నవలలు రెండు కథానికా సంపుటాలు ఉంటాయేమో. ఇక రేడియో నాటికలు రాయడం వరకే గాని నేను సేకరించి పెట్టుకోలేదు.

పి. ఎమ్; వి; ఆర్, వి; జె; వి కె; వి; జె — చిత్తూరు

మనస్సాక్షి విలువ కన్న డబ్బు కే విలువ నిచ్చే మనుషులను ఏ జాబితాలోకి చేర్చాలి ?

తొలి జాబితాలోనే వుండాలి వాళ్ళు, లోకం పోకడ, బ్రతుకు తెరువు తెలిసిన వాళ్ళు — వాళ్లే.

ఉద్యోగాలే కరువైన నేటి కాలంలో వరకట్న విషయానికి మీ సలహా ఎంతవరకు సమంజసం?

నూటికి నూరు పాళ్ళు. అయినా ఉద్యోగానికీ కట్నంకీ కాదు సంబంధం— కట్నానికీ పెళ్లానికి అంకె పెట్టడమే — అసహ్యం.

నమ్మించి మోసం చేసిన కిరాతకులను ఏమనాలి?

అంత సులభంగా నమ్మేయడం కూడా తప్పుకదా!

ఎమ్. ఎస్. ఆర్ — మణగూర్ కొలరీస్

అక్కయ్యా— విన్ను మాలతీచందూర్ లాగా పెద్ద పెద్ద ప్రశ్నలు, ఎమ్.వి.ఎల్.లాగా చిన్నచిన్న క్వొశ్చన్స్ అడుగుతారేం?

మాలతి సైజు చిన్నది! ఎమ్‌విఎల్ మెదడు పెద్దది! శరీరం ఎక్కువ అయిన కొద్దీ మెదడు తక్కువ కదా— అందుకే అటూ యిటూ కాని ప్రశ్నలు వేస్తుంటే అటూ యిటూ గాని సమాధానాలు యివ్వాలని తాపత్రయపడుతూ వుంటాను శోభారాణీ.

రాజేంద్ర — అదోని.

మీ రచనా జీవితం ఎన్నేళ్ళ క్రితం ప్రారంభమైంది ? ఇందులో ఏమి సాధించారు. భవిష్యత్తులో మీ ఆశయం ఏమిటి ?

1951లో తొలిరచన చేశాను. అదీ పత్రికా కార్యాలయంలో చేరాకనే. అప్పుడే తొలిసారి రేడియోలో ప్రసంగించాను. అప్పటి నుంచీ యిప్పటి దాకా— ఒకటి వృత్తిగా, రెండోది సరదాగా సాగిస్తూనే ఉన్నాను. ఏం సాధించానంటే ఏం చెప్పను ? నా వాళ్ళు సిగ్గుపడే రచనలు చేయలేదని మాత్రమే చెప్ప కలను. ఇక-బుడగలాంటి ఈ జీవితం తూట్లుపడింది. పూర్తిగా పోయేలోగా "కూకటివేళ్ళు" అనే నవల ముగించాలన్న దొక్కటే ఆశ.


జి. ఎమ్. ఆర్. — విజయవాడ.

స్వేచ్ఛ ఎక్కడ ఉంటుంది ?

దైవత్వం ఉన్నచోట.



Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, Mallikarjuna Rao Street Gandhinagar, Vijayawada-3. Editor : S. Radhakrishna.


వై.ఎల్.ఎన్. పిక్చర్స్
ధర్మచక్రం
ఈస్ట్‌మన్ కలర్
నిర్మాత: వి.యస్. నరసింహారెడ్డి
స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: దీపక్
లక్ష్మీచిత్ర శ్రీలక్ష్మీచిత్ర
కథ: డా॥ ఎమ్. ప్రభాకరరెడ్డి సంగీతం: సత్యం నిర్వహణ: టి. భిక్షమయ్య